


అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్ 05

కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తూ కేరళలో 'లేబర్ కాంక్లేవ్' సదస్సు

ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితి 05



సంపుటి 09, సంచిక: 20 | మంగళవారం | 16-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో ఘటన
- పెద్ద శబ్దం రావడంతో భయందోళనకు గురైన కార్మికులు
- పరిశ్రమ వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాపక్షం / మనోహరాబాద్ /మెదక్

ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలో భట్టి పేలడంతో ఒకరు మృతి మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం చెట్ల గౌరారం రంగయ్యపల్లి గ్రామల మధ్యలో చోటుచేసుకుంది. పరిశ్రమలో ఇనుమును కరిగించే బట్టి భారీ సౌండ్‌తో పేలడంతో అక్కడే పనిచేస్తున్న అన్ను విశ్వకర్మ (35) అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు రాజేష్, పాండేలకు తీవ్ర గాయాలు అయ్యాయి. పరిశ్రమంలోఒక్కసారిగా పొగ కమ్మి వేయడంతో కార్మికులంతా భయాందోళనకు గురయ్యారు. అలాగే రంగయ్యపల్లి చెట్ల గౌరవం మధ్యలోని గ్రామాలకు అతి చేరువలో పరిశ్రమ

తరువాయి 12లో



## ఉపాధి హామీ పథకం రద్దు


# గాంధీ పోయే... గజిబిజి వచ్చే...



**'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' పథకం తెచ్చేందుకు కేంద్రం కుట్ర**

**న్యూఢిల్లీ:** గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) రద్దు చేసేందుకు మోదీ సర్కార్ సిద్ధమైంది. దీని స్థానంలో గ్రామీణుల ఉపాధి కోసం కొత్త చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) (విబి–జి రామ్‌జి ) తెచ్చేందుకు కుట్ర పన్నింది. ఇందుకు సంబంధించిన బిల్లు ప్రతులను సోమవారం లోక్‌సభ సభ్యులకు అందించింది. లోక్‌సభ అనుబంధ కార్యకలాపాల జాబితాలో కూడా ఈ బిల్లును చేర్చింది. ఇటీవలే ఈ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మార్చుతామన్న మోదీ సర్కార్, ఇప్పుడు ఏకంగా ఆ పథకాన్నే గంగలో కలిపేందుకు పూనుకంది. వాస్తవానికి ఈ పథకాన్ని 2005లో యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా దాని పేరు మార్చారు. కాగా, ఇప్పుడు దీన్ని పూర్తిగా రద్దు చేసి, కొత్తగా 'వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' బిల్లు, 2025ను మోదీ సర్కార్ తహతహలాడు తోంది. బిల్లు కాపీ ప్రకారం.... ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీని అందించడం ద్వారా వికసిత్ భారత్ 2047 జాతీయ దార్శనికతకు అనుగుణంగా గ్రామీణ అభివృద్ధి చట్రాన్ని ఏర్పాటు చేయడం ఈ బిల్లు లక్ష్యం. గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బిల్లు ఉద్దేశ్య ప్రకటనలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గత 20 సంవత్సరాలుగా గ్రామీణ కుటుంబాలకు హామీ వేతన ఉపాధిని అందించిందని అన్నారు. అయితే, 'సామాజిక భద్రతా జోక్యాల విస్తృత కవరేజ్, ప్రధాన ప్రభుత్వ పథకాల సంతృప్త ఆధారిత అమలు ద్వారా గ్రామీణ ప్రకృతి దృశ్యంలో గణనీయమైన సామాజిక, ఆర్థిక పరివర్తన కనిపించిన దృష్ట్యా మరింత

తరువాయి 2లో




## గాంధీ పేరును ఎందుకు తొలగిస్తున్నారు?

- ప్రభుత్వ ఉద్దేశమేమిటి?
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుపై ప్రతిపక్షాలు మండిపాటు
- సమయం, డబ్బు వృథా : ప్రియాంకాగాంధీ



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి చట్టాన్ని తీసుకువచ్చేందుకు మోదీ సర్కార్ సిద్ధమవుతుండడంపై ప్రతిపక్షాలు కాషాయ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశాయి. దేశపిత పేరును ఎందుకు తొలగిస్తున్నారని ప్రతిపక్ష ఎంపిలు నిలదీశారు. సోమవారం జారీ చేసిన లోక్‌సభ అనుబంధ కార్యకలాపాల జాబితాలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025ను చేర్చారు. ఈ బిల్లు 2005 నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, నైపుణ్యం లేని శారీరక శ్రమ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే గ్రామీణ కుటుంబాలలోని వయోజన

తరువాయి 2లో

### 'బీమా'లో 100%

## బిల్లుకు రంగం సిద్ధం




- శీతాకాలం సమావేశాల్లోనే పెట్టే యోచనలో కేంద్ర సర్కార్
- సభ్యులకు బిల్లు ప్రతులు

**న్యూఢిల్లీ:** బీమారంగంలో నూటికి నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) అనుమతించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వంరంగం సిద్ధం చేసింది. శీతాకాలం పార్లమెంటు సమావేశాలు డిసెంబరు 19వ తేదీతో అంటే మరో నాలుగు రోజుల్లో ముగుస్తాయి. ఈ నాలుగు రోజుల్లోనే బిల్లును ఆమోదానికి పెట్టాలని మోదీ ప్రభుత్వంపట్టుదలతో ఉంది. దీంతో సదరు బిల్లు ప్రతులను కూడా సభ్యులకు పంపిణీ చేశారు. బీమారంగంలో ఇప్పటికే కేంద్రం 74 శాతం మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తోంది. ఈ పెట్టుబడులను పూర్తిస్థాయిలో నూటికి నూరుశాతం మేరకు తీసుకు వచ్చేందుకు బిల్లును ఉద్దేశించారు. సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా (బీమా శాసనాల సవరణ చట్టం–2025) పేరుతో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ, బీమారంగంలో నూటికి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇస్తామని

తరువాయి 2లో

### బంగారు నగలతో

## వ్యాపారి పరార్

- రూ.6 కోట్ల విలువైన నాలుగు కిలోల బంగారంతో ఉడాయింపు
- సిసిఎస్ పోలీసులకు చిక్కిన నిందితుడు : అరెస్టు
- రికవరీ కోసం తంటాలు పడుతున్న పోలీసులు
- ఆందోళనలో బాధితులు



ప్రజాపక్ష/హైదరాబాద్

పాత బంగారు నగలను కరిగించి కొత్త నగలుగా మారుస్తానని నమ్మించి పలువురు బాధితుల నుంచి రూ.6కోట్ల విలువైన నాలుగు కిలోల బంగారు నగలను తీసుకుని ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూసింది. ఎట్టకేలకు సిసిఎస్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు అయితే అతని నుంచి బంగారు నగలను రికరీ

తరువాయి 12లో

### బిసిలను అణిచివేయాలని చూస్తే

## తిరుగుబాటు తప్పదు

- యాభై శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాల్సిందే
- 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం నాన్చుడేంది?
- ఢిల్లీ బిసి ధర్నాలో అఖిలపక్ష నేతల డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలను అణిచివేయాలని చూస్తే దేశంలో సామాజిక తిరుగుబాటు తప్పదని అఖిలపక్ష పార్టీల నేతలు, బిసి సంఘాల జెఎసి నేతలు హెచ్చరించారు. దేశంలో విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి, జనాభా దమాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఇచ్చిన ఛలో ఢిల్లీ పిలుపుమేరకు సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బిసిల మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, టిఆర్‌ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, మాజీ పార్లమెంట్ సభ్యులు వి.హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కుంతియా, ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, మహారాష్ట్ర

తరువాయి 2లో



## అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కావొద్దు

- హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- లీజు భూములు, షాప్‌ల రెగ్యులరైజేషన్‌కు అవకాశం
- ఇంటి పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాల విక్రయాలకు గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు భూములపై సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, అద్దెలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒక వైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరో వైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇచ్చారని, ఇందులోప్రధానంగా ఇనిస్ట్యూషన్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, స్కూల్స్, టెంపుల్స్ తదితరాలు ఉన్నాయని, ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దె బకాయిలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. లీజు అగ్రిమెంట్ పునరుద్ధరణ చేసుకోని సంస్థలకు హౌసింగ్ బోర్డు తరపున లేఖలు రాసి వాటి రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వివిధ ప్రాంతాల్లో 301 కమర్షియల్


తరువాయి 2లో

## బెంగాల్‌లో 59 లక్షల ఓటర్ల తొలగింపు!

- సిఎం దీదీ నియోజకవర్గంలోనే ఈ సంఖ్య ఎక్కువ
- నేడు ముసాయిదా జాబితాల ప్రచురణ మార్పులు చేర్పులకు నెలరోజులు గడువు
- ఫిబ్రవరిలో ఓటర్ల తుది జాబితాలు విడుదల

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 59 లక్షలమంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుండి తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ప్రామాణికంగా తీసుకున్న

తరువాయి 12లో



### బాలిక కిడ్నాప్..

## అత్యాచారం

- కేసు తారుమారు చేసేందుకు పోలీసుల యత్నం
- ఉన్నతాధికారుల స్పందించడంతో పోక్సో కేసు నమోదు ముగ్గురి యువకుల అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఇంట్లో ఉన్న బాలికను యువకులు కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన ఘటన పహాడీ షరీఫ్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అయితే ఈ కేసును తారుమారు చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాన్ని ఉన్నతాధికారులు అడ్డుకున్నారు. బిహార్‌కు చెందిన దంపతులు ఉపాధి కోసం ఏడాది క్రితం పహాడీషరీఫ్‌లోని జల్‌పల్లికి వచ్చారు. వీరికి ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు సంతానం. దంపతులతో పాటు పెద్ద కుమారుడు స్థానికంగా ఉన్న ఓ కంపెనీలో కూలీ పనులకు వెళ్తుండగా ఇద్దరు ఆడపిల్లలకు, చిన్న కుమారుడు ఇంట్లోనే ఉంటున్నారు. రోజు

తరువాయి 12లో

## పల్లె పోరుకు ప్రచారం బంద్

**గ్రామాల్లో మూగబోయిన మైకులు రేపు తుది విడత ఎన్నికలు**



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. ఈనెల 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, తుది విడత ఎన్నికలు ఈనెల 17న జరగనున్నాయి. దీంతో అభ్యర్థుల ప్రచారానికి గడువు ముగియడంతో గ్రామాల్లో ఇన్ని రోజులు హోరెత్తించిన మైకులు మూగబోయాయి. తుది విడతలో రాష్ట్రవ్యాప్తంగా 182 మండలాల్లోని 4,157 గ్రామ పంచాయతీలు, 28,406 వార్డులకు పోలింగ్ జరగనుంది. ఇందులో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ విడత ఎన్నికల్లో మొత్తం 53 లక్షల 6,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 26 లక్షల 1,861 మంది పురుష ఓటర్లు, 27 లక్షల 4,394 మంది మహిళా ఓటర్లు ఉండగా, 146 మంది ఇతర ఓటర్లు

తరువాయి 2లో

### పంచాయతీలోనూ

## పైసాతోనే పని

- ప్రజాసేవ, ప్రజలతో సత్సంబంధాలు ఏమీ పనిచేయడంలేదు?
- శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలను తలదన్నే రీతిలో ప్రలోభాల పర్వం
- పంచాయతీ పోరులో విచ్చలవిడిగా నగదు, మద్యం పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం

ఎన్నికలంటే పోటీ చేయాలనుకునే అభ్యర్థులు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఐదేండ్ల ప్రజాసేవ ప్రజలతో సత్సంబంధాలు ఇవేవీ ఎన్నికల్లో పని చేయడం లేదు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలను తలదన్నే రీతిలో ప్రలోభ పర్వం కొనసాగుతుంది. అది ఎంతగా అంటే పరాకాష్టకు చేరింది. సామాన్యులు ఎన్నికలలో పోటీ చేసే పరిస్థితి లేదు. కనీసం వార్డు మెంబర్‌కు గెలవాలన్న గట్టి పోటీ ఉన్న పంచాయతీ అయితే తక్కువలో తక్కువ లక్ష రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. మొదటి రెండు దఫా ఎన్నికలను పరిశీలిస్తే రాజకీయ పార్టీలకు ఉండాల్సిన కట్టుబాటుతనం కానీ, బంధుత్వాలు లేదా గతంలో సేవలను పొందిన నాటి రోజులు గుర్తుంచుకునే పరిస్థితి లేదు. పైసా మే పరమాత్మ హై అన్నట్లు ఎవరు ఎక్కువ డబ్బులు

తరువాయి 2లో





మాదకద్రవ్యాల వ్యసనం.. సమాజ శ్రేయస్సుకు హానికరం
తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య 03

రైతుకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం రావాలి
రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి






# ప్రపంచం
WORLD NEWS

## హాంకాంగ్ పత్రికాధిపతి జిమ్మీపై దేశద్రోహ నేరం

**హాంగ్‌కాంగ్ :** హాంగ్‌కాంగ్ ''యాపిల్ డైలీ'' పత్రికాధిపతి జిమ్మీ లై (78)ను అక్కడి ప్రాంతీయ ఉన్నత న్యాయస్థానం నేరస్థుడిగా, విదేశాలతో కుమ్మక్కైన దేశద్రోహిగా ప్రకటించింది. హాంగ్‌కాంగ్‌లో ఉన్న చిట్ట చివరి ప్రతిపక్షం ''డెమోక్రటిక్‌పార్టీ'' ప్రజాస్వామ్యబద్ధమైన ఓటింగ్ ద్వారా అంతర్థానమైన మరునాడే ప్రాంతీయ ఉన్నత న్యాయస్థానం ఈ ప్రకటన చేసింది. ఆరేళ్ళుగా జిమ్మీ జైలులో ఉన్నారు. 2019లో హాంగ్‌కాంగ్‌లో భారీ ఎత్తున నిరసన జ్వాలలు పెల్లుబికిన తర్వాత జిమ్మీ జైలుపాలయ్యారు. 1995 2021 వరకూ ఈ పత్రిక చైనా, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితమైంది. జనాదరణ పొందిన టాబ్లాయిడ్ జర్నలిజాన్ని ఆయన హాంగ్‌కాంగ్‌లో ప్రవేశపెట్టారు. ఆయన రాజకీయనాయకుడు, వ్యాపారవేత్త, పత్రికాధిపతి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ కోసం చైనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన పోరాడుతున్నారు. ఆరేళ్ళుగా జిమ్మీ ఏకాంత వాస శిక్ష అనుభవిస్తున్నారు.

## చిలీ ఎన్నికల్లో ట్రంప్ భక్తుడు కాస్ విజయం

### ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి ప్రతిజ్ఞ



**శాంటియాగో :** దక్షిణ అమెరికా దేశం చిలీలో జోస్ ఆంటోనియో కాస్ (59) దేశాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారోల అడుగుజాడల్లో నడిచే కాస్ విజయం కమ్యూనిస్టు పాలనలో ఉన్న చిలీని దిగ్భ్రాంతికి గురిచేసింది. అనేక దశాబ్దాలుగా దేశంలో మితవాదులు అధికారం కోసం కాచుకుని ఉన్నారు. ఈ విడత అధ్యక్ష ఎన్నికల్లో పాలక కమ్యూనిస్టుపార్టీ ఒకే సారి మూడు మితవాద పార్టీలతో పోరాటం చేసింది. న్యాయవాది,రాజకీయాలలో సీనియర్ నాయకుడు కాస్‌కు రన్–ఆఫ్ ఎన్నికల్లో 58.2 శాతం ఓట్లు వచ్చాయి. కమ్యూనిస్టు పార్టీ అధ్యక్ష అభ్యర్థి, కార్మికశాఖామంత్రి జెన్నెత్ జారాకు 41.8 శాతం ఓట్లు వచ్చాయి.

ఆమె చాలా హుందాగా ఓటమిని అంగీకరించి కాస్‌కు అభినందనలు తెలియజేశారు. ''ప్రజాస్వామ్యం చాలా బిగ్గరగా, స్పష్టంగా మాట్లాడుతుంది, ఈ ఓటమి నుండి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది'' అని సోషల్ మీడియాలో ఆమె పోస్టింగ్ చేశారు.

నియంత పినోచెట్ నియంత పాలన (1973–1990) తర్వాత చిలీలో ప్రజాస్వామ్యం నెలకుంది. ఇప్పటివరకూ అధ్యక్షుడుగా ఉన్న కమ్యూనిస్టు నేత గాబ్రియేల్ బోరిక్ కుటుంబం పినోచెట్‌పై పెద్ద పోరాటం చేసింది.ప్రజాదరణ పొందిన ఎన్నో సంక్షేమ చర్యలను కమ్యూనిస్టు పాలకులు గడచిన 35 సంవత్సరాలుగా దేశంలో అమలు చేశారు. కానీ ఇప్పుడు గెలిచిన మితవాద నాయకుడు కాస్ అందుకు పూర్తి భిన్నం. దేశ ఆర్థిక వ్యవస్థను పునాదిస్థాయి నుండీ మళ్ళీ నిర్మించుకుంటూ వస్తానని ప్రజలకు కాస్ వాగ్దానం చేశారు. పాలక కమ్యూనిస్టులకు, మూడు మితవాదపార్టీల అభ్యర్థులకుమధ్య ఈసార హోరాహోరీ పోటీ జరిగింది. జెన్నెత్ జారా మొదటి విడత ఎన్నికల్లో 26.85 శాతం ఓట్లు సంపాదించి ఆధిక్యత ప్రదర్శించారు. మొదటి విడత కాస్‌కు 23.92 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ట్రంప్, బోల్సెనారో తరహాలోనే చిలీ ప్రజలకు ఆంటోనియో కాస్ ప్రజలకు ఎన్నికల వాగ్దానాలు కురిపించారు. వేలాదిమంది వలస ప్రజలను దేశం నుండి బయటకు పంపేస్తానని కాస్‌ఎన్నికల్లో వాగ్దానం చేశారు. దేశాన్ని మాదక ద్రవ్యాల ముఠాల నుండి కాపాడుకోవడం, చట్టాలను పటిష్టం చేయడం, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం ప్రస్తుత దేశాధ్యక్షుడి ముందున్న ప్రధాన సవాళ్ళు. ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్న పొరుగుదేశం వెనిజులా నుండి చిలీలోకి ఎవరినీ వలసలు రాకుండా సరిహద్దులు కట్టడి చేస్తానని కాస్ ప్రజలకు వాగ్దానం చేసి వారిని ఆకట్టుకున్నారు. సరిహద్దుల్లో కందకాలు తవ్వుతానని, సరిహద్దులను పటిష్టం చేస్తానని, బొలీవియాతో ఉన్న వందల కిలో మీటర్ల సరిహద్దుల్లో రక్షణ గోడ నిర్మిస్తానని ప్రజలకు కాస్ వాగ్దానం చేశారు. కాస్ మూడుసార్లు దేశ అధ్యక్ష పదవికి పోటీ చేసి ఓడిపోయారు. పట్టుబవదలని విక్రమార్కుడిలా చివరకు జెన్నెత్ జారాను వెనక్కునెట్టి అధ్యక్ష పదవి దక్కించుకున్నారు. ఆమె తన ఓటమిని అంగీకరించారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే నాటికికాస్‌కు పోలింగ్‌లో 58 శాతం ఓట్లు లభించాయి.

## బాండీ బీచ్‌లో వందల ప్రాణాలు కాపాడిన హీరో అహ్మద్

### మృతులకు ప్రజల అశ్రునివాళి



**సిడ్నీ :** ఆస్ట్రేలియా సిడ్నీ నగరం బాండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో మరణించినవారి సంఖ్య 16కు పెరిగింది. మరణించినవారిలో ఇద్దరు పోలీసు అధికారులు ఉండగా, పది సంవత్సరాల బ్రిటన్‌కు చెందిన అతి చిన్న పాప రబ్బీ, ఆస్ట్రేలియాలో ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ డాన్ ఎల్కాయమ్ ఉన్నారు. కాల్పుల్లో గాయపడినవారి సంఖ్య 42కు పెరిగింది. వీరిలో ఐదుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కాల్పులకు పాల్పడినవారిని తండ్రీ కొడుకులుగా గుర్తించారు. రబ్బీనిక్ యూదుల పర్వదినం ''హనుక్కా'' సందర్భంగా ఉత్సవంపై కాల్పులు జరిపిన తండ్రి సాజిద్ అక్రమ్ (54) కాల్పుల్లో్లమరణించగా, అతడి కుమారుడు నవీద్ (24) పోలీసు కాల్పుల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జరుపుతున్న ఆగంతకుణ్ణి నివారించేందుకు అక్కడే ఉన్న దుకాణం యజమాని,నిరాయుధుడు, ముస్లిం మతస్థుడు అహ్మద్ అల్ అహ్మద్ చేసిన ప్రయత్నాన్ని అందరూ శ్లాఘిస్తున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో హీరోగా అవతరించాడు. కాల్పులు జరుపుతున్న ముష్కరుణ్ణి అడ్డుకోవడం ద్వారా ఆయన అనేక వందలమంది ప్రాణాలు కాపాడిన హీరోగా మారిపోయారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ సహా పలు దేశాల నాయకులు ఈ కాల్పుల ఘటనను ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. ఇది పూర్తిగా యూదు వ్యతిరేక హింసాత్మక చర్యగా వారు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఈ చర్యను ఖండించారు. సిడీలో వేలాదిమంది ప్రజలు ఘటనస్థలికి తరలివచ్చి మృతులకు సంతాపం తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటించి అశ్రునివాళులు అర్పించారు. జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్ తీవ్రంగా స్పందించారు. తండ్రీ కొడుకులు ఇద్దరు ఉగ్రవాద సిద్ధాంతంతో యూదులపైదాడి చేశారన్నారు. దేశంలో ఆయుధ చట్టాలను మరింత కఠినతరం చేస్తామని ప్రకటించారు. చారిత్రక ప్రదేశం టాస్మానియాలో 1996లో జరిగిన కాల్పుల ఘటన తర్వాత ఆస్ట్రేలియాలో ఇంతపెద్ద హింసాత్మక ఘటన సంభవించడం మళ్ళీ ఇదే. ఆనాడు టాస్మానియాలో ఒక ముష్కరుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు.

## ప్రత్యర్థుల నిర్మూలనకే మార్షల్ లా కుట్ర

### ద.కొరియా మాజీ అధ్యక్షుడిపై నేర ధృవీకరణ



**సియోల్ :** రాజకీయ ప్రత్యర్థులను పూర్తిగా నిర్మూలించి అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే కుట్రతోనే దేశంలో మార్షల్ లా విధించారని పదవీచ్యుతుడైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ చర్యలపై దర్యాప్తు జరిపిన అధికారి నిర్ధారణకు వచ్చారు. సోమవారం ఈ మేరకు నివేదిక వెలువడింది. 2024 డిసెంబరులో యూన్ సుక్ యోల్ దేశంలో అర్థరాత్రివేళ మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించారు. కొద్దిగంటల పాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. ఆ తర్వాత ఆయన తనకు తానుగా ఈ ఉత్తర్వులను వెనక్కు తీసుకున్న తర్వాత పదవీచ్యుతుడయ్యారు. ఈ నివేదిక ద్వారా ఆయన నేరస్థుడుగా, కుట్రదారుడుగా, దేశ ద్రోహిగా తేలారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ చో ఎన్ సుక్ ఆరు నెలలపాటు దర్యాప్తు చేసి ఈ తుది నివేదిక రూపొందించారు. ఉద్దేశపూర్వకంగా దేశంలో సైన్యాన్ని ఉత్తర కొరియాపైకి ఉసిగొల్పి సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా దేశంలో మార్షల్ లా విధించడానికి అనువైన పరిస్థితులు సృష్టించి తనను తాను సమర్థించుకోవడంకోసమే యూన్ సుక్ యోల్ కుట్ర చేశారని నివేదిక పేర్కొంది. 2023 అక్టోబరుకు ముందు నుండి ఆయన సైన్యంలోని ఆయన అనుచరులు కలిసి ఉత్తర కొరియాను రెచ్చగొట్టే కుట్ర చేశారని నివేదిక తెలియజేసింది. ఐతే ఈ నివేదికపై యూన్ వెంటనే స్పందించలేదు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు. చట్టాల ప్రకారం ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష లేదా ఉరిశిక్ష పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 డిసెంబరు మూడో తేదీ అర్థరాత్రి యూన్ సుక్ యోల్ మార్షల్ లా ప్రకటించిన తర్వాత వందలమంది సైనికులు ఎన్నికల సంఘం కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఆ తర్వాత వేలాదిమంది ప్రజలు పార్లమెంటును చుట్టుముట్టి దేశాధ్యక్షుడు రాజీనామా చేయాలని ప్రదర్శనలు చేశారు. తర్వాత కొద్దిగంటల్లోనే చట్టసభ సభ్యులు యోల్‌ను పదవీచ్యుతుణ్ణి చేస్తూ తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా యూన్ సుక్ యోల్ భార్యపైన, యూనిఫికేషన్ చర్చిపైనా అనేక నెలలుగా విడిగా అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం యూనిఫికేషన్ చర్చిలో సోదాలు జరిగాయి.

## జులై ఉద్యమ నాయకుడు సింగపూర్‌కు తరలింపు

### బంగ్లాదేశ్‌లో ప్రదర్శనలు

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో ప్రధానపాత్ర వహించిన ''జులై ఉద్యమం'' నాయకుడు, ''ఇంక్విలాబ్ మంఛో'' ప్రధాన అధికార ప్రతినిధి షరీఫ్ ఒస్మాన్ హదిని మెరుగైన చికిత్సకోసం ఎయిర్ అంబులెన్స్‌లో సోమవారం మధ్యాహ్నం సింగపూర్‌కు తరలించారు. హదిపై డిసెంబరు 12వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పారిపోయారు. ఈ కాల్పుల ఘటన ఒకవైపు భారత్–బంగ్లాదేశ్‌ల మధ్య అపార్థాలు పెరగడానికి కూడా దారితీస్తుండగా, మరోవైపు ఎవరు ఈ చర్యకు పాల్పడ్డారనే విషయం మిస్టరీగా మారింది. ఈ పరిస్థితుల మధ్య బంగ్లాదేశ్ వ్యాప్తంగాపలు పార్టీలు నిరసన ప్రదర్శనలు జరిపాయి. హదీపై కాల్పులు జరిపిన హంతకులను 48 గంటల్లో అరెస్టు చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు.

గడచిన రెండు రోజులుగా బంగ్లాదేశ్ ప్రభుత్వం, సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్‌లలోని అనేక ఆసుపత్రులలో విచారణ జరిపి చివరకు మెరుగైన చికిత్సకోసం హదిని సింగపూర్‌కు తరలించారు. హదిపై కాల్పులు జరిపిన దుండగుల జాడ చెప్పిన వారికి రూ.50 లక్షల టాకాలు బహుమతిగా ఇస్తామని మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. త్వరలో జరిగే ఎన్నికల్లో షరీఫ్ ఒస్మాన్ హది ఢాకా–8 నియోజకవర్గం నుండి పార్లమెంటుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దుండగులు జరిపిన కాల్పుల్లో ఆయన తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడిన మరునాడే హదిపై కాల్పులు జరిగాయి. వారికోసం దేశవ్యాప్తంగా భారీ ఎత్తున పోలీసులు గాలిస్తున్నారు. సెక్యూరిటీ ఎమర్జెన్సీ కూడా విధించారు. విద్రోహ చర్యలను, ప్రజాస్వామ్య ప్రక్రియను బలహీనపరచే చర్యలను,''జులై ఉద్యమస్ఫూర్తి''ని దెబ్బతీసేందుకు జరిగే కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలని మహ్మద్ యూనుస్ నిర్వహించిన అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది.

## తిరుగుబాటు తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షులు సచిన్ రాజోలుకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ వెనుకడుగు వేయదనీ, స్థానిక పరిస్థితుల దృష్ట్యా గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించామే తప్ప, బిసి రిజర్వేషన్ల ప్రక్రియ నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలగలేదని, రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గేతో ఇప్పటికే చర్చించామని, అతి త్వరలోనే కేంద్రంపై పోరాడడానికి తమ రాజకీయ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. సిపిఐ జాతీయ నాయకులు కె. నారాయణ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా బిజెపి అడుగడుగునా అడ్డుపడుతుందని, రాజ్యాంగబద్ధ సంస్థలను తమ చేతిలో పెట్టుకుని బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ నుండి ఎన్నికైన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు రాజీనామా చేస్తే కేంద్రం దెబ్బకు దిగి వస్తుందన్నారు. టిఆర్ఎస్ పార్టీ మాజి మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ నుండి కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామాలు ఆడుతుందని, రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టిన, చట్టం చేసిన బిఆర్ఎస్ పార్టీ అండగా నిలబడిందని, కానీ కాంగ్రెస్ చిత్తశుద్ధితో ప్రయత్నించకుండా వ్యహరిస్తుందని ఆరోపించారు. బిసి బిల్లు విషయంలో మాత్రం రెండు పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ బిసి బిల్లు పై పార్లమెంట్‌లో కొట్లాడుతున్న కూడా బిజెపి స్పందించకపోవడం దారుణమన్నారు. మల్లురవి మాట్లాడుతుండగా బిసి సంఘాల నేతలు అఖిలపక్షంతో సిఎం ఢిల్లీకి ఎందుకు రావడం లేదని, పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ఉపన్యాసానికి అడ్డు తగిలారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ బిసి ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నప్పటికీ, బిసిలకు న్యాయం జరగకపోవడం దురదృష్టకరమని, పార్లమెంటులో బిసి రిజర్వేషన్లపై ప్రైవేటు బిల్లు పెట్టేలా రాహుల్ గాంధీ పై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన తెలిపారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉధృతం చేస్తున్నామని, అయినప్పటికీ బిజెపి, కాంగ్రెస్ పార్టీలు స్పందించకుండా బిసిలకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఇప్పటికీ రెండుసార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టిన అఖిలపక్షంతో ఎందుకు ప్రధానిని కలవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇక బిజెపి బిసిలకు బద్ధ శత్రువుగా మారిందని, నాటి మండల్ నుండి నేటి బిసి రిజర్వేషన్ల వరకు బిసిలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందనీ మండిపడ్డారు. మహాధర్నాకు బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయం చేయగా బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, మహిళా సంఘం అధ్యక్షురాలు బి.మని మంజరి సాగర్, పెరిక సురేష్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, కె. వీరస్వామి, పిట్ల శ్రీధర్, కౌల జగన్నాథం, నాగ మల్లేశ్వరరావు, నందగోపాల్, జాజుల లింగంగౌడ్, వేముల రామకృష్ణ, మడత వెంకట్ గౌడ్, గూడూరు భాస్కర్, స్వర్ణ, గౌతమి, ఉదయనేత, శివమ్మ, శివకుమార్, సుమన్ , బిక్షం గౌడ్, అశోక్ పాల్గొన్నారు

## పైసాతోనే పని

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తే వారి వైపు మొగ్గుతున్నారు. డబ్బులకు ఓటర్లు మొగ్గు చూపుతుండటంతో ధనవంతులు బాగా ఖర్చు చేయగలిగిన వారు మాత్రమే ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. నామినేషన్ సమయానికి గ్రామాల్లోకి రావడం హడావుడి చేయడం ఏదో ఒక రకంగా ఓటర్లను ప్రలోభ పెట్టడం ఆ తర్వాత గెలిచినా ఓడినా ఆ ఊరి ముఖం చూడకుండా ఉండటం ఇటీవల కాలంలో అలవాటుగా మారింది. 400 నుంచి 500ల ఓటర్లు కలిగిన ప్రాంతంలో రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. ప్రలోభాలకు జనం మొగ్గుతుండటంతో ఓటు విలువ అమాంతంగా పెరిగిపోయింది. మొదటి దశలోనే ఓటుకు రూ. 3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేశారనుకుంటే ఆదివారం జరిగిన రెండవ దఫా ఎన్నికల్లో ఖమ్మం రూరల్ మండలంలో ఒకట్రెండు పంచాయతీలలో ఓటు ధర రూ. 10వేలకు పైగానే చేరుకుంది. గట్టి పోటీ ఉన్నచోట ఓటర్లు ఎక్కువగా ఉన్న ఇంటికి లెక్కలతో పని లేకుండా రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు విసురుతున్నారు. ఓటర్లు కూడా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. గతంలో పార్టీల పరంగా ఓటర్లు గ్రామాల్లో విడిపోయి ఉండే వారు. తాము బలపరుస్తున్న వారి గుర్తులను తమ ఇండ్ల ముందు ప్రదర్శించే వారు. ఇప్పుడు ఆ తీరు మారిపోయింది. ఏ ఓటరు ఎవరి వెనక ఉన్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఏ పార్టీ అభ్యర్థి వైపు మొగ్గు చూపకుండా మౌనంగా ఉంటూ ఇరు వైపులా డబ్బులు తీసుకుంటున్నారు. చివరకు ఓటు ఎవరికి వేస్తున్నారన్న దానిపై రెండవ దఫా ఎన్నికల్లో కొంత స్పష్టత కనిపించింది. అత్యధికంగా డబ్బులు పంపిణీ చేసిన వారి వైపు ఓటర్లు మొగ్గు చూపారు. గతంలో స్వచ్ఛందంగా ఓటు వేయడం స్థానే మద్యం పంపిణీ వచ్చింది. ఆ తర్వాత పురుష ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తే మహిళా ఓటర్ల సంగతేమిటని మహిళా ఓటర్లకు చీరల పంపిణీ ప్రారంభించారు. ఆ తర్వాత వస్తు పంపిణీ జరిగింది. ఇప్పుడు ఏకంగా నగదు పంపిణీ ప్రారంభమైంది. దీనితో ఐదేండ్ల పాటు ఆయా గ్రామాల ప్రజలను అంటిపెట్టుకుని ఉండి వివిధ రకాల సేవలను అందించిన వారు పంచాయతీ ఎన్నికల తెరపై కనిపించడం లేదు. ఇప్పుడు డబ్బులు ఉన్నవారే పోటీకి అర్హులన్న భావన బలపడుతుంది. పక్కనే ఉండి ఇంత కాలం మద్దతుగా నిలిచిన వారిని పోటీలో నిలిపితే డబ్బులు లేకపోతే గెలవరన్న ప్రచారం తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఇంటింటికి చికెన్, మటన్ పంపిణీ కూడా అలవాటైపోయింది. ఓటర్లను బట్టి పంపిణీ జరుగుతుంది. మొత్తంగా రెండు విడతలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పంపిణీయే విజయ రహస్యంగా మారింది. మూడో దఫాలోనూ ఇందుకు భిన్నంగా లేకపోవచ్చు.

## అన్యాక్రాంతం కావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

షాప్‌లు ఉండగా 2007లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు 14 మంది షాప్‌లు కొనుగోలు చేయగా మిగిలిన 287 షాప్‌లకుగాను 62 షాపులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి షాప్ యజమాని ప్రతి ఏడాది 10 శాతం అద్దెను పెంచుతూ షాప్‌ను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని, అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో షాప్ యజమానుల నుంచి హౌసింగ్ బోర్డుకు కోట్లాది రూపాయిలు రావలసి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రస్తుతం షాప్‌లు నిర్వహిస్తున్నవారు ఆ షాప్‌లను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని మంత్రి సూచించారు. అలాగే షాప్ నిర్వహణకు అనువుగా లేకపోతే ఆ స్థలాన్ని వేలంలో విక్రయించాలని సూచించారు. కోర్టు కేసులలో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించుకోవాలని సూచించారు. హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాలను ఆ ఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని అలాగే గతంలో ఇంటి కోసం హౌసింగ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని, పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాన్ని కూడా కొనుగోలు చేసుకుంటే మొత్తం స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. మార్కెట్ ధర, సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ కార్డు విలువ వంద గజాల లోపు స్థలాల వివరాలు, రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ చేసుకోని పక్కనే ఉన్న వంద గజాలలోపు స్థలాన్ని అడుగుతున్నవారి వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. వీటన్నింటిపై మంత్రివర్గంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు ఎండి విపి గౌతమ్, సిఈ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారం బంద్ (మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం 36,483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది.

## ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు అరెస్టు

### పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్

**చండీగఢ్ :** పలు ప్రాంతాలలో ఉగ్రవాద కార్యలాపాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు ఉగ్రవాదులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ మాట్లాడుతూ... పంజాబ్‌కు చెందిన ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు సజన్ మాసిహ్, మనీశ్‌బేడి ఉగ్రవాదులుగా మారారు. వీరికి పాకిస్థాన్ ఉగ్రవాద, ఐఎస్ఐ మద్దతుదారుడైన హర్వీందర్ సింగ్ రిందా, యుఎస్ బేస్‌డ్ హ్యాపీ పెషియన్‌లతో కలిసి ఉగ్రవాద కార్యలాపాలు నిర్వహించేవారు. ఈ రెండు గ్యాంగులు కలిసి విదేశీ ప్రాంతాలైన దుబాయ్, అర్మేనియా దేశాల్లో కూడా ఉగ్రవాద దాడులు నిర్వహించి బీభత్సం సృష్టించడానికి పలు ప్రయత్నాలు చేశారన్నారు. వీరిని ఆదివారం ముంబైలో ఇంటెలిజెన్స్, సెంట్రల్ ఏజెన్సీలు అదుపులోకి తీసుకున్నాయన్నారు. సజన్ మాసిహ్ది చండీగఢ్‌లోని గుర్దాస్‌పూర్ జిల్లా దేరా బాబా నానక్ ప్రాంతం. మనీశ్ బేడిది అమృత్‌సర్. వీరు దుబాయ్ నుంచి అర్మేనియాకు అక్కడి నుంచి పలు ప్రాంతాలకు మకాం మార్చేవారు. హర్వీందర్‌సింగ్, పెషియన్‌లకు ఇంతకు ముందు నేర చరిత్ర ఉందని, ఇప్పటికి ఎన్నో హత్యలు, దోపిడీలు చేశారని అన్నారు. అమృత్‌సర్‌లో గ్రేనేడ్ బాంబు దాడులకు ప్లాన్ చేశారని అన్నారు. ఏప్రిల్‌లో పెషియా (20)ను ఎఫ్‌బిఐ, అమెరికా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రిమూవల్ ఆపరేషన్స్ (ఇఆర్ఒ) పోలీసులు అమెరికాలో అదుపులోకి తీసుకున్నారు.

మాసిహ్, బేడిలకు అర్మేనియా నుంచి షంషేర్ (అలియాస్) షేరా ఉగ్రవాద కార్యకలాపాలకు సహకరిస్తున్నారన్నారు. విదేశాల నుంచి కూడా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తే ఈ దేశ చట్టం ప్రకారం శిక్షలు వర్తిస్తాయన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇంత పెద్ద ఉగ్రవాద ముఠాని పట్టుకోవడం పంజాబ్ పోలీసులకు పెద్ద విజయమని అన్నారు.

## ఎందుకు తొలగిస్తున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీని కల్పించడం ద్వారా 'వికసిత్ భారత్ 2047 జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఒక గ్రామీణ అభివృద్ధి చట్రాన్ని ఏర్పాటు చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యక్షుడిగా ఉన్న కాంగ్రెస్ ఎంపి సప్తగిరి ఉలక మాట్లాడుతూ, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద పనిదినాలు, వేతనాలను పెంచడంతో సహా తమ కమిటీ అనేక సిఫార్సులు చేసిందని తెలిపారు.'వారు (బిజెపి) అధికారంలోకి వచ్చినప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనిని గుంతలు తవ్వే పథకం అని పిలిచారని, ఇప్పుడు ఈ పథకానికి మంగళం పాడడమే వారి ఉద్దేశమని ఉలక పిటిఐతో అన్నారు. 'బాపూ పేరుతో వారికి ఏమి సమస్య ఉందో నాకు తెలియదు, కానీ ఇది కాంగ్రెస్ పథకం కాబట్టి వారు దీనిని రద్దు చేయాలనుకుంటున్నారు. నేను పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్నాను. మేము చాలా సిఫార్సులు చేశాము. పనిదినాలను 150కి పెంచాలని, వేతనాలను పెంచాలని... రాష్ట్రాలకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి, పశ్చిమ బెంగాల్‌కు నిధులు అందడం లేదు. వారు ఒక బిల్లును తీసుకువచ్చారు. కానీ మహాత్మా గాంధీ పేరును ఎందుకు తొలగించారు?' అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీని ప్రశ్నించగా, 'ఏదైనా పథకం పేరు మార్చినప్పుడు, కార్యాలయాలు, స్టేషనరీలో చాలా మార్పులు చేయాల్సి ఉంటుంది... దీని కోసం డబ్బు ఖర్చు అవుతుంది. కాబట్టి, ప్రయోజనం ఏమిటి? ఎందుకు ఇలా చేస్తున్నారు?' అని నిలదీశారు. 'మహాత్మా గాంధీ పేరును ఎందుకు తొలగిస్తున్నారు? మహాత్మా గాంధీ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత గొప్ప నాయకుడిగా పరిగణించబడతారు; కాబట్టి, ఆయన పేరును తొలగించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో నాకు నిజంగా అర్థం కావడం లేదు. వారి ఉద్దేశం ఏమిటి? అని ఆమె పార్లమెంట్ హౌస్ సముదాయంలో విలేకరులతో అన్నారు. 'మనం చర్చించుకుంటున్నప్పుడు కూడా ప్రజల నిజమైన సమస్యల గురించి కాకుండా ఇతర సమస్యల గురించే మాట్లాడుతున్నారు. సమయం, డబ్బు వృథా అవుతోంది, వారే తమను తాము అడ్డుకుంటున్నారని కేరళలోని వయనాడ్ ఎంపి అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ ఎంపి డెరెక్ ఓబ్రియన్ ప్రభుత్వ చర్యను మహాత్మా గాంధీకి అవమానంగా అభివర్ణించారు. మహాత్మా గాంధీని చంపిన వ్యక్తిని ఆరాధించిన వారే వీరు అని, వారు మహాత్మా గాంధీని అవమానించి, చరిత్ర నుండి తొలగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ పథకాన్ని రద్దు చేశారనే వాస్తవాన్ని దాచడానికి చేసిన ప్రయత్నమే ఇది అని సిపిఐఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌ను పూర్తిగా పునరుద్ధరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆర్భాటం. అది పనిచేస్తున్న ప్రాథమిక హక్కుల ఆధారిత చట్రాన్ని రద్దు చేస్తున్నారనే, కేంద్ర వాటాను విపరీతంగా తగ్గించారనే దిగ్భ్రాంతికరమైన వాస్తవాన్ని దాచడానికి చేసిన ప్రయత్నం' అని ఆయన ఆరోపించారు. 'బాధ్యతను రాష్ట్రాలపైకి నెట్టేస్తున్నారు. ఇప్పుడు కేటాయింపులను తగ్గించడం ద్వారా ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలను కేంద్రం శిక్షించగలదు. లక్షలాది మంది ప్రజలకు వారి హక్కులను దూరం చేస్తున్న సాంకేతిక జోక్యాలను కూడా ఇది చట్టబద్ధం చేస్తుంది' అని ఈ వామపక్ష నాయకుడు ఆరోపించారు. క్రూరమైన కార్మిక చట్టాల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే తీసుకున్న ఈ చర్యను అవివేకమైనదని పేర్కొన్నారు. ఇది గ్రామీణ కష్టాలను మరింత తీవ్రతరం చేస్తుందని, పూర్తిగా ఖండించదగినది బేబీ పేర్కొన్నారు. పార్లమెంటు లోపల, వెలుపల ఈ వినాశకరమైన చర్యకు వ్యతిరేకంగా తాము తీవ్రంగా పోరాడుతామని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి అన్నారు.

## రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ మేరకు ఈ బిల్లు రూపుదిద్దుకుంది. ఇప్పటివరకూ బీమారంగం రూ.82,000 కోట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించింది. 1938 బీమా సవరణ చట్టం, 1956 నాటి జీవిత బీమా కార్పొరేషన్ చట్టం, 1999 నాటి బీమా నియంత్రణ–అభివృద్ధి అథారిటీ చట్టం, నియంత్రణ చట్టాలకు ఈ సవరణలు చేస్తారు. ఈ సవరణతో బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరో 26 శాతానికి పెరిగి పూర్తిస్థాయికి చేరుకుంటాయి. నిజానికి ఈ బిల్లు ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నూటికి నూరుశాతం మేరకు పెరిగినప్పటికీ ఈ ప్రతిపాదిత కొత్త సవరణ ప్రకారం బీమారంగంలో ఉన్నతాధికారులు అంటే సిఇఓ లేదా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వంటి పదవులు నిర్వహించేవారంతా తప్పనిసరిగా భారతీయ పౌరులై ఉండాలి. వీరంతా ఐదేళ్ళపాటు అధికారంలో ఉండేందుకు వీలు కలుగుతుంది. లేదా 65 ఏళ్ళు వయసు వచ్చే వరకూ కొనసాగే వీలు కలుగుతుంది. బీమా కంపెనీల మధ్య విలీనాలకు కూడా ఈ బిల్లు అవకాశం ఇవ్వనున్నది. ఈ ప్రతిపాదిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు వీలుగా కేంద్ర మంత్రివర్గం గడచిన శుక్రవారంనాడే ఆమోదం తెలియజేసింది. బీమారంగంలో తదుపరి అభివృద్ధి వేగం పుంజుకోవడానికి ఈ బిల్లు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రివర్గం పేర్కొంది. అదేవిధంగా పాలసీదారులకు కూడా పూర్తి రక్షణకు ఉపయోగిస్తుంది. పాలసీదారులకు సరైన అవగాహన కల్పించడం, వారి ప్రయోజనాలకు వీలుగా ఒక రక్షణ నిధి వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. దీనివల్ల బీమారంగంలో కార్యకలాపాలుఎలాంటి చట్టపరమైన ఆటంకాలు లేకుండా సజావుగా సాగిపోవడానికి వీలు కలుగుతుంది.

## గజిబిజి వచ్చే...

(మొదటి పేజీ తరువాయి)

బలోపేతం అవసరం' అని ఆయన అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ జీవనోపాధి భద్రతను పెంచడం లక్ష్యంపై దృష్టి సారించినప్పటికీ, కొత్త బిల్లు 'సంపన్నమైన, స్థితిస్థాపక గ్రామీణ భారత్ కోసం సాధికారత, వృద్ధి, కన్వర్జెన్స్, సంతృప్తతను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని, 'విక్షిత్ భారత్ జాతీయ గ్రామీణ మౌలిక సదుపాయాల స్టాక్‌ను ఏర్పాటు చేయడానికి ప్రజా పనుల ద్వారా సాధికారత, వృద్ధి, కన్వర్జెన్స్, సంతృప్తతను ఉద్ఘాటిస్తుంది.




# జనరల్
STATE & REGIONAL NEWS

## కొనసాగుతున్న ఆర్చరీ పోటీలు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లో జరుగుతున్న 45వ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో సోమవారం కాంపౌండ్ విభాగం పోటీలు ముగిశాయి. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ గుస్తీ జె నోరియా, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్ అనిల్ కామినేని, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు కార్యదర్శి అరవింద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అశ్విన్ రావు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా

## మాదకద్రవ్యాల వ్యసనం..
# సమాజ శ్రేయస్సుకు హానికరం

ప్రజాపక్షం/హైదరాబాద్: కొంతమంది ప్రజలలో మాదకద్రవ్యాల వ్యసనం సమాజ శ్రేయస్సుపై తీవ్రమైన హానికరమైన ప్రభావాన్ని చూపుతుందని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆవేదన వ్యక్తం చేసారు. సమాజంలో చోటు చేసుకుంటున్న సకల అనర్థాలకు, అరాచకాలకు, అమానుషత్వ దోరణులకు మత్తే ప్రధాన కారణం అని, రాష్ట్రంలో, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడానికి పోలీస్ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా 'డ్రగ్స్ వద్దు ఆరోగ్యమే ముద్దు' అనే నినాదంతో భారత స్నేహ, సాంస్కృతిక, సహకార సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ అవగాహనా ర్యాలీ, సదస్సు హైదరాబాద్ చాంద్రాయణగుట్టలో సోమవారం జరిగింది. కార్యక్రమంలో స్థానిక యువనేత సలాం బాకీ న్వాన్ ఆధ్వర్యంలో యువత భారీగా పాల్గొన్నారు. యువతను ఉద్దేశించి సందీప్ శాండిల్య, సిపిఐ మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా తదితరులు ప్రసంగించారు. సందీప్ శాండిల్య మాట్లాడుతూ యువతలో మాదకద్రవ్యాల వ్యసనం ఒక తీవ్రమైన ఆందోళన కలిగించే విషయంగా మారిందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడి యువత తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, ఫలితంగా నేరాలు చేయడంతో పాటు తీవ్రమైన సామజిక, మానసిక, శారీరక సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం యువతకు వినాశనకరంగా మారిందని, యువత కలలు, విచ్ఛిన్నమైన కుటుంబాలు, ఆనందకరమైన జీవితానికి అవరోధంగా మారాయని సిపిఐ మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా ఆందోళన వ్యక్తం చేసారు. మాదక ద్రవ్యాల ఇంజక్షన్‌లు వాడి చాంద్రాయణగుట్టలో ఇద్దరు ఆటో డ్రైవర్లు, ఉప్పుగూడలో ఒక కార్మికుడు మృతి చెందడం ఆందోళనకరమన్నారు. డ్రగ్స్ మహమ్మారిని పారదోలి డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపాల్, నాయకులు వెంకట్‌రామ్ రెడ్డి, సిపిఐ నాయకులు బతరాజు నర్సింహా, ఇన్సాఫ్ నాయకులు మునీర్ పటేల్, ఎఐటియుసి నాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం రావాలి

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : విత్తన రైతులతో పాటు రైతులకు అన్నివిధాలుగా రక్షణ కల్పించే సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో విత్తనం పండించే రైతుల కంటే కంపెనీలే లాభపడుతున్నాయన్నారు. విత్తన రైతులకు కేంద్ర విత్తన చట్టం 2025 ముసాయిదాపై కమిషన్ లోతుగా ఆలోచన చేసింది రైతుకు ఇబ్బంది కాకుండా విత్తనం హక్కు ఉండేలా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాం. కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం 2025 ముసాయిదా విత్తన చట్టంలో చాలా లోపాలున్నాయని, ఈ చట్టంతో రైతులకు ఏమాత్రం న్యాయం జరగదని కోదండరెడ్డి పేర్కొన్నారు. కల్తీ విత్తనాలను కొన్ని కంపెనీలు బ్రాండ్ వేసుకొని అమ్ముతున్నాయని అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందున్నారు. తెలంగాణ లక్షల ఎకరాల్లో 40 శాతం విత్తనాల సాగు జరుగుతోందని తెలిపారు. ఇదే క్రమంలో ములుగులో మొక్కజొన్న విత్తనాలు సాగు చేస్తున్న గిరిజన రైతులను మోసం చేస్తే కమిషన్ చొరవ తీసుకుని న్యాయం చేసిందన్నారు. అంతేకాకుండా దేశ చరిత్రలో తొలిసారిగా మల్టీనేషనల్ కంపెనీల రూ.4 కోట్లవరకు నష్టపరిహారం కింద ఇప్పించామని అదే తరహాలో విత్తన చట్టంలో నష్టపరిహారం వచ్చేలా కమిషన్ సూచించిందని తెలిపారు. నకిలీ విత్తనాలతో కతా పూత రాక రైతులు నష్టపోతున్నారని అలాంటి రైతులకు అన్నివిధాలు రక్షణ కల్పించే విధంగా చట్టం ఉండనాల్నరు. 1966లోనే చట్టం తెచ్చినప్పటికీ గత కొన్నేళ్లుగా నకిలీ విత్తనాల అమ్మకాలు బాగా పెరిగాయని, అన్ని ఆధారాలతో కేంద్ర విత్తన చట్టం ముసాయిదాలో సవరణలు చేయాలని కోరామన్నారు. వ్యవసాయ రంగం రాష్ట్ర పరిధిలో ఉంటుందని, దీంతో రాష్ట్ర పరిధిలో కూడా చట్టాలు చేసుకునే అవకాశం వుందన్నారు. రాష్ట్రంలో విత్తన చట్టం రూపకల్పనకు కసరత్తు చేశామని ఆ ఫైల్ మంత్రి వద్ద ఉందని తెలిపారు. మల్టీనేషనల్ కంపెనీలు ఎక్కడో అనుమతి తీసుకొని రాష్ట్రాల్లో అమ్ముకొనే అవకాశం ఇస్తారా అన్ని ప్రశ్నించారు. రాష్ట్రాలకు కూడా కొన్ని హక్కులుండాల్సిందేనన్నారు.

**ప్రభుత్వాలు రైతు అనుకూల నిర్ణయాలు తీసుకుంటే రైతే రాజు : రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటే రైతే రాజు అవుతాడని, కాని రైతు హక్కులను కాపాడే విధంగా కేంద్ర ముసాయిదా లేదు రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి అన్నారు. కేంద్రం తెచ్చిన విత్తన చట్టం ముసాయిదాను తిప్పి కొట్టామని, మూల విత్తనం వద్దే రైతు మోసపోతున్నాడన్నారు. కొన్నేళ్లుగా కల్తీవిత్తనాలతోనే రైతులు నష్టపోతున్నారని, కల్తీవిత్తనాలను అరికట్టడానికి కంపెనీలను నియంత్రించాలని, ఉత్పత్తి, ధర, క్వాలిటీ కంట్రోల్ విషయంలో స్పష్టత ఉండాలన్నారు. పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాలను రైతు నాటిన తర్వాత మొలకెత్తకపోతే విత్తన కంపెనీలపై చర్యలు ఉండేలా చట్టం తీసుకురావాలని కోరారు.

# సినీ సంగీత చరిత్రపై చెరగని సంతకం

సంగీతానికి, పాటకు ఎల్లలు లేవని నిరూపించిన స్వర మాంత్రికుడు 'ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం' విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: భారతీయ సినీ సంగీత చరిత్రపై చెరగని సంతకం 'ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారతీయ 14 భాషల్లో 40వేలకు పైగా పాటలు పాడి, పాటకు ఎల్లలు లేవని నిరూపించిన స్వర మాంత్రికుడు అని కొనియాడారు. తరాలు మారినా, ఆయన పాట నిత్యనూతనంగా ప్రతీ తెలుగు హృదయాన్ని తట్టి లేపుతూనే ఉంటుందన్నారు. 'ది మ్యూజిక్ గ్రూప్ హైదరాబాద్' ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడితో కలిసి సోమవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో రారాజుగా, పాటల పల్లకిలో నెలరాజుగా, అమర గాయకుడిగా ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం మనందరి గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారన్నారు. కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా నటుడిగా, సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా మనల్ని అలరించారన్నారు. తెరపై కనిపించే నటులే పాడుతున్నారా అని అనిపించేలా పాడటం ఆయనకు మాత్రమే సాధ్యమయ్యిందన్నారు. ఆయన గొంతులో పలికిన ప్రతి పాటలో ఒక భావం, ఒక జీవం ఉండేదన్నారు. నూతన కళాకారులను ప్రోత్సహించడంలో, కొత్త సంగీత పోకడలను స్వాగతించడంలో ఎప్పుడూ ముందుండేవారన్నారు. మనం ప్రారంభించుకున్నది కేవలం విగ్రహం మాత్రమే కాదని, అది సంగీతానికి, నిబద్ధతకు, వినయానికి ప్రతీక అన్నారు. అపారమైన సంగీత సంపదను, ఆయన పాటించిన ఉన్నతమైన విలువలను అది మనకు నిరంతరం గుర్తు చేస్తుందన్నారు. కళలను ప్రోత్సహించేందుకు, కళాకారులను గౌరవించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ, రామచంద్రరావు, డా.కేఐ వరప్రసాద రెడ్డి, ఎస్‌పి. చరణ్, శుభలేఖ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కృత నిశ్చయంతో ఉందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచనల మేరకు వికాస్ రాజ్ సోమవారం అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణం కలియతిరిగిన ఆయన ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బి అధికారులకు, నిర్మాణ సంస్థకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ 12,14,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు 1196 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని, సిఎం, ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి రెగ్యులర్‌గా నిర్మాణ పురోగతిపై మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పూర్తి నాణ్యతతో స్ట్రక్చరల్ వర్క్ పూర్తయిందని, 95శాతం బ్రిక్ వర్క్, ప్లాస్టరింగ్ పూర్తయిందని, ఎమ్ఇపి 60 శాతం, ఫ్లోరింగ్, పెయింటింగ్ వర్క్స్ 50శాతం మేర పూర్తయి వేగంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. మొత్తంగా టిమ్స్ అల్వాల్ పనులు 70 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విధించిన గడువులోగా(2026 మార్చి) చివరి నాటికి అన్ని రకాల పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బి ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. రెగ్యులర్‌గా ఫీల్డ్ విజిట్ చేస్తానని అందరూ అలెర్ట్‌గా పనిచేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ అన్నారు. ఈ విజిట్‌లో ఆర్‌అండ్‌బి సిఈలు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డితో పాటు పలువురు ఇఇ, డిఇలు ఫీల్డ్ ఇంజనీర్లు, డిఇసి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం


మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహ్మద్ అజారుద్దీన్



ప్రజాపక్షం/హైదరాబాద్: క్రిస్మస్ అనేది ఆనందం, సంతోషం, ఐక్యతతో పాటు ప్రేమ, శాంతి, కరుణ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని, ఇటువంటి పండుగలు సామాజిక సామరస్యతను పెంపొందిస్తూ, భారతదేశపు వైవిధ్యంలో ఏకత్వం అనే మహత్తర సంప్రదాయాన్ని మరింత బలపరుస్తాయని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహ్మద్ అజారుద్దీన్ అన్నారు. డా.బిఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం నిర్వహించిన సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను క్రైస్తవ విద్యాసంస్థలో చదువుకున్నానని, అక్కడ ప్రతి సంవత్సరం క్రిస్మస్‌ను ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. క్రిస్మస్ పండుగ పేదల పట్ల సహానుభూతి, పంచుకునే స్వభావం, సమాజంలో పరస్పర సంబంధాలను బలపరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, శాంతియుతంగా, సమగ్రంగా, ఆనందోత్సాహాలతో జరుపుకునేలా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. క్రైస్తవ సోదర సమాజానికి హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి ఇంటికి శాంతి, సమృద్ధి, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సమాజానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవ్.డా.జాన్ వెస్లీ ప్రేరణాత్మక క్రైస్తవ సందేశాన్ని అందిస్తూ, ప్రేమ, శాంతి, కరుణ, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమాజంలో సౌహార్దంతో పాటు సద్భావాన్ని విస్తరించాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి. సబిత, సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల సంఘ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, చిట్టి బాబు, శశిభూషణ్, మనోహరమ్మ, జాకబ్ రాస్‌తో పాటు సెక్రటరియేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్, సెక్రటరీ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు రామ తదితరులు పాల్గొన్నారు.

# నాడు అభివృద్ధిలో ఫరిడవిల్లిన పల్లెలు..

గ్రామాల అభివృద్ధికి తనవంతూ సంపూర్ణ సహకారం అందిస్తా
మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట : నాడు అభివృద్ధిలో ఫరిడవిల్లిన పల్లెలు.. నేడు పడావు పడ్డాయ్ అని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఆదర్శగ్రామాలు అవార్డుల పల్లెలుగా చేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు అభివృద్ధికి నోచుకోవట్లేదన్నారు. రెండేళ్లలో రాష్ట్రానికి ఒక్క అవార్డు రాలేదన్నారు. పల్లెలు అభివృద్ధితో పాటు అవార్డులు సాధించటంలో పోటీపడాలన్నారు. మళ్లీ వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అని మాజీ మంత్రి హరీష్ రావు జోస్యం చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గంలో 91 గ్రామపంచాయతీలకు 80 గ్రామపంచాయతీలు బిఆర్ఎస్ సొంతం చేసుకోవటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించగా, వారిని అభినందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ నేడు కాలం కాకున్న కాళేశ్వరం నీళ్లతో కాలువల్లో నీళ్లు వస్తున్నాయని, అది కెసిఆర్ ఘనతనే అన్నారు. నాటి సాగునీటికి కాళేశ్వరం, మంచినీటికి మిషన్ భగీరథ స్ఫూర్తి సిద్దిపేటనే అన్నారు. పదేళ్లలో సిద్దిపేటకు 60 జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చాయన్నారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దటంలో ఐక్యతగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పల్లెలు పట్టం కట్టాయన్నారు. సిఎం సొంత జిల్లాలో కూడ కాంగ్రెస్ గెలువలేని పరిస్థితి ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో జరిగి సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గొప్ప విజయం సాధించిందన్నారు. సిద్దిపేట ప్రజలు, కార్యకర్తల అభిమానం. ప్రేమ నా హృదయంలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. అనంతరం సర్పంచ్, పాలకవర్గాన్ని హరీష్‌రావు సన్మానించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నేతలు కడవేర్గు రాజనర్సు, బిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి, పర్యావరణంపై దృష్టి కేంద్రీకరిస్తేనే
# భవిష్యత్తు బంగారుమయం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



ప్రజాపక్షం/కొత్తూరు: ప్రకృతి పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు మనుగడ ఉంటుందని.. నిర్లక్ష్యం చేస్తే అంధకారంలోకి వెళ్ళే అస్కారం ఎంతైనా ఉందని ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం కన్హాశాంతి వనంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించి హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమం, ప్రకృతి, పర్యావరణం, వ్యవసాయం, ధ్యానం, యోగా వంటి అంశాలపై రామచంద్ర మిషన్ వ్యవస్థాపకులు కమలేష్ డీ పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునాయుడు మొదటి సారిగా కన్హాశాంతివనంకు వచ్చిన నేపథ్యంలో కమలేష్ డీ పటేల్ ఘనంగా స్వాగతం పలికారు. కన్హాశాంతి వనంలో పర్యటించి పర్యావరణాన్ని పరిశీలించడంతో పాటు ప్రకృతి ప్రముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగం యొక్క ప్రాధాన్యతను, యోగా శిక్షణ ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కన్హాశాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడితేనే మానవ మనుగడకు అర్థం ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ముమ్మందు మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు హార్ట్‌ఫుల్‌నెస్ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెళ్ళిపోయారు.

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

సామాజిక తెలంగాణే నా ధ్యేయం
ఆస్క్ కవిత (ట్విట్టర్) ఎక్స్ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: సామాజిక తెలంగాణే తన లక్ష్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని తేల్చి చెప్పారు. సోమవారం ఆస్క్ కవిత హ్యాష్‌ట్యాగ్‌పై ట్విట్టర్ (ఎక్స్)లో పలువురు నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరంగా సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ విషయంలో తన విజన్, జాగృతి భవిష్యత్ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు సహా పలు ప్రశ్నలను నెటిజన్లు సంధించారు. వాటికి కవిత ఇచ్చిన సమాధానాలు. ట్విట్టర్ (ఎక్స్) పాలిటిక్స్ విభాగంలో ఆస్క్ కవిత ఇంటరాక్షన్ నంబర్ వన్‌గా నిలిచింది.

**2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం..**

సామాజిక తెలంగాణ తన ధ్యేయమని కవిత తెలిపారు. కొత్త పార్టీకి సంబంధించి అడిగిన ప్రశ్నకు స్పష్టత ఇచ్చారు. 2029 ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు సూచించిన పేరునే పార్టీకి పెడుతామన్నారు. సామాజిక న్యాయం కోసం జాగృతి పోరాటం కొనసాగుతుందన్నారు. క్రమంగా జాగృతిని చాలా బలంగా తయారు చేస్తామని చెప్పారు. త్వరలోనే జాగృతి మెంబర్‌షిప్ డ్రైవ్ కూడా ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా మేము వేసిన కమిటీల్లో ఇప్పటికే అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చామని చెప్పారు.

**కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి..**

రేవంత్ రెడ్డి పరిపాలన గురించి పలువురు నెటిజన్లు కవితను ప్రశ్నలు అడగగా.. ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో కాంగ్రెస్ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఆడపిల్లల చదువుకు మరణశాసనంగా మారిందన్నారు. ఇక ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. త్వరలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని చెప్పారు.

**చిరంజీవి అభిమానిని..**

కవిత వ్యక్తిగత అభిరుచులకు సంబంధించి పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. రామ్‌చరణ్ గురించి ఒక్క మాటలో చెప్పాలని అడగగా.. చాలా హంబుల్‌గా ఉండే వ్యక్తి, మంచి డ్యాన్సర్ అన్నారు. ఐతే తాను చిరంజీవి అభిమానిని అని, చిరంజీవి తర్వాతే రామ్‌చరణ్ అన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్‌లో గడిపిన క్షణాలు తనకు చాలా సంతోషాన్నిచ్చాయని అన్నారు.

## గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ సంగారెడ్డి ఎక్సైజ్ సిబ్బందికి 2019లో 160 కేజీలతో పట్టుబడిన నలుగురికి సోమవారం అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ పదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూపాయల లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్నటువంటి పోలగోని నిఖిల్, పవర్ శ్రీనివాస్, పవర్ సంతోష్, రాథోడ్ శ్రీకాంత్‌లు అరెస్ట్ చేశారు. ఈ కేసును సిఐలు మోహన్ కుమార్, రమేష్ రెడ్డి, ఎస్ఐలు రాజు, కేఎం విశ్వనాథులు పట్టుకున్నారు. నిందితులను గంజాయిని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిఐగా మధుబాబు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసులో పూలగోని నిఖిల్ నల్లగొండ, పవర్ శ్రీనివాస్, పవార్ సతీష సంగారెడ్డి, రాథోడ్ శ్రీకాంత్ బీదర్ కర్ణాటక చెందిన నలుగురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు న్యాయమూర్తి వెలువరించారని రాజేశ్వర్ పబ్లిక్ పాసిక్యూటర్ తెలిపారు. గంజాయి కేసులో నలుగురికి పదేళ్లపాటు జైలు శిక్ష పడడానికి పనిచేసిన ఎక్సైజ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాస్ ఖాసీం, మెదక్ డిప్యూటీ కమిషనర్ జై హరికిషన్, సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావులు అభినందించారు.


దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానము**
పెంబట్ల-కోనాపూర్, మం॥ సారంగాపూర్. జి॥ జగిత్యాల. (తెలంగాణ)

**సీల్డ్ టెండర్ కం - బహిరంగ వేలము ప్రకటన** తేది: 08-12-2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలము, పెంబట్ల-కోనాపూర్ గ్రామము యందలి శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి దేవస్థానము యొక్క మహాశివరాత్రి జాతర సందర్భముగా దేవాలయము వద్ద భక్తుల సౌకర్యార్థము తేది: 01-02-2026 నుండి 31-01-2027 వరకు వివిధ వేలముల హక్కుకై సీల్డ్ కం బహిరంగ వేలము ద్వారా తేది: 22-12-2025 సోమవారం రోజున ఉదయము గం॥ 11-30 ని॥లకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, రెనోవేషన్ కమిటి మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయమునందు బహిరంగ వేలము నిర్వహించబడును.

హెచ్చుపాట విధానము (సీల్డ్ టెండర్ కం బహిరంగవేలము)

| క్ర.సం. | వేలముల వివరములు | ధరావతు సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|
| 1) | దేవాలయావరణలో కొబ్బరికాయలు, పూజా సామానులు, బెల్లం, కిరాణం అమ్ముకొను హక్కు | 2,00,000/- | తేది: 12-02-2026 నుండి 23-02-2026 వరకు (మహాశివరాత్రి జాతరలో) |
| 2) | దేవాలయావరణలో కొబ్బరికాయలు, పూజా సామానులు, బెల్లం, కిరాణం అమ్ముకొను హక్కు | 2,00,000/- | తేది: 01-02-2026 నుండి 11-02-2026 మరియు తేది: 24-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 3) | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు | 1,00,000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 4) | కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొను హక్కు | 50,000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 5) | పూలు, పూలదండలు మరియు పండ్లు అమ్ముకొను హక్కు | 10,000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 6) | ఆట బొమ్మలు మరియు గాజులు అమ్ముకొను హక్కు | 10,000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 7) | పాదరక్షలు భద్రపరిచే హక్కు (చెప్పుల స్టాండ్) | 5,000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |

తక్కువపాట విధానము (సీల్డ్ టెండర్)

| క్ర.సం. | వేలముల వివరములు | షెడ్యూల్ ధర | ధరావతు సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 1) | చలువ పందిర్లు వేయుట | రూ.200/- | 1000/- | జాతర, ఉత్సవ, వేసవి సందర్భముగా |
| 2) | లైటింగ్ & సౌండ్ సిస్టమ్ | రూ.200/- | 1000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 3) | టెంట్లు, వంటపాత్రలు సామాగ్రి | రూ.200/- | 1000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 4) | రంగులు సున్నాలు వేయుట | రూ.200/- | 1000/- | జాతర సందర్భముగా |
| 5) | పూల అలంకరణ | రూ.200/- | 1000/- | తేది: 1-02-2026 నుండి 31-01-2027 వరకు |
| 6) | అన్నదానం నిర్వహణ | రూ.200/- | 1000/- | జాతర సందర్భముగా |

వేలముపాట పూర్తికాగానే హెచ్చు పాటదారుడు పాడిన మొత్తము డబ్బులలో 50% (సగం) డబ్బులు వెంటనే చెల్లించి రశీదు పొందవలెను. కావున ఇట్టి వేలములో పాల్గొను ఆసక్తి గల వారు సకాలములో విచ్చేసి, బహిరంగ వేలములో పాల్గొనగలరు. పై టెండరులో పాల్గొనదలచిన వారు డి.డి. కార్యనిర్వహణాధికారి, శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి దేవస్థానము, పెంబట్ల గారి పేరిట ఏదైన షెడ్యూల్ బ్యాంకులో చెల్లుబాటు అగునట్లు తీసుకొని రాగలరు లేదా నగదు రూపేన చెల్లించగలరు. వేలము పాట షరతులు వేలము సమయములో వినిపించబడును.

ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ / చైర్మన్ రెనోవేషన్ కమిటి సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 12001-PP/CL/ADVT/1/2025-26; Date: 15-12-2025

## మూడవ విడత ఎన్నికల్లో పటిష్ఠ బందోబస్తు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మూడవ విడత జరగనున్న ఎన్నికలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని హుజూర్‌నగర్ సిఐ జి.చరమందరాజు తెలిపారు. బుధవారం జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలలో హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మొత్తం 114 గ్రామ పంచాయతీలు, 1018 వార్డులలో ఎన్నికలు జరగాల్సి ఉండగా వాటిలో 18 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడం వల్ల, మిగిలిన 96 గ్రామ పంచాయతీలకు జరగబోతున్నాయని ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ అదేశాల మేరకు హుజూర్‌నగర్ సర్కిల్‌లో ఉన్న ఐదు పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామాల్లో బెల్టు షాపులు నడుపుతున్న 46 మందిపై కేసులు నమోదు చేసి సుమారు లక్షా 94,188 విలువైన 409 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీలలో మొత్తం 43 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి, గతంలో కేసులు ఉన్నటువంటి 368 మందిని తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు,మొత్తం 27గన్ లైసెన్స్ ఉన్న వారి నుండి స్వాదీనం చేసుకున్నారు.

## అభివృద్ధి చేసిన వారిని ఎన్నుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రేపు మూడవ విడత ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీల సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో కార్యకర్తలతో కలిసి మంత్రి మార్నింగ్ వాక్ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా బిఆర్‌ఎస్‌కి అనుకూలంగా జరిగాయన్నారు. బిఆర్ ఎస్‌కి కాంగ్రెస్‌కి మధ్య ఉన్నటువంటి వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.





## త్వరలో గొంగిడి మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక! బీర్ల జోస్యం

**ప్రజాపక్షం/మోటకొండూరు :** స్థానికంగా ఉండి ప్రజలకు సేవ చేసే నాయకులని సర్పంచులుగా గెలిపించాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన సోమవారం మోటకొండూర్ మండలంలోని దుర్శగాని పల్లి, వర్టూరు, గడ్డగోల్లోని బావి, మోటకొండూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచార సభలలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉండి ప్రజలకు సమర్ధవంతంగా సేవలు అందించే నాయకులను సర్పంచ్‌గా గెలిపించి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ గతంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారని ఈ ఎన్నికలలో సర్పంచ్‌గా గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గొంగిడి మహేందర్ రెడ్డి మా గురువు అని ఆయన త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకులు కంకాల వెలందర్, మాజీ జెడ్పిటిసి కొంతం మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగాపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘునాథ రాజు పాల్గొన్నారు.

## సర్పంచ్ బరిలో రైతుబిడ్డ




**ప్రజాపక్షం/చింతలపాలెం:** చింతలపాలెం గ్రామం నుంచి ప్రజలకు సేవ చేయుటలో విశేష ఆదరణ పొందిన కమ్యూనిస్టు కుటుంబానికి చెందిన ఉస్తేల నారాయణరెడ్డి కాంగ్రెస్ సహకారంతో సర్పంచ్ బరిలో దిగటం జరిగిందని సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఉస్తేల వీరారెడ్డిని ప్రజలు గెలిపించుకోవడం జరిగిందని, కమ్యూనిస్టు వీర విధేయుడిగా, వెనుకబడిన కులాలకు అండదండగా ఉంటూ రైతులకు సాగునీటి, గిట్టుబాటు ధర విషయంలో అనేక ఉద్యమాలలో పాల్గొని రైతులకు అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో ఉస్తేల నారాయణరెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, రైతులు, కార్మికుల పక్షాన నిలబడి ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ప్రజలు ఉంగరం గుర్తుకు ఓటు వేసి నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ సేవలు ఎప్పటికీ మరువం



**ప్రజాపక్షం/మునుగోడు:** విద్యార్థుల హక్కులు,ప్రజాస్వామ్య విలువలు,సామాజిక న్యాయం కోసం గణేష్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని ఎలాగలగూడెం గ్రామానికి చెందిన ఎఐఎస్‌ఎఫ్ మాజీ మండల అధ్యక్షులు ఈదులకంటి గణేష్ 14వ వర్ధంతి సందర్భంగా ఆగ్రామంలో గణేష్ స్థూపానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా,పేద విద్యార్థులకు న్యాయం కలగాలనే లక్ష్యంతో గణేష్ చేసిన పోరాటం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాష్,కట్కూరి లింగస్వామి,గోపగోని ఉదయ్,కట్కూరి వెంకన్న, లక్ష్మయ్య,సైదులు,వార్డ్ మెంబర్ మాధగోని లింగస్వామి, మల్లయ్య,స్వామి,అండాలు,సునీత పాల్గొన్నారు.

## పారదర్శకంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల సాధరణ పరిశీలకులు రవినాయక్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధరణ పరిశీలకులు రవినాయక్ అధికారులను అదేశించారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రీయను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. సోమవారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ర్యాండమైజేషన్ జరిపించారు. మూడవ విడత ఎన్నికలు చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్ నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, నేరేడుచర్ల, పాలకవీడు మండలల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపి ఓ లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో మూడవ విడతలో మొత్తం 146 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 1333 వార్డు సభ్యులకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వగా, 22 సర్పంచ్‌లు, 157 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో మిగిలిన 124 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1176 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 30 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1538 ఓపిఓలు 2026 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఈవో వివి అప్పారావు, డిపిఒ యాదగిరి పాల్గొన్నారు.



# 'స్థానికం'లో కాంగ్రెస్‌కు అత్యధిక సర్పంచ్‌లు

### ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించినందుకు కృతజ్ఞతలు

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 11, 14 తేదీల్లో రెండు విడతలుగా నిర్వహించగా, సూర్యాపేట నియోజకవర్గంలో మొదటి, రెండు విడతల్లో మొత్తం నాలుగు మండలాల్లో ఎన్నికలు పూర్తయ్యాయని, ప్రజలు భారీ మెజార్టీతో కాంగ్రెస్‌కి మద్దతు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అశీర్వదించారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో 117 గ్రామ పంచాయతీలకు గానూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 69 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించారని, బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 36 మంది, బిజేపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు 8 గ్రామ పంచాయతీల్లో గెలిచారని పేర్కొన్నారు. ఇండిపెండెంట్లలో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీ రెబల్స్‌గా పోటి చేసి గెలిచినవారేనని అన్నారు. మొత్తంగా సుమారు 60 శాతం కాంగ్రెస్, 30 శాతం బిఆర్ఎస్, 10 శాతం ఇండిపెండెంట్లు విజయం సాధించారని తెలిపారు. రెండేళ్ల రేవంత్ పాలనలో గ్రామీణ వ్యవస్థ మొత్తం కాంగ్రెస్ పార్టీ వైపు బలంగా నిలిచిందని, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి మహిళ సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. గత బిఆర్ ఎస్ పదేళ్ల పాలనలోపేదలకు ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, ఉద్యోగ కల్పన వంటి కార్యక్రమాలతో ప్రజల ఆశీర్వాదం పొందారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచులు 4665 మంది, బిఆర్ఎస్ సర్పంచులు 2354 మంది, బిజేపి 457 మంది, ఇండిపెండెంట్లు 1025 మంది గెలిచారని అన్నారు. రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో 90 శాతంకు పైగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి దూరమై ఇండిపెండెట్లుగా పోటీ చేసిన వారందరికి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, నెరేళ్ల మధుగౌడ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, వల్దాసు దేవేందర్, వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్ పాల్గొన్నారు.

## మూడవ విడత ఎన్నికల ర్యాండమైజేషన్



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మూడవ విడత ఎన్నికలు జరగనున్న దేవరకొండ డివిజన్‌లోని మండలాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మీ సమక్షంలో నిర్వహించడం జరిగింది.ఈనెల 11,14 తేదీలలో నల్లగొండ,చండూరు,మిర్యాలగూడ డివిజన్లలో రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే.కాగా ఈనెల 17న దేవరకొండ డివిజన్ పరిధిలోని చందంపేట,చింతపల్లి,దేవరకొండ,గుడిపల్లి,గుండ్లపల్లి,గుర్రంపోడు,కొండమల్లేపల్లి,నేరేడుగొమ్ము,పీఏపల్లి మండ లాలలోని 2206 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో చేపట్టడం జరిగింది.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,దేవరకొండ ఆర్‌డిఓ రమణా రెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య,జెడ్‌పిసీఈవో శ్రీనివాసరావు, డీఈవో బిక్షపతి,జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, తదితరుల ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కాగా 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 2647 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2959 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఇందుకుగాను మొత్తం 2206 బృందాలు అవసరం కానున్నాయి.ఈజిల్లా మేనేజర్ దుర్గారావు,ఎన్ఐసి ప్రతినిధి ప్రేమ్,తదితరులు ఈ ర్యాండమయ్యేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.



## పంచాయతీ నుండి పార్లమెంటు దాకా కమ్యూనిస్టులు ఉండాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/వలిగొండ :** స్థానిక సంస్థల ఎన్నికలలో దుప్పల్లి గ్రామంలో సిపిఐ అభ్యర్థి కామ్రేడ్ జావిద్ పాషా, వార్డు సభ్యులు కన్నబోయిన పృథ్వీ రాజ్, మామిడికాయల నరసింహ, ఆరూరి సంతోష, సిరబోయిన చంద్రకళ, ఒంటరి పోరులో అత్యధిక మెజారిటీతో సిపిఐగా గెలుపొందారు. గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేయవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సోమవారం దుప్పల్లి గ్రామంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సభలో గోద శ్రీరాములు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మాట్లాడుతూ వెనుకబడిన ఈ గ్రామానికి ప్రధానమైన మూడు రహదారులు ఒకటి దుప్పల్లి స్టేజి మెయిన్ రోడ్డు నుండి ఊర్ల వరకి, రెండవది దుప్పల్లి ఊర్ల నుండి మధిర ఎర్రకాలువ వరకు, మూడవది దుప్పల్లి ఊర్లో నుండి గోపరాజుపల్లి స్టేజి వరకి బీటీ రోడ్లు వేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యతో ఫోన్లో సంభాషించి రోడ్లు వేయాలని కోరగా వారు స్పందించి తప్పకుండా బీటీ రోడ్లు వేయడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దీటి నరసయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, శాఖ కార్యదర్శి కట్ల యాదగిరి, నాయకులు కన్నబోయిన తాతయ్య, బాలగోని సత్యనారాయణ, నరిగె యాదయ్య, నోముల నరసయ్య, కన్నబోయిన రాములు, పూదూరి అశోక్, రాపోల్ పవన్, మారోజు నరసింహాచారి పాల్గొన్నారు.

## పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారు : జగదీశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కొందరు ఎస్ఐలు చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం గరిడేపల్లి మండలంలో పొనుగోడు, గడ్డిపల్లి, కుతుబ్షాపురం గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. చింతలపాలెం, గరిడేపల్లి పరిధిలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు బైండోవర్ కేసులు పెడుతున్నారని తెలిపారు. తమ నాయకులపై అక్రమ కేసులుపెడితే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ బిఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రందాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, కడియం వెంకటరెడ్డి, మాశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.

## భర్తను చంపిన భార్యకు యావజ్జీవ కఠిన శిక్ష

### నల్లగొండ అదనపు జిల్లా జడ్జి రోజారమణి సంచలన తీర్పు

**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లా ఎస్‌సి,ఎస్‌టి కేసుల కోర్టు2 అదనపు జిల్లా,సెషన్స్ జడ్జి ఎన్.రోజా రమణి మరోసారి సంచలన తీర్పు వెలువరించారు. మానవీయ విలువలు మరిచి వివాహేతర సంబంధం పెట్టుకోవడమే కాకుండా పక్కా పథ కం ప్రకారం మద్యంలో విషం కలిపి భర్తను దారుణంగా హత్య చేసిన భార్యకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. నల్లగొండ జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల కోర్టు2 అదనపు జిల్లా,సెషన్స్ జడ్జి ఎన్.రోజా రమణి సోమవారం ఉదయం ఈ మేరకు మరోసంచలన తీర్పు వెల్లడించారు. సదరు కేసుకు సంబంధించిన కథా కమీషు ఇలా ఉంది. పరిశీలిస్తే దేవ రకొండ మండలంలోని శేరి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దతండాకు చెందిన రమావత్ మోతీలాల్, భార్య లలితతో కలసి అదే తండాలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ దంపతులిద్దరికీ వీరికి పందొమ్మిదేళ్ల కొడుకు,ఇరవైరెండేళ్ల కూతురు ఉండగా ఈ క్రమంలోనే లలిత మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, హైదరాబాద్ సరూర్ నగర్‌లోని నివసిస్తుంది. ఇద్దరి మధ్య తరచుగా గొడవల కారణంగా భర్త మోతీలాల్‌పై పలుమార్లుగా సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేసింది. 2021 డిసెంబర్ 29వ తేదీన హైదరాబాద్ నుంచి తనతో పాటు తెచ్చిన ఓ విషపదార్థాన్ని,మోతీలాల్‌కు మద్యంలో కలిపి తాపించింది. మరుసటి రోజు ఉదయం పొద్దుపోయే వరకు కూడా రాకపోవడంతో అన్న శివరాం వచ్చి చూసే సరికి అప్పటికే చనిపోయి ఉన్నాడు. లలితను గట్టిగా అడగడంతో నిజం ఒప్పకుంది. వెంటనే దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో శివరాం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అప్పటి సీఐ కే. బీసన్న దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.అప్పటి నుంచి కేసు వాయిదాలపై వాయిదాలుగా ముందుకు సాగుతూ ఎట్టకేలకు సోమవారం ఫైనల్‌కు రావడంతో న్యాయమూర్తి రోజా రమణి కేసు పూర్వపరాలను పరిశీ లిచి లలితను నేరస్తురాలిగా నిర్ధారించి,జీవితకాలపై కఠిన శిక్ష,1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో నాలుగు నెలలపాటు సాధారణ శిక్ష అనుభవించాల్సి ఉంటుందని జడ్జి వెల్ల డించారు. నేరస్తురాలికి శిక్ష పడేం దుకు సహకరించిన అదనపు పీపీ గ్రిడ్1 ఆర్.అఖిల,దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డికి,కోర్టు కానిస్టేబుల్ లింగయ్య, లైజన్ అధికారులు పి. నరేందర్,ఎన్.మల్లికార్జున్‌లను ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## మూడో విడత ప్రచారానికి తెర...



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 5 గంటలతో తెరపడింది. గత 10 రోజుల నుండి ఆయా గ్రామాలలో ప్రచారాలతో హోరెత్తిన గ్రామాలు నిశ్శబ్ధంగా మారా యి. సూర్యాపేట జిల్లాలో మూడో విడత పంచాయితీ ఎన్నికలు హుజూర్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని హుజూర్‌నగర్ రూరల్, మేళ్ళచెర్వు, చింతలపాలెం, మఠంపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 146 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లకు, 1333 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా ఇందులో ఇప్పటికే 22 సర్పంచ్ స్థానాలు, 157 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 124 గ్రామ పంచాయితీల సర్పంచ్, 1176 వార్డు స్థానాలకు ఆయా గ్రామ పంచాయితీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఈనెల 17వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం 30 శాతం రిజర్వు సిబ్బందిని కలుపుకొని 1538 ప్రిసైడింగ్ అధికారులు, 2026 ఓపిఓలను పోలింగ్ కోసం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ల సమక్షంలో ర్యాండమైజేషన్ ద్వారా విధులను కేటాయించారు. ఇదిలా ఉండగా ఎన్నికల ప్రచార నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పి కె నరసింహ పర్యవేక్షణలో ఆయా మండలాల్లో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గ్రామాలలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా ఆయా గ్రామాలలో ఉన్న బెల్ట్‌షాపులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం షాపులు మూతబడ్డాయి. ఇదిలా ఉంటే ఆయా పార్టీల అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా ఇంటింటికి వెళ్ళి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటూ మద్యం, మనీ, మాంసం పంపిణీ చేయడంలో బిజిగా ఉన్నారు.

## కౌంటింగ్ హాల్ వెనుక బ్యాలెట్ పేపర్!

### వాసాలమర్రి సర్పంచ్ ఎన్నిక వివాదం

### ఫలితం రద్దు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/యాదాద్రి -భువనగిరి :** కెసిఆర్ దత్తత గ్రామమైన వాసాలమర్రిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితంపై తీవ్ర గందరగోళం నెలకొంది. కౌంటింగ్ పూర్తయ్యాక, సమాన ఓట్లు రావడంతో టాస్ వేసి విజేతను ప్రకటించినా, మరుసటి రోజు కౌంటింగ్ హాల్ వెనుక భాగంలో ఒక పోలైన బ్యాలెట్ పేపర్ లభించడం ఈ వివాదానికి దారితీసింది. దీంతో, ఓడిన అభ్యర్థి ఉమా ఫలితాన్ని రద్దు చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు. వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 1234 ఓట్లు పోలవగా, 2 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. కౌంటింగ్లో మొత్తం 14 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. 3 ఓట్లు నోటాకు వచ్చాయి. లెక్కించాల్సిన మొత్తం ఓట్లు 1219 కాగా, కౌంటింగ్ సమయంలో ఒక ఓటు తేడా వచ్చిందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. తుది లెక్కలో ఇద్దరు ప్రధాన అభ్యర్థులకు సమానంగా చెరి 609 ఓట్లు వచ్చాయి. సమాన ఓట్లు రావడంతో అభ్యర్థుల సమక్షంలో టాస్ వేశారు. ఈ టాస్లో కాంగ్రెస్ మద్దతుదారురాలు అయిన అనురాధ విజేతగా నిలిచినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఫలితాన్ని ప్రకటించారు.

**మిస్సయిన ఓటు లభ్యం..** అభ్యర్థి అనుమానం నిజమైంది ఈ కౌంటింగ్ ప్రక్రియపై ఏదో రకమైన గందరగోళం జరిగిందని అనుమానించిన ఓడిన అభ్యర్థి ఉమా, మరుసటి రోజు ఉదయం కౌంటింగ్ కేంద్రం పరిసరాలను క్షుణ్ణంగా వెతికారు. ఈ తనిఖీలో, కౌంటింగ్ కేంద్రం వెనుక భాగంలో, కిటికీ వద్ద మిస్ అయినట్లు భావించిన పోలైన ఒక్క బ్యాలెట్ పేపర్ లభించింది. ఈ లభ్యమైన బ్యాలెట్ పేపర్‌తో పాటు, కౌంటింగ్లో జరిగిన లోపాలను తెలియజేస్తూ అభ్యర్థి ఉమా వెంటనే యాదాద్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఒక్క ఓటు ఫలితంపై ప్రభావం చూపి, టాస్ ద్వారా ప్రకటించిన ఫలితం చెల్లదన్నది ఆమె ప్రధాన వాదన. లభ్యమైన బ్యాలెట్ పేపర్‌ను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ నెలకొంది.

# పంచాయతీ ఎన్నికల్లో పట్టు నిలుపుకున్న పైళ్ల శేఖర్‌రెడ్డి

### భువనగిరి నియోజకవర్గంలో మంచి స్థానాలు సాధించిన బిఆర్ఎస్

### కాంగ్రెస్ ఎమ్మెల్యే మండలంలోనూ బిఆర్ఎస్ పైచేయి

### భువనగిరి మండలంలోనూ గులాబీ ఆధిపత్యం





**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** భువనగిరి నియోజకవర్గంలో జరిగిన రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు మరో సారి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత పైళ్ల శేఖర్ రెడ్డి తన పట్టును నిలబెట్టుకున్నారు. నియోజకవర్గంలోని పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్, భువనగిరి మండలాల పరిధిలో మొత్తం 126 గ్రామ పంచాయతీలకు గాను, బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 56 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు ముఖ్య మండలాల్లోనూ బిఆర్ఎస్ పార్టీ అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకొంది.


**వ్యూహాత్మక ఎంపిక..** ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే శేఖర్ రెడ్డి గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి, ఏకాభిప్రాయంతో 'గెలుపు గుర్రాల' ఎంపికకు కసరత్తు చేశారు. వార్డు అభ్యర్థులను సైతం ఏకాభిప్రాయంగా ఎంపిక చేయడం ద్వారా, నియోజకవర్గంలో రెబల్స్ అభ్యర్థుల బెడద లేకుండా కట్టడి చేయడంలో ఆయన విజయం సాధించారు. నాలుగు మండలాల్లోని 120 గ్రామా ల్లో విస్తృతంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారం, కార్యకర్తలకు, అభ్యర్థులకు ఆయన వెన్నుదన్నుగా నిలవడం, అధికార పార్టీ నుంచి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సరైన దిశానిర్దేశం చేయడమే ఈ ఫలితాలకు మూలకారణం. 'గత పది సంవత్సరాల కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న చరిత్రను ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పైళ్ల నిలబెట్టుకున్నారు. స్థానిక సంస్థలపై ఆయన పట్టు నిరూపితమైంది.'

**కాంగ్రెస్ ఎమ్మెల్యే మండలంలోనే బిఆర్ఎస్ హవా..!**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సొంత మండలం వలిగొండలో ఫలితాలు కాంగ్రెస్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ మండలంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు హోరాహోరీగా తలపడగా, స్వల్ప తేడాతో బిఆర్ఎస్ పైచేయి సాధించింది.బిఆర్ఎస్ 18 స్థానాలు కైవసం చేసుకుని, మండలంలో తమ ఆధిక్యాన్ని చాటుకుంది. కాంగ్రెస్ 17 స్థానాలకు పరిమితమై, అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యంలోనూ గట్టి పోటీ ఇచ్చింది. ఒక స్థానం సిపిఐ, మరొక స్థానం సిపిఎం పార్టీలు దక్కించుకోవడం విశేషం. ఎమ్మెల్యే సొంత మండలంలోనే అధికార పార్టీ కంటే ప్రతిపక్ష పార్టీ ఒక స్థానం ఎక్కువ గెలుచుకోవడం వారికి ఉత్సాహాన్నిచ్చింది.

**భువనగిరిలో గులాబీ ఆధిపత్యం..**

భువనగిరి మండలంలో కూడా బిఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటింది. ఇక్కడ కూడా సగానికి పైగా స్థానాలను గెలుచుకుంది. మండలంలోని మొత్తం 34 గ్రామ పంచాయతీలకు గాను, 18 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలను బిఆర్ఎస్ కైవసం చేసుకుని అత్యధిక స్థానాలు సాధించిన పార్టీగా నిలిచింది. ఈ మండలంలో కాంగ్రెస్ పార్టీ కేవలం 12 స్థానాలు దక్కాయి. బిఆర్ఎస్ సాధించిన ఈ విజయం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న భువనగిరి వలిగొండ మండలాల్లో టిఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మెరుగైన ప్రదర్శన కనబరచడం అధికార పార్టీకి సమీక్షించుకోవాల్సిన పరిస్థితిని తెలియజేస్తున్నదని పరిశీలకులు వ్యాఖ్యానించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విశ్రాంత వేళల్లో ప్రత్యేక పూజలా..? 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బృందావన్‌లోని ఓ ఆలయ దర్శన వేళల్లో మార్పులకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బృందావన్‌లోని బాంకీ బిహారీ ఆలయంలో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తంచేసింది. దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నతస్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే కోర్టుకు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని, కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు.

## 'ఓట్ల చోరీ' ఆరోపణ కాంగ్రెస్‌ది

కూటమికి సంబంధం లేదు : ఒమర్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ :** విపక్ష పార్టీలు ఓట్ల చోరీ ఆరోపణలతో కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దీన్ని ప్రధాన అస్త్రంగా మలుచుకున్నారు. ఈ క్రమంలో 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ అంశాన్ని కేవలం కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతోందని, దానికి ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి ఎలాంటి సంబంధం లేదని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. కాంగ్రెస్ ఆరోపిస్తున్న ఓట్ల చోరీ, ఎన్నికల్లో అక్రమాలపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'ఇండియా కూటమికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రతి పార్టీకి తన సొంత అజెండాను నిర్దేశించుకునే స్వేచ్ఛ ఉందని చెప్పారు. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలను హస్తం పార్టీ తన ప్రధాన అంశాలుగా చేసుకుంది. ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' బహిరంగ సభ నిర్వహించిన మరుసటి రోజే ఆయన ఈ మేరకు స్పందించారు. 'ఇండియా' కూటమి పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుగా ఉందని ఒమర్ అబ్దుల్లా ఇటీవల వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల విషయంలో విపక్ష కూటమి పట్టింపు లేనట్లుగా వ్యవహరించిందని ఆరోపించారు. ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. కేంద్రంలోని మోదీ సర్కారును గద్దె దించేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని అన్నారు. సత్యం, అహింసా మార్గంలోనే దానిని సాధిస్తామని చెప్పారు. బిజెపి కోసం ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు.

## కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా మాజీ ఐఎఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణస్వీకారం స్వీకారం చేశారు. ఆయనతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సహా పలువురు హాజరయ్యారు. హీరాలాల్ సమారియా పదవీ కాలం సెప్టెంబరు 13వ తేదీతో ముగియడంతో సిఐసి పోస్టు ఖాళీ అయింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కమిటీ రాజ్‌కుమార్ గోయల్ పేరును ప్రతిపాదించింది. రాజ్‌కుమార్ గోయల్ 1990 బ్యాచ్ అరుణాచల్ ప్రదేశ్–గోవా–మిజోరం– కేంద్రపాలిత ప్రాంతాల (ఎజిఎంయుటి) క్యాడర్‌కు చెందిన ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) అధికారి. ఆయన ఆగస్టు 31న కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలోని న్యాయ విభాగ కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. హోంశాఖలో కార్యదర్శి (సరిహద్దు నిర్వహణ)గా కూడా పనిచేశారు. కేంద్రంతో పాటు జమ్మూ కశ్మీర్‌లోనూ కీలక పదవులను నిర్వహించారు. కేంద్ర సమాచార కమిషన్‌కు ఒక సిఐసి నేతృత్వం వహిస్తారు. గరిష్టంగా 10 మంది సమాచార కమిషనర్లు ఉంటారు. ప్రస్తుతం ఆనంది రామలింగం, వినోద్ కుమార్ తివారీ సమాచార కమిషనర్లుగా ఉన్నారు. దీంతో మిగిలిన ఖాళీలకు మాజీ రైల్వే బోర్డు చీఫ్ జయ వర్మ సిన్హా, ఇంటెలిజెన్స్ బ్యూరో, హోం మంత్రిత్వ శాఖ, కేబినెట్ సెక్రటేరియట్‌లో కీలక పదవులు నిర్వహించిన మాజీ ఐపిఎస్ అధికారి స్వాగత్ దాస్, మాజీ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సిఎస్ఎస్) అధికారి సంజీవ్ కుమార్ జిందాల్, మాజీ ఐఎఎస్ అధికారి సురేంద్ర సింగ్ మీనా, మాజీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి ఖుష్వంత్ సింగ్ సేథీను సమాచార కమిషనర్లుగా నియమించాలని కమిటీ సిఫార్సు చేసింది. సీనియర్ జర్నలిస్టులు పిఆర్ రమేష్, అశుతోష్ చతుర్వేదితో పాటు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు (పిఎన్‌జిఆర్‌బి) సభ్యురాలు (చట్టపరమైన) సుధా రాణి రేలంగిను కూడా సమాచార కమిషనర్లుగా నియమించేందుకు కమిటీ ప్రతిపాదించింది.

### సిఐసిలో ప్రస్తుతం 30,838 పెండింగ్ కేసులు

సెప్టెంబర్ 13న హీరాలాల్ సమారియా పదవీకాలం ముగిసిన తర్వాత సిఐసి పదవి ఖాళీగా ఉంది. సిఐసిలో ప్రస్తుతం 30,838 పెండింగ్ కేసులు ఉన్నాయి. 2014 నుంచి ఈ పదవి చాలాసార్లు ఖాళీగా ఉంటోంది. ఈ పదవి కోసం మే నెలలో ప్రకటన జారీచేయగా 83 దరఖాస్తులు రాగా, కమిషనర్ల పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## దిద్దుబాటు చర్యలు అవసరం

కేరళలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను అంగీకరించిన వామపక్షాలు


ప్రజల నుండి వచ్చిన స్పందన వెనుక గల కారణాలను పరిశీలిస్తామని వెల్లడి



**తిరువనంతపురం:** కేరళలో గత రెండు రోజుల క్రితం వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాల్లో అధికార వామపక్ష కూటమిలోని కీలక భాగస్వాములైన సిపిఐ(ఎం), సిపిఐలు పేలవ ఫలితాలను ప్రదర్శించాయి. దీంతో పార్టీలలో సాధ్యమయ్యే దిద్దుబాటు చర్యల అవసరాన్ని అంగీకరించాయి. ఈ ఎన్నికలలో వారి చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్ తన కూటమిని నిర్ణయాత్మక విజయానికి నడిపించగా, బిజెపి ఆశ్చర్యకరమైన, గణనీయమైన పురోగతిని సాధించింది. కాగా, ఈ రెండు వామపక్ష పార్టీలు తమ ఎన్నికల వ్యూహంలోని లోపాలను, అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ విధానాలను అంచనా వేయడానికి సోమవారం తిరువనంతపురంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాలను నిర్వహించాయి. 2016 నుండి వరుసగా మూడవసారి అధికారాన్ని ఆశిస్తున్న అధికార పక్షానికి, 2026 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎల్‌డిఎఫ్ కన్వీనర్, సిపిఐ(ఎం) నాయకుడు టిపి రామకృష్ణన్ మాట్లాడుతూ ఎన్నికలలో వామపక్ష కూటమికి ప్రజల నుండి వచ్చిన స్పందన వెనుక గల కారణాలను పరిశీలిస్తామని చెప్పారు. తమ వైపున ఏవైనా తప్పులు జరిగి ఉంటే, వాటిని సరిదిద్దుతామని, ప్రజల అభిప్రాయాన్ని కోరతామని చెప్పారు. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపి ఓట్లను సాధించిందని, అక్కడ కాషాయ పార్టీ ఎల్‌డిఎఫ్‌ను అధికారం నుండి తొలగించిందని ఆయన అంగీకరించారు. తాము ఈ వాస్తవాన్ని అంగీకరిస్తామని, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం విలేకరులతో మాట్లాడుతూ, ఎల్‌డిఎఫ్ ఓటమి చవిచూసిందని, ఈ ఫలితాన్ని పార్టీ కమిటీలు తీవ్రంగా పరిగణించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ ప్రక్రియలో సోమవారం మొదటి దశ సమావేశాలు జరిగాయన్నారు. తాము నిజాయితీగా పరిశీలించి, ఏవైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి, తప్పులను సరిదిద్దిన తర్వాత ముందుకు సాగుతామన్నారు. వామపక్ష కూటమి తిరిగి పుంజుకుంటుందని నొక్కి చెబుతూ, కేరళ భవిష్యత్తు ఎల్‌డిఎఫ్ అవుతుందని విశ్వం పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు తక్కువ సమయం మిగిలి ఉందని పేర్కొంటూ, అవసరమైన దిద్దుబాట్లను గుర్తించి, వాటిని వేగంగా అమలు చేస్తామని ఆయన అన్నారు. 'దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలోనే ఎల్‌డిఎఫ్ బలం ఉంది. తప్పులు జరిగితే, వాటిని అంగీకరించడానికి లేదా సరిదిద్దడానికి మేము వెనుకాడము. ఇది సిపిఐ, సిపిఐ(ఎం), అన్ని ఎల్‌డిఎఫ్ పార్టీలు సమర్థించే కమ్యూనిస్ట్ విలువ అని ఆయన అన్నారు. సమస్యలను ఎత్తిచూపుతూ, దిద్దుబాటు చర్యలను సూచిస్తూ నాయకత్వానికి లేఖలు రాయాలని కార్యకర్తలకు, ప్రజలకు కూడా సిపిఐ విజ్ఞప్తి చేసింది. శబరిమల బంగారు నష్టం ఘటనపై ఎల్‌డిఎఫ్‌కు వ్యతిరేకంగా ప్రచారం జరిగిందని పార్టీ ఎంపి పి.సందోష్ కుమార్ అన్నారు. కొన్ని పరిణామాలు ఇటువంటి ప్రచారానికి దోహదపడ్డాయని చెప్పారు. ఎన్నికల కోణం నుండి చూస్తే, ఇది ఒక సైద్ధాంతిక సంక్షోభాన్ని సృష్టించి (కాంగ్రెస్ నేతృత్వంలోని) యుడిఎఫ్‌కు సహాయపడిందన్నది వాస్తవమని ఆయన పేర్కొన్నారు. శబరిమల సమస్య (అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం) 2018–19లో జరిగినంత తీవ్ర స్థాయికి చేరకపోయినప్పటికీ, ఇటీవల జరిగిన బంగారం అదృశ్యం ఘటన ఎన్నికల సమయంలో ఎల్‌డిఎఫ్‌పై కొంత ప్రభావం చూపిందని ఆయన అన్నారు. శబరిమల ఉన్న వార్డులో మనం గెలిచినప్పటికీ ఈ సంఘటనకు సంబంధించిన ప్రచారాలు, పాటలు ప్రజల మనస్సులో ప్రశ్నలను రేకెత్తించాయని, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసి ఉండవచ్చు అని సందోశ్ కుమార్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ర్యాలీలో మోదీ వ్యతిరేక వ్యాఖ్యలు
## పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం

కాంగ్రెస్ అగ్రనేతలు క్షమాపణ చెప్పాలని బిజెపి డిమాండ్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా శుక్రవారం వాయిదా పడిన ఉభయసభలు సోమవారం ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశమయ్యాయి. సభలు సమావేశమైన వెంటనే 'ఓట్ చోర్ గద్దీ చోడ్' పేరుతో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ర్యాలీలో బిజెపి, కేంద్ర ఎన్నికల సంఘాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేయడంపై అధికార పార్టీకి చెందిన సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య కొంత వాగ్వాదం, మాటల యుద్ధం సాగింది. ఈ నేపథ్యంలో ఉభయసభలను మధ్యాహ్న సమయానికి స్పీకర్, చైర్మన్ రెండు మార్లు వాయిదా వేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో దేశ ప్రజల ఓటు హక్కును దొంగిలిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ నేత మంజులతా మీన వివాదాస్పద కామెంట్స్ చేశారు. 'మోదీ నీ సమాధిని తవ్వుతాం. ఇవాళ కాకుంటే రేపు నీ సమాధిని తవ్వుతాం' (మోదీ తేరీ ఖబర్ ఖుదేగీ, ఆజ్ నహీ తో కల్ ఖుదేగీ) అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభంకాగనే స్పీకర్ ఓమ్ బిర్లా తొలుత ఇటీవల మృతి చెందిన లోక్‌సభ మాజీ సభ్యులు సుభాష్ అహుజా, ప్రొఫెసర్ సలాహుద్దీన్, బాల్ కృష్ణ చౌహాన్‌లకు నివాళి అర్పించారు. ఆ వెంటనే ట్రెజరీ బెంచ్‌ల సభ్యులు ప్రధానమంత్రిపై బెదిరింపులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ తమ స్థానాల్లో నుంచి లేచి ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళం చెలరేగింది. ఈ అంశంపై బిజెపి, కాంగ్రెస్ సభ్యులు మాటల యుద్ధంలో తలమునకలైపోవడంతో లోక్‌సభను మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆదివారం జరిగిన కాంగ్రెస్ ర్యాలీలో లేవనెత్తిన నినాదాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అగ్ర నాయకత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మేము రాజకీయ ప్రత్యర్థులం, శత్రువులు కాదు. కాంగ్రెస్ ర్యాలీలో ప్రధానమంత్రి సమాధి తవ్వుతామని కాంగ్రెస్ కార్యకర్తలు బెదిరించారు. ఇది జరగడం అత్యంత దురదృష్టకర సంఘటన' అని రిజిజు అన్నారు. సభ ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య తొలుత స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దిగి హోంమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చైర్‌లో ఉన్న బిజెపి సభ్యుడు దిలీప్ సైకియా పార్లమెంటరీ పత్రాలను ప్రవేశపెట్టడానికి అనుమతించారు. జీరో అవర్ ప్రస్తావన తర్వాత వారి సమస్యలను లేవనెత్తడానికి అనుమతిస్తానని కాంగ్రెస్ సభ్యులకు హామీ ఇచ్చారు. సభ్యులు తమ నిరసనలను నుంచి ఏ మాత్రం వెనక్కి తగ్గకపోవడంతో సైకా మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. మరో వైపు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసిన నినాదాలపై కేంద్ర మంత్రి జె పి నడ్డా ఖండిస్తూ, ప్రతిపక్ష నాయకత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడంతో రాజ్యసభ కార్యకలాపాలు సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. సభ ప్రారంభం కాగనే ఎజెండా పత్రులను సభ్యులకు అందించిన తరువాత సభా నాయకుడు నడ్డా ఈ అంశాన్ని లేవనెత్తారు. నినాదాలు కాంగ్రెస్ పార్టీ ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ఈ నినాదాలను 'ఖండించదగినవి అని అభివర్ణిస్తూ, ప్రధానమంత్రికి వ్యతిరేకంగా అలాంటి నినాదాలు చేయడం, ఆయన మరణాన్ని కోరుకోవడం ఆమోదయోగ్యం కాదని నడ్డా అన్నారు. సభలో ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకురాలు మల్లికార్జున ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ రాజకీయాల్లో ఊహకు అందని స్థాయికి దిగజారింది. దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని నడ్డా అన్నారు. ఈ వ్యాఖ్యలు సభలో గందరగోళానికి దారితీశాయి, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు.

## కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తూ కేరళలో 'లేబర్ కాంక్లేవ్' సదస్సు

లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేకం, సమాఖ్య సూత్రాల ఉల్లంఘన

మంత్రి శివన్‌కుట్టి విమర్శ



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు కొత్త కార్మిక కోడ్‌లుగా ఏకీకృతం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ ఒక సదస్సును నిర్వహించనుందని రాష్ట్ర మంత్రి వి శివన్‌కుట్టి సోమవారం తెలిపారు. 'లేబర్ కాంక్లేవ్–2025' పేరుతో ఈనెల 19న రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారని శివన్‌కుట్టి తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన కార్మిక కోడ్‌లపై శివన్‌కుట్టి తీవ్ర విమర్శలు చేశారు. కొత్త లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేకమైనవని, సమాఖ్య సూత్రాల ఉల్లంఘనగా ఆయన అభివర్ణించారు. ఈ కోడ్‌లలోని అనేక నిబంధనలు కార్మికుల హక్కులను బలహీనపరుస్తాయని, రాష్ట్రాల అధికారాలను హరించివేస్తాయని ఆయన ఆరోపించారు. సమాఖ్య స్ఫూర్తికి లోబడి కార్మికులు, రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రత్యామ్నాయ విధాన విధానాలను రూపొందించడమే ఈ సదస్సు లక్ష్యమని రాష్ట్ర కార్మిక మంత్రి అన్నారు. కేంద్రం విధించిన కార్మిక చట్టాలపై సమన్వయంతో కూడిన వ్యతిరేకతలో భాగంగా పంజాబ్, తమిళనాడు, జార్ఖండ్, తెలంగాణతో సహా వివిధ రాష్ట్రాల కార్మిక మంత్రులు ఈ సదస్సులో పాల్గొంటారని శివన్‌కుట్టి తెలిపారు. కేరళ ఆర్థిక, న్యాయశాఖ మంత్రి కెఎన్. బాలగోపాల్, పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ కూడా ఇందులో పాల్గొంటారని భావిస్తున్నారు. ఈ సదస్సులో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్, కార్మిక సంఘాల నాయకులు, న్యాయ నిపుణులు, విద్యావేత్తల భాగస్వామ్యంతో రెండు కీలక సాంకేతిక సమావేశాలు జరుగుతాయని శివన్‌కుట్టి చెప్పారు. అడ్వకేట్ జనరల్ కె గోపాల కృష్ణ కురుప్ అధ్యక్షతన జరిగే మొదటి సమావేశం కార్మిక కోడ్‌ల ప్రభావంపై దృష్టి సారిస్తుంది. ఇందులో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ కీలక ప్రసంగం చేస్తారు. రెండవ సమావేశం కేరళ కార్మిక విధానం నేపథ్యంలో కార్మిక కోడ్‌లను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ వ్యూహాలను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే లక్ష్యంతో ఒక విధాన ప్రకటనతో ఈ సదస్సు ముగుస్తుందని మంత్రి తెలిపారు. కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తున్న వివిధ కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా తర్వాత కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కలిసి, విధాన ప్రకటనలో పేర్కొన్న డిమాండ్లను ప్రతిబింబించే ఒక వినతిపత్రాన్ని సమర్పించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 2020 నుండి పెండింగ్‌లో ఉన్న నాలుగు కార్మిక కోడ్‌లను నోటిఫై చేసింది. దీని ద్వారా గిగ్ కార్మికులకు సార్వత్రిక సామాజిక భద్రత కవరేజ్, ఉద్యోగులందరికీ తప్పనిసరి నియామక పత్రాలు, అన్ని రంగాలలో సకాలంలో చెల్లింపులతో కూడిన చట్టబద్ధమైన కనీస వేతనాలు వంటి ప్రధాన సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. కొత్త కార్మిక కోడ్‌లను అమలు చేసేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏ పరిస్థితుల్లోనూ కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంబించదని శివన్‌కుట్టి పునరుద్ఘాటించారు.

## నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరణ



**న్యూఢిల్లీ :** బిజెపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. మధ్యాహ్నం పాట్నా నుంచి ఢిల్లీ చేరుకున్న నితిన్ నబీకి ఢిల్లీ విమానాశ్రయంలో సిఎం రేఖా గుప్తా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. తర్వాత నితిన్ నబీని కేంద్ర మంత్రులు జెపి నడ్డా, అమిత్ షా స్వయంగా తొడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చొబెట్టారు. బాధ్యతలు స్వీకరించినస్వీకరించిన అనంతరం పుష్పాలు అందించిన కృతజ్ఞతలు తెలిపారు.


## ప్రముఖ హాలీవుడ్ నటుడు రాబ్ రైనర్ హత్య!
## ప్రముఖుల నివాళులు



**లాస్‌ఏంజెల్స్:** ప్రముఖ హాలీవుడ్ నటుడు, చిత్ర నిర్మాత రాబ్ రైనర్ (78), ఆయన భార్య మిచెల్ (68 )ఇద్దరూ వారి ఇంట్లోనే శవాలుగా కనిపించారు. వారు హత్యకు గురయ్యారా? అనే విషయం ఇంకా తేలలేదు. లాస్‌ఏంజెల్స్‌లోని అత్యంత విలాసవంతమైన ప్రాంతంలో ఉన్న వీరి నివాసానికి సోమవారం పోలీసులు, అగ్ని మాపకదళ సిబ్బంది చేరుకుని అక్కడి పరిస్థితులను గమనించారు. బహుశా ఇది జంట హత్యలై ఉంటాయని భావించి ఆ దిశగా దర్యాప్తు చేసేందుకు ఉపక్రమించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, నాన్సీ పెలోసీ సహా పలువురు డెమోక్రటిక్ పార్టీ నాయకులు, హాలీవుడ్ ప్రముఖులు రాబ్ రైనర్, ఆయన సతీమణికి నివాళులు అర్పించారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ విషయం ప్రకటించారు. ఐతే వారి మరణానికి సంబంధించిన విషయాలను అధికారులు బహిరంగంగా మాట్లాడేందుకు తిరస్కరించారు. ఐతే రాబరీ,హోమీసైడ్ డివిజన్ డిటెక్టివ్ విభాగం దర్యాప్తు చేపట్టింది. రాబ్ రైనర్ 1980,1990 దశకాలలో మరపురాని చిత్రాలు నిర్మించారు. ది సీజ్ స్పైనల్ టాప్ (1984), స్టాండ్ బై మీ (1986), ద ప్రిన్సెస్ బ్రైడ్ (1987), వెన్ హ్యారీ మెట్ సాలీ, (1989),మిజరీ (1990), అండ్ ఎ ఫ్యూగుడ్ మెన్ (1992) వంటి అపురూప చిత్రాలకు వివిధ శైలులలో దర్శకత్వం వహించడంలో ఆయన పేరు ప్రతిష్టలు పొందారు. హాలీవుడ్ హాస్య నటుడు కార్ల్ రైనర్ కుమారుడు రాబ్ రైనర్ 1960వ దశకంలో తన సినీ కెరీర్ ప్రారంభించారు. 1970వ దశకంలో సంచలనాత్మకమైన టీవీ సిట్‌కామ్'''ఆల్ ఇన్ ద ఫ్యామిలీ''లో మీట్ హెడ్ పాత్ర పోషించి భారీ విజయాన్ని అందుకున్నాడు. రీ మేకింగ్‌లో ఈ పాత్ర రెండు ఎమ్మీ అవార్డులు గెలుచుకుంది. అప్పటినుండి తిరుగులేని నటుడుగా జైత్రయాత్ర సాగించాడు. తర్వాత నిర్మాతగా మారాడు.

## ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితి

● అత్యంత ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ● 50 శాతం ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలను వాయు కాలుష్యం వెంటాడుతోంది. చలిపులి భయపెడుతోంది. సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 100కుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో 90 ఇండిగో విమాన సర్వీసులు, 29 ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు ఉన్నాయి. ఇంకొన్ని విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. దట్టమైన పొగమంచు విమాన సర్వీసుల రాకపోకలకు పెనుసవాలుగా మారింది. ఈ పరిస్థితుల్లో విమానంలోని పైలట్లకు రన్ వే, గగన మార్గం దాదాపు కనిపించదు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11.02 గంటలకు ఢిల్లీ విమానాశ్రయం ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేసింది. రన్‌వే విజిబులిటీ కొంత మెరుగుపడుతోందని తెలిపింది. అయినప్పటికీ ఢిల్లీ నుంచి బయలుదేరాల్సిన కొన్ని విమాన సర్వీసులు ప్రభావితం కావచ్చని వెల్లడించింది. విమాన సర్వీసుల వేళలు, రద్దు సమాచారం కోసం ఇండిగో, ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లను చూడాలని ప్రయాణికులను కోరింది. అంతకు ముందు ఢిల్లీ విమానాశ్రయం మరొక ట్వీట్ చేసింది. దట్టమైన పొగమంచు కారణంగా విమాన సర్వీసులు ప్రస్తుతం సిఎటి3 స్థాయి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని వెల్లడించింది.

### ముందుజాగ్రత్త కోసమే పలు సర్వీసులు రద్దు : ఇండిగో

'ఈ ఉదయం దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీలో విమాన సర్వీసులు ప్రభావితం అయ్యాయి. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా మేం పలు విమాన సర్వీసులను రద్దు చేశాం. దీనిపై ప్రయాణికులకు ముందస్తు సమాచారాన్ని అందజేశాం. ప్రయాణికుల భద్రతే మాకు ప్రధానమైంది' అని ఎక్స్ వేదికగా ఇండిగో రెండు వరుస ట్వీట్‌లు చేసింది.

### ఎయిర్ ఇండియా అడ్వైజరీ

ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రయాణికులకు అడ్వైజరీని జారీ చేసింది. ఢిల్లీ, ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా విజిబులిటీ తగ్గిందని తెలిపింది. ప్రతికూల వాతావరణం అనేది విమాన సర్వీసులను ప్రభావితం చేస్తోందని పేర్కొంది. ప్రయాణికులు విమానాశ్రయాలకు వెళ్లే ముందు ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లో తమ విమాన స్థితిని చెక్ చేసుకోవాలని సూచించింది.

### గాలి నాణ్యత డౌన్

చలికాలం వచ్చిందంటే చాలు ఢిల్లీలో వాయుకాలుష్యం అమాంతం పెరిగిపోతుంది. గాలి నాణ్యత తగ్గిపోతుంది. తాజాగా సోమవారం కూడా అదే జరిగింది. 'గాలి నాణ్యత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ' ప్రకారం, ఢిల్లీలో సోమవారం ఉదయం 6 గంటల సమయానికి గాలి నాణ్యతా సూచీ (ఎక్యుఐ) 457 వద్ద ఉంది. నగరంలోని అక్షరధామ్ ప్రాంతంలో 493, ద్వారకా సెక్టార్ 14లో 469 మేరకు ఎక్యుఐ నమోదైంది. వజీర్‌పూర్, రోహిణి, అశోక్ విహార్‌లో గత 24 గంటల్లో సగటున 500 ఎక్యుఐ నమోదైంది.

## కేరళలో 25 లక్షల మంది చిరునామాలేని ఓటర్లు

జాబితాల్లో మృతుల సంఖ్య 6.44 లక్షలు

**తిరువనంతపురం:** కేరళలో 25 లక్షలమంది ఓటర్లకు చిరునామాలు లేవని, వారి జాడ తెలియడంలేదని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు కేల్కర్ చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలకు ఈ విషయం తెలియజేశామన్నారు. కేరళలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా ఈ విషయం వెల్లడైందని సోమవారం తిరువనంతపురంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. కేరళలో తనిఖీల సందర్భంగా 6.44 లక్షలమంది ఓటర్లు చనిపోయినట్లు బూత్ స్థాయీ అధికారులు గుర్తించారని చెప్పారు. అదేవిధంగా 8.19 లక్షలమంది ఓటర్లు శాశ్వతంగా కేరళ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారని, 1.31 లక్షలమందిపేర్లు అనేకసార్లు జాబితాలలో నమోదయ్యాయని, మరో 7.12 లక్షలమంది ఓటర్లు వివరాలు ఎంతమాత్రం అందుబాటులో లేవని చెప్పారు. జాడ తెలియని ఓటర్లకు బూత్ స్థాయీ అధికారులు ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందజేసేందుకు ప్రయత్నిస్తే సాధ్యం కాలేదని, వారు అందజేయలేకపోయారని చెప్పారు. ఈ సమాచారాన్ని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేశామన్నారు. జాడ తెలియని ఓటర్ల జాబితాను విడిగా అధికారిక వెబ్‌సైటులో ప్రచురిస్తామన్నారు. తద్వారా ఓటర్లు తమ తమ పేర్లు తనిఖీ చేసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. కాసర్‌గాడ్, కొల్లాం, వేనాడ్ జిల్లాలలో 'సర్' ప్రక్రియ పూర్తయిందని,, మిగిలిన జిల్లాలో కూడా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. గతనెలలో కేరళ రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ ప్రారంభమైంది. ఐతే జాడ తెలియని ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం చెప్పిన గణాంకాల్లో ఉన్న వ్యత్యాసాలపట్లరాజకీయపార్టీలన్నీ ఈ సమీక్షా సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

ప్రజాపక్షం
మంగళవారం, 16 డిసెంబరు

# కేరళ ఎల్‌డిఎఫ్‌కు మేల్కొలుపు

కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో (పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు) కమ్యూనిస్టు నాయకత్వంలోని పాలక వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్)కు అనూహ్యమైన ఎదురుదెబ్బలు తగిలాయి. మరో మూడు మాసాల్లో శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఫలితాలకు ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే స్థానిక ఎన్నికలు పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెంటిలోనూ జరిగాయి. వరుసగా పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ పనితీరుపట్ల (స్థానిక సమస్యలు, స్వర్ణకు కొంత మినహాయింపు ఇచ్చినప్పటికీ) ప్రజల సంతృప్తి, అసంతృప్తి వ్యక్తమైన సందర్భం ఇది. దీన్ని ఎల్‌డిఎఫ్ తులనాత్మకంగా బేరీజువేసుకోవాలి, తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఇందులో వైఫల్యం జరిగితే దేశంలోని ఏకైక కమ్యూనిస్టు రాష్ట్రప్రభుత్వం ఉనికిని కోల్పోతుంది. ఇది స్థూలంగా వామపక్ష–ప్రజాతంత్ర శక్తులు, వ్యక్తులు, కార్మికవర్గ శ్రేణులను నిరాశకు గురిచేస్తుంది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యుడిఎఫ్ అధికారంలోకి వస్తుంది. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలవగానే చంద్రుణ్ణి అందుకున్నంతగా ప్రధాని ప్రభృతి తమ సంతోషాన్ని దాచుకోలేక కేరింతలు కొట్టడమ్చూగాని, అసెంబ్లీ ఎన్నికల్లో నున్న లేదా ఒకటిరెండు సీట్లనుంచి పురోగతి ఏమీ ఉండదు. కేరళ రాజకీయ, చారిత్రక నేపథ్యమే అందుకు కారణం. అయితే ఎల్‌డిఎఫ్ గెలిచినా లేదా యుడిఎఫ్ అధికారం చేబట్టినా రాష్ట్రం ఇండి కూటమి చేతిలోనే ఉంటుందనుకునేవారి అల్పసంతోషం. వామపక్ష ప్రభుత్వం దేశవ్యాప్తంగా శ్రమజీవుల్లో కలిగించే ఉత్సాహాన్ని, ఆశాభావాన్ని దానిస్థానంలో వచ్చే బూర్జువా ప్రభుత్వం ఇవ్వదు.

కేరళ రాజకీయ రంగానిది ఒక ప్రత్యేక పరిస్థితి. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచీ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్యనే పోరాటం. అధికారం పలుమార్లు ఆ రెండు పార్టీల మధ్య మారుతూ, కొంతకాలంగా అది సిపిఐ(ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ మధ్య రొటేట్ అవుతోంది. ఎల్‌డిఎఫ్ 2021 ఎన్నికల్లో వరుసగా రెండవసారి అధికారం చేబట్టి కొత్త అధ్యాయం లిఖించింది. వచ్చే ఎన్నికల్లో అది హ్యాట్రిక్ కొట్టాలన్నది వామపక్ష శక్తుల ఆశ. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎదురుదెబ్బగానే భావించాలి. అయితే ఇక్కడ విస్మరించరాని విషయం ఒకటుంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎల్‌డిఎఫ్ కు సంపూర్ణ మెజారిటీ ఇచ్చిన కేరళ ఓటర్లు ఆ తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లూ కాంగ్రెస్ కూటమికి అత్యధిక విజయాలు చేకూర్చారు. అయితే ఎల్‌డిఎఫ్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన అధిక్యత నిలబెట్టుకోవటం మెకానికల్‌గా జరుగదు. అది తప్పిదాలు సత్వరం దిద్దుకోగల ఎల్‌డిఎఫ్ సామర్థ్యం, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, ఏకీభావం, సమ ష్టిత్వం, ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించే రాజకీయ, పరిపాలన తక్షణ చర్యలపై ఆధారపడి ఉంటుంది. సమయం తక్కువగా ఉంది – అందుకుతగ్గ వేగంతో పనిచేయాలి.

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సహజంగానే యుడిఎఫ్‌లో ఉత్సాహం నింపాయి. బిజెపికి ఊరట కలిగించాయి. ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో యుడిఎఫ్ నాలుగు – కన్నూర్, కొల్లాం, త్రిస్సూర్, కొచ్చి గెలుపొందాయి. ఎల్‌డిఎఫ్ ఒక్క కోజికోడ్‌తో సంతృప్తి చెందాల్సి వచ్చింది. రాజధాని తిరువనంతపురం కార్పొరేషన్‌లో నలబదేళ్ల ఎల్‌డిఎఫ్ పాలన ముగిసి – 101 సీట్లున్న కార్పొరేషన్‌లో బిజెపి తన బలాన్ని 34 నుంచి 50కి పెంచుకుని పాలనా బాధ్యత చేపట్టనుంది. ఎల్‌డిఎఫ్ బలం 51 నుంచి 29సార్లకు తగ్గింది. ఓట్లుగా చూస్తే ఎల్‌డిఎఫ్ అధ్యక్షులకే 40వేలు ఎక్కువగా వచ్చాయట. యుడిఎఫ్ ఇతర విజయాలు – 941 గ్రామ పంచాయతీల్లో 505; 152 బ్లాక్ పంచాయతీల్లో 79; 14జిల్లా పంచాయతీల్లో 7; 86 మున్సిపాలిటీల్లో 54. కాగా ఎల్‌డిఎఫ్ – కోజికోడ్ కార్పొరేషన్, 340 గ్రామ పంచాయతీలు, 63 బ్లాక్ పంచాయతీలు, 7జిల్లా పంచాయతీలు, 28 మున్సిపాలిటీలు. బిజెపి పట్టణ ప్రాంతాల్లో తన స్థితిని మెరుగుపరుచుకుని, అనేక మున్సిపాలిటీల్లో ప్రతిపక్ష స్థానం దక్కించుకుంది. అది చాపకింద నీరులా నెమ్మదిగా, నిలకడగా బలం పుంజుకుంటున్న వాస్తవం విస్మరించరానిది.

పోలైన ఓట్ల శాతంలో వచ్చిన మార్పు లోతైన ఆత్మపరిశీలనకు హేతువు కావాలి. గ్రామ పంచాయతీల్లో 2020 ఎన్నికలతో పోల్చితే 2025లో యుడిఎఫ్ 4.9శాతం పెరగగా, ఎల్‌డిఎఫ్ 10.9శాతం తగ్గింది. బిజెపి ఎన్‌డిఏ ఓటు 2.2శాతం పెరిగింది. జిల్లా పంచాయతీల్లో తాజా ఎన్నికల్లో యుడిఎఫ్ ఓటు 12.3 శాతం పెరగగా, ఎల్‌డిఎఫ్ ఓటు 8 శాతం తగ్గింది. అందువల్లనే ఎల్‌డిఎఫ్ 7 జిల్లా పరిషత్‌లు యుడిఎఫ్‌కు కోల్పోయింది. ఎల్‌డిఎఫ్ గ్రామీణ ఓట్లలో ఇంత పెద్ద కోతపడటం యాదృచ్చికం అనలేము. ఇది లోతైన విశ్లేషణ, దిద్దుబాటు చర్యలను డిమాండ్ చేస్తున్నది. ఇక ఇప్పుడు కేరళ ఓటర్ల ఆలోచనతో కారు, దేశవ్యాప్తంగా వామపక్ష, అభ్యుదయ శక్తులు, వ్యక్తుల దృష్టి మూడు మాసాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలపైకే మరలుతుంది. కేరళతోపాటు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలపై కూడా. లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతినిన తరువాత బిజెపి కొత్త వ్యూహాలు, ఎత్తుగడలతో హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ ఎన్నికలు గెలుచుకుంది. తదుపరి రౌండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి యేతర రాష్ట్రాలున్నందున వీటికున్న ప్రాధాన్యత మెండు.

# ఇండియా కూటమి ఇల్లు చక్కదిద్దుకోవాలి


నిత్యా చక్రవర్తి

2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఆయన ఎన్‌డిఏను పెద్ద కుదుపు కుదిపిన ఇండియా కూటమికి ఏమవుతోంది? నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బిజెపి తొలిసారిగా స్వంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. ఎన్‌డిఎలోని ఇతర భాగస్వాములు, ముఖ్యంగా జెడి (యు), తెలుగుదేశం మద్దతుతో మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత కాలంలో ఇండియా కూటమి ఊపు మీద కనిపించింది. మోదీ పాలనలో బిజెపి పతనం ప్రారంభమైందనే అభిప్రాయం ఏర్పడింది.

2024 జూన్‌లో లోక్‌సభ ఫలితాలు వెలువడి ఏడాదిన్నర దాటిన తర్వాత, దేశంలో రాజకీయ దృశ్యం ఇప్పుడు పూర్తిగా భిన్నంగా ఉంది. ఈ మధ్య కాలంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో గెలుపొందింది. తాజాగా ఈ ఏడాది నవంబర్ 14న వెలువడిన ఫలితాలలో బిహార్‌లో బిజెపి బిజయం సాధించింది. ఇది ఇండియా కూటమి పతనం, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏకు గొప్ప పురోగమనం. గత పద్దెనిమిది నెలల్లో జరిగిన శాసనసభ ఎన్నికలలో వరుస విజయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలతో పాటు, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్‌లకు అత్యధిక ఘనత ఇవ్వబడింది. ప్రధానమంత్రితో విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో భాగవత్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను మరింత వ్యవస్థీకృత పద్ధతిలో సమీకరించారు.

ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్నా యి. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను హడావుడిగా అమలు చేయాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు సవాలు చేయడంతో ఉభయ సభలు గందరగోళంలో ఉన్నాయి. తదుపరి విడతలో అస్సోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి నాలుగు రాష్ట్రాలకు 2026 ఏప్రిల్/మే నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రాలలో అస్సోంలో ఎస్ఐఆర్ అమలు చేపట్టడం లేదు. అస్సోంను సవరణ ప్రక్రియ నుండి మినహాయించగా, ఇతర రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకం గా పార్లమెంట్‌లో ఇండియా కూటమి బలమైన జోక్యం చేసుకోవడం పర్వాలేదు. కానీ, అది 2026 రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు రాష్ట్ర సంస్థాగత నిర్మాణాన్ని సిద్ధం చేసే ప్రయత్నాలను సడలించేలా చేయకూడదు.

2026 ఎన్నికల్లో 2016 నుంచి బిజెపి నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉన్న అస్సోంపై ఇండియా కూటమి తమ ప్రాధాన్యతగా కేంద్రీకరించాలి.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 2026 ఎన్నికలలో మరొక విజయాన్ని సాధించేందుకు దోష రహితగా సన్నద్ధమవుతోంది. అస్సోం శాసనసభలో 126 సీట్లు ఉండగా, 2021 శాసన సభ ఎన్నిక లు, 2024 లోక్‌సభ ఎన్నికల గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే కాంగ్రెస్, బిజెపి మధ్య ఓట్ల వ్యత్యాసం ఒక శాతం నుండి మూడు శాతం వరకు ఉందని స్పష్టమవుతోంది. వివిధ పొందికలను సమకూర్చుకోవడం ద్వారా స్వల్ప తేడాతో గెలుపు తారుమారయ్యే స్థానాల్లో బిజెపి విజయం సాధించడం కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఓటమికి దారితీసింది.

2021 శాసనసభ ఎన్నికల్లో అస్సోంలో బిజెపికి 33.6 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్ కు 30 శాతం ఓట్లు వచ్చాయి. కానీ, బిజెపికి 60 స్థానాలు, కాంగ్రెస్ కు 29 సీట్లు మాత్రమే లభించాయి. విడిగా పోటీ చేసిన ఎఐయుడిఎఫ్ 9.4 శాతం ఓట్లతో 16 స్థానాలు దక్కించుకుంది. కాబట్టి కాంగ్రెస్ ప్రధానంగా బెంగాలీ మాట్లాడే ముస్లింల పార్టీ అయిన ఎఐయుడిఎఫ్‌తో అవగాహన కలిగి ఉంటే, కాంగ్రెస్–ఎఐయుడిఎఫ్‌లు ఎన్‌డిఏను సులభంగా ఓడించి ఉండేవి. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 37.9 శాతం ఓట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు అంతే మొత్తంలో 37.9 శాతం ఓట్లు వచ్చాయి. కానీ, బిజెపికి 9 సీట్లు రాగా, కాంగ్రెస్‌కు 3 సీట్లు మాత్రమే దక్కాయి. ఓట్ల శాతం ఒక్కటే ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు బిజెపి సీట్లలో మూడింట ఒక వంతు వచ్చాయి.

అస్సోంలో ఇండియా కూటమిలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీ. ఆ పార్టీ చాలాకాలంగా అధికార పార్టీగా వ్యవహరించింది. చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ ప్రజాదరణ పొందిన సిఎం. అధికారాన్ని నిలుపుకోవడంలో ఉన్న చిక్కులు ఆయనకు తెలుసు. మోదీ పాలనలో కాంగ్రెస్ పతనం చోటు చేసుకుంది. కానీ, అస్సామీ హిందువులు, ముస్లింలలో కాంగ్రెస్ ఇప్పటికీ దాని సాంప్రదాయ పునాది కలిగి ఉంది. ఈసారి, ఇండియా కూటమి కింద బిజెపి వ్యతిరేక శక్తులను సమీకరించడానికి కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలు చేయాలి. అది సాధ్యం కాకపోతే, రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఫ్రంట్ ఎన్‌డిఏ ఓటమిని ఖాయం చేసేందుకు స్వల్ప తేడాతో గెలుపోటములు నిర్ధారణ జరిగే సీట్లలో ఎన్నికల అవగాహన కలిగి ఉండాలి. శాసనసభలోని 126సీట్లలో, స్వల్ప ఓట్లతో గెలుపు తారుమారయ్యే దాదాపు 30 స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలలో చాలా వరకు ఎఐయుడిఎఫ్ ఉనికిని కలిగి ఉంది.




2021 శాసనసభ ఎన్నికల సమయంలో అస్సోం రాష్ట్ర కాంగ్రెస్ కు కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం నుండి తగిన మద్దతు లభించలేదు. నిధుల కొరత కూడా ఉంది. బలమైన ప్రయత్నాలతో 2026 ఎన్నిక ల్లో అస్సోంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని గద్దె దించవచ్చు. కాబట్టి, అస్సోం శాసనసభ ఎన్నికలను కాంగ్రెస్ హైకమాండ్ తీవ్రంగా పరిగణించాలి. కానీ, దానికి కాంగ్రెస్ ద్వారా తీవ్రమైన ప్రచారం, కాంగ్రెస్ నేతృత్వంలోని ఆరు పార్టీల ప్రతిపక్ష ఫ్రంట్ పూర్తి సమీకరణ, బిజెపి వ్యతిరేక ఓట్ల విభజనను నిరోధించడంలో సహాయపడే ప్రభావవంతమైన ఎన్నికల వ్యూహాన్ని అమలు చేయడం అవసరం. 2026 శాసనసభ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలనే లక్ష్యం గురించి కాంగ్రెస్ కూటమి తీవ్రంగా ఆలోచిస్తే, విజయం సాధించాలంటే ఎఐయుడిఎఫ్‌తో వ్యూహాత్మక పరిమిత అవగాహన అత్యంత అవసరం.

ఈ ఏడాది డిసెంబర్ చివరిలో జరగనున్న ముంబై కార్పొరేషన్ ఎన్నికలపై ఇండియా కూటమి కొంత దృష్టి పెట్టాలి. గత శాసనసభ ఎన్నికల వినాశకరమైన ఫలితాల తర్వాత, ఇండియా కూటమి భాగస్వాముల మధ్య విభేదాలు పెరిగాయి. ప్రస్తుతం, కార్పొరేషన్ ఎన్నికల కోసం ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడంలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, కాంగ్రెస్ వేటికి అవే వేర్వేరుదారుల్లో ఉన్నాయి. ఈ ఎన్నికల ఫలితం మహారాష్ట్రలో రాబోయే రాజకీయాలకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. ఆ తదుపరి కొద్ది నెలల్లో జరిగే ఇతర ఎన్నికలపై ఫలితాలు ప్రభావం చూపుతాయి. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ఎన్నికల్లో గెలవగలిగితే, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇది రాష్ట్ర బిజెపికి మరో ఘనత అవుతుంది. మహారాష్ట్ర రాజకీయాలపై వారి ఆధిపత్యం పెరుగుతుంది, ఇండియా కూటమి భాగస్వాములను అణగదొక్కుతుంది.

అస్సోం, మహారాష్ట్ర రెండింటిలోనూ పరిస్థితి గురించి ఇండియా కూటమి నాయకులు కేంద్ర స్థాయిలో మాట్లాడి, ఆయా రాష్ట్రాల పరిస్థితిని ఎదుర్కోవడానికి కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలతో ముందుకు రావడానికి ఇది సరైన సమయం. ఇండియా కూటమికి అస్సోం,ముంబై కార్పొరేషన్ ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. దీనిని జాతీయ స్థాయిలో మాత్రమే సర్దుబాటు చేసుకోవాలి.

కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు విషయానికొస్తే, పరిస్థితి ఇప్పటికే నిర్ధారించబడింది. అక్కడ ఇండియా కూటమి జోక్యం చేసుకునే అవకాశం చాలా తక్కువ. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కే పరిమితం. బిజెపిది స్వల్ప పాత్ర మాత్రమే. రెండు కూటములలో ఎవరు గెలిచినా ఇండియా కూటమికి చెందినవారే అవుతారు. పశ్చిమ బెంగాల్‌లో, బిజెపికి వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. బిజెపిని ఎదుర్కోవడానికి మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి సిద్ధంగా ఉంది.

నిజానికి 2026 ఎన్నికల్లో బిజెపి తన ప్రస్తుత సీట్లను కోల్పోవచ్చు. తమిళనాడులో కూడా డిఎంకె ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాలు బాగా స్థిరపడ్డాయి. ఈ కూటమి సంపూర్ణంగా పనిచేస్తోంది. 2026 ఎన్నికలకు సిద్ధంగా ఉంది. ఈ మూడు రాష్ట్రాలలో ఇండియా కూటమి కేంద్రంగా పెద్దగా చేయాల్సిందేమీ లేదు. కానీ అస్సోం, ముంబై కార్పొరేషన్ విషయంలో చేయాల్సింది చాలా ఉంది.

(ఐపిఏ సర్వీస్)

# సైనికుల త్యాగాల పునాదులపై సుస్థిర భారతం!

1971లో జరిగిన ఇండోపాక్ యుద్ధంలో భారత త్రివిధ దళాలు గెలుపొందిన శుభ దినంగా 16 డిసెంబర్ రోజున దేశ వ్యాప్తంగా విజయ్ దివస్ వేడుకలను సగర్వంగా, ఘనంగా నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్నది. బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ విముక్తి పోరాటంగా 03 డిసెంబర్ 1971 న ప్రారంభమైన ఇండియాపాకిస్థాన్ యుద్ధం13 రోజుల పాటు కొనసాగిన పిదప 16 డిసెంబర్ 1971 రోజున పాకిస్థాన్ ఓటమిని అంగీకరించడంతో బంగ్లాదేశ్ ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడం, ఇండియా త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ లొంగి పోవడం, భారత్తో పాటు బంగ్లాదేశ్లో విజయోత్సవాలు నిర్వహించడం జరిగింది. నాటి నుండి ప్రతి ఏట మన త్రివిధ దళాల పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ నాటి యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు కృతజ్ఞతలు తెలియజేయడా సాంప్రదాయంగా వస్తున్నది.

**ఈస్ట్ పాకిస్థాన్, వెస్ట్ పాకిస్థాన్‌ల మధ్య తారస్థాయికి చేరిన విభేదాలు:**

1947లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత జరిగిన తీవ్ర పరిణామాల్లో దేశం భారత్, పాకిస్థాన్ అనబడే రెండు ముక్కలుగా విభజించబడడం, విభజన తీవ్ర రక్తపు మరకలతో జరగడం చూసాం. విభజన తర్వాత నూతనంగా ఏర్పడిన పాకిస్థాన్లో ఈస్ట్ పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్), వెస్ట్ పాకిస్థాన్ (నేటి పాకిస్థాన్) అన రెండు ప్రాంతాలు చేరడం జరిగింది. వెస్ట్ పాకిస్థాన్ అణచివేత చర్యలతో ఈస్ట్ పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ నలిగిపోవడం, రెండు ప్రాంతాల ప్రజల మధ్య తీవ్రమైన విభేదాలు పొడచూపడంతో రెండు ప్రాంతాల మధ్య తీవ్ర ఘర్షణలు కొనసాగడం జరిగింది. నాటి పాకిస్థానీ జనరల్ యేహ్యా ఖాన్ దుందుడుకు చర్యలు, బంగ్లాదేశీయులను అణిచివేత, మహిళల మానభంగాలు, అమానవీయ మారణహోమంతో రెండు పాకిస్థానీ ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం పొడచూపడంతో బంగ్లాదేశ్ స్వతంత్రం కోసం యుద్ధం అనివార్యం అయ్యింది. ఈ పోరాటంలో బంగ్లాదేశ్ ముక్తి బహిణి దళాల భాగస్వామ్యం కూడా ప్రధానమైనదిగా పేర్కొనబడింది.

**ఆపరేషన్ ట్రిడెంట్ దెబ్బకు తోక ముడిచిన పాకిస్థాన్:**

బంగ్లాదేశ్ ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వెస్ట్ పాకిస్థాన్ ప్రభుత్వం పని చేయడంతో బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్‌లో తమ స్వతంత్రం కోసం బంగ్లా విముక్తి పోరాటాలు ఎగిసిపడడం, దానికి నాటి ఇందిరాగాంధీ నేతృత్వపు భారత ప్రభుత్వం కూడా సహకరించడం గమనించాం. 03 డిసెంబర్ 1971 రోజున భారత్పై పాకిస్థానీ ఏయిర్ ఫోర్స్ దాడులు జరపడంతో ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభం అయింది. దీనికి బదులుగా భారత త్రివిధ దళాలు, ముఖ్యంగా భారత నావికా దళం 04 డిసెంబర్ 1971న నిర్వహించిన ఆపరేషన్ ట్రిడెంట్ జవాబుతో కరాచీ పోర్ట్ నామరూపాలు లేకుండా పోవడంతో పాకిస్థాన్ బిత్తరపోవడం, భారత్ తన ప్రతాపాన్ని పాక్కు రుచి చూపడం గత ఘన చరిత్రగా నిలిచిపోయింది. 14 డిసెంబర్ 1971 రోజున ఈస్ట్ పాకిస్థాన్ గవర్నర్ ఇంటిపై భారత ఏయిర్ ఫోర్స్ దాడులు చేయడంతో ఖంగుతిన్న పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి బంగ్లాదేశ్ ఏర్పడడానికి అంగీకరించడం, డిసెంబర్ 16న పాకిస్థానీ జనరల్ ఏ ఏ కె నాజియా నేతృత్వంలో 93,000 పాకిస్థానీ సైన్యం లొంగి పోవడంతో, పాకిస్థానీ కంబంధహస్తాల నుంచి బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ స్వేచ్ఛను పొందిన ఫలితంగా మరో కొత్త దేశంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించడం జరిగిపోయింది.




**ఇండో–పాక్ యుద్ధంలో ప్రాణ నష్టం:**

భారత జనరల్ సామ్ మనేక్షా నేతృత్వంలో సాధించిన విజయంలో పాటు 3,000 మంది వరకు భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం, 9,851 మంది వరకు గాయపడడం విచారకరం. పాకిస్థాన్ సైన్యంలో 8,000లకు పైగా మరణాలు, 25,000ల వరకు సైనికులు గాయపడ డం జరిగింది. తొమ్మిది నెలలుగా జరిగిన ఈస్ట్, వెస్ట్ పాకిస్థాన్ పోరాటంలో పాకిస్థానీ అనుకూల, వ్యతిరేక దళాల మధ్య జరిగిన పోరులో 3 లక్షల నుంచి 3 మిలియన్ల వరకు సాధారణ ప్రజలు/సైనికులు మరణించడం, అనేక మంది మహిళలు మానభంగం చేయబడడం లాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకోవడం వెస్ట్ పాకిస్థానీ ప్రభుత్వ పెద్దల ఫలితమే అని అర్థం చేసుకోవాలి. భారత త్రివిధ దళాలు అర్జించి పెట్టిన ఈ ఘన విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట 16 డిసెంబర్ రోజున విజయ్ దివస్ నిర్వహించుకోవడం, ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు చేయూతను అందించడం జరుగుతున్నది.

*(16 డిసెంబర్ విజయ్ దివస్ సందర్భంగా)*

**డా: బిఎం.రెడ్డి,** 9949700037

# ఇంజనీరింగ్ విద్యలో క్వాంటమ్ కంప్యూటింగ్ అవసరమా?

క్వాంటమ్ టెక్నాలజీల్లో ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పడుతుండగా, తదుపరి కంప్యూటింగ్ విప్లవంలో నాయకత్వం సాధించాలని ప్రభుత్వాలు పరుగులు పెడుతున్న నేపథ్యంలో, విద్యావేత్తల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి సాంప్రదాయ ఇంజినీరింగ్ బ్రాంచ్లను తగ్గిం చి, అన్ని ఇంజినీరింగ్ విద్యార్థులకూ క్వాంటమ్ కంప్యూటింగ్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలా? భవిష్యత్తు క్వాంటమ్ సిద్ధమైన గ్రాడ్యుయేట్లు కోరుకుంటున్నారని కొందరు వాదిస్తున్నారు. మరికొందరు ఇది అకాలికం, విధ్వంసకరం, పరిశ్రమలకు హానికరమని హెచ్చరిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అనగా క్వాంటమ్ మెకానిక్స్ సూత్రా లైన సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్మెంట్లను ఉపయోగించి, క్విట్స్ ద్వారా సమాచారాన్ని ప్రాసెస్ చేయడం. ఒకే సమయంలో 0, 1 లేదా రెండూ కాగలిగే క్విట్స్ వల్ల కొన్ని సమస్యలను సాధారణ కంప్యూటర్ల కంటే ఎక్స్‌పొనెన్షియల్ వేగంతో పరిష్కరించవచ్చు. మందుల ఆవిష్కరణ, క్రిప్టోగ్రఫీ, ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశిస్తున్నారు. ఐబి ఎం, గూగుల్, ఐఆన్‌క్యు, రిగెట్టి, సై క్వంటం, వంటి సంస్థలు క్విట్స్ సంఖ్య పెంచుతూ, ఎర్రర్ కరెక్షన్ మెరుగుపరుస్తున్నాయి. కానీ వాణిజ్యపరంగా విస్తృతంగా ఉపయోగపడే ఫాల్ట్ టాలరెంట్ క్వాంటం కంప్యూటర్లు ఇంకా సంవత్సరాల దూరంలో ఉన్నాయి.

డిసెంబరు 2025 నాటికి క్వాంటమ్ ఉద్యోగ మార్కెట్ చిన్నదైనా, వేగంగా వృద్ధి చెందుతోంది. 2025 మొదటి తొమ్మిది నెలల్లోనే $1.25 బిలియన్ పైగా వెంచర్ ఫండింగ్ వచ్చింది. గత ఐదేళ్లలో ఉద్యోగ ప్రకటనలు 180–500% పెరిగాయి. జీతాలు ఆకర్షణీయం గా ఉన్నాయి. అమెరికాలో ఎంట్రీలెవెల్ ఉద్యోగాలు $120,000 – $170,000 నుంచి మొదలవుతాయి; సీనియర్ ఉద్యోగులకు $250,000 దాటుతాయి. 2030 నాటికి 2.5 లక్షల ఉద్యోగా లు, 2035 నాటికి $1 ట్రిలియన్ ఆర్థిక ప్రభావం వస్తుందని అంచనా. అయినా, నైపుణ్యం ఉన్న వారు చాలా తక్కువ; ఉద్యోగ ఖాళీలు అర్హుల నిష్పత్తి 3:1గా ఉంది. ఈ నైపుణ్య కొరత కారణం గా క్వాంటమ్ విద్య విస్తృతంగా చేర్చాలనే డిమాండ్ పెరిగింది. ఎంఐటి, స్టాన్‌ఫోర్డ్, ఐఐటిలు ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అడ్వాన్స్‌డ్ ఎలక్టివ్ లేదా స్పెషలైజేషన్‌గా అందిస్తున్నాయి. చైనా, సింగపూర్, కెనడా, భారత్ (2023 నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా) సాంప్రదాయ బ్రాంచ్‌లను తొలగించకుండానే క్వాంటమ్ విద్యను పెంచుతున్నాయి. ప్రపంచంలో ఎక్కడా ప్రతిష్ఠిత సంస్థ సాంప్రదాయ బ్రాంచ్‌ల స్థానంలో క్వాంటమ్‌ను తప్పనిసరి చేయలేదు. క్వాంటమ్ ను తప్పనిసరి చేయాలనే వాదనలు: కనీస అవగాహన (క్విట్స్, సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్మెంట్, షార్/గ్రోవర్ అల్గారిథమ్స్) భవిష్యత్తుకు సిద్ధం చేస్తుందని, 12 క్రెడిట్ తేలికైన కోర్సు సరిపోతుందని అంటారు. ఎలక్టివ్ లేదా బలమైన సాంప్రదాయ బ్రాంచ్లతో పాటు ఉంటే ఇది ఉత్తమమే. కానీ సాంప్రదాయ బ్రాంచ్‌లను తగ్గించి అందరికీ తప్పనిసరి చేయడం తీవ్ర వ్యతిరేకతకు గురవుతోంది. ఈ రోజు 99% సాంకేతిక త (చిప్స్, విద్యుత్ గ్రిడ్లు, వాహనా లు, భవనాలు, విమానాలు) ఇంకా సాంప్రదాయ ఇంజినీరింగ్ సూత్రాలపైనే ఆధారపడి ఉంది. ఈ బ్రాంచ్‌లను తగ్గిస్తే నాలుగైదేళ్లలోనే పరిశ్రమలు తీవ్ర నైపుణ్య కొరతను ఎదుర్కొంటాయి.

క్వాంటమ్ కంప్యూటింగ్‌కు లీనియర్ ఆల్జీబ్రా, కాంప్లెక్స్ నంబర్స్, ప్రాబబిలిటీ, క్వాంటమ్ మెకానిక్స్ బలమైన పునాది అవసరం. ఈ విషయాల్లోనే చాలా మంది విద్యార్థులు కష్టపడుతుంటే, బలవంతంగా నేర్పిస్తే భారీగా ఫెయిల్యూర్, గుర్తుపెట్టుకోవడం, నిరాశాజనకంగా ఉంటుంది. టైర్2, 3 కాలేజీల్లో ఫ్యాకల్టీకే కిస్కిట్, సిర్క్ వంటి టూల్స్ అనుభవం ప్రాథమిక అవగాహన లేదు, వీరితో విద్యార్థుల కు పాఠాలు బోధించడం అంటే కష్టసాధ్యమే. ల్యాబ్ లు నడపడం దాదాపు అసాధ్యం. గతంలో క్లౌడ్ కంప్యూటింగ్ (2010–15), ఎఐఎంఎల్ (2018– 22) తప్పనిసరి చేసినప్పుడు చాలా కాలేజీల్లో అధ్యాపకులు లేక మూస ధోరణిలో బోధనా సామర్థ్యాలులేని వారు బోధించడం వలన జోక్ సబ్జెక్టులుగా మిగిలాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇంకా కష్టతరమైనది కాబట్టి ఫలితం మరీ దారుణంగా ఉంటుంది. మంచి కళాశాలల్లో, బలమైన సంస్థల్లో సాంప్రదాయ బ్రాంచ్‌లతో పాటు తేలికైన క్వాంటమ్ మాడ్యూల్ విజయవంతమవుతుంది. కానీ బలహీనమైన విద్యావ్యవస్థలో తప్పనిసరి చేయడం విద్యాపరమైన దుర్వినియోగ మే. దీనికి సరైన మార్గం, సాంప్రదాయ బ్రాంచ్‌లను బలోపేతం చేస్తూ, అందరికీ తేలికైన అవగాహన కోర్సు, ఆసక్తి ఉన్న టాప్ 10–20% విద్యార్థులకు డీప్ ఎలక్టివ్స్/మైనర్స్ ఇవ్వ డం. ఫ్యాకల్టీ శిక్షణ, పునాది విషయాల బలోపేతం, క్రమంగా అమలు ఇదే హైప్‌ను అధిగమించి నిజమైన సామర్థ్యం తయారుచేసే మార్గం.

క్వాంటమ్ కంప్యూటింగ్ నిస్సందేహంగా భవిష్యత్తు. కానీ ఇప్పుడున్న సుస్థిర పునాదులను పడగొట్టి, ఇంకా పరిపక్వం కాని రంగాన్ని అందరిపై రుద్దడం హేతుబద్ధం కాదు. 1995లో నానోబాట్ సర్జరీ కోసం మెడికల్ కోర్సులు రద్దు చేయడం లాగా తయారవుతుంది. కళాశాలలను బలోపేతం చేయకుండా, బోధనా సామర్థ్యాలు మెరుగుపరచకుండా కేవలం కాగితంపై దార్శనికం ఆచరణలో విపత్తు ధోరణితో ప్రభుత్వం ముందుకెళితే భవిష్యత్తు అగమ్యగోచరం.

**డా. ముచ్చుకోట. సురేష్ బాబు,**
9989988912

లేఖ

# జలమండలిలో బిల్లు వసూలుదార్ల దీనగాథ!

హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (HMWS&SB)లో గత పదిహేను సంవత్సరాలుగా తమ సేవలను అందిస్తున్న ఆరు వందల డెబ్బై మూడు (673) మంది బిల్లు వసూలుదార్లు, మీటరు రీడర్ల భవిష్యత్తు నేడు తీవ్ర సంక్షోభంలో పడింది. దశాబ్దన్నర పాటు జలమండలి కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించిన ఈ సిబ్బందికి నేటికీ సంస్థ నుండి సరైన ఉద్యోగ భద్రత లభించడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వు (జీవో 60) ప్రకారం వీరం తా నెలకు పదిహేను వేల ఆరు వందల రూపాయల(రూ.15,600) కనీస వేతనాన్ని పొందుతున్నారు. జలమండలిలో వివిధ విభాగాలలో మొత్తం ఐదు వేల మూడు వందల నలభై ఏడు (5,347) మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ, ఈ 673 మంది బిల్లు వసూలుదార్లను మాత్రం ఆర్థిక విభాగం మరియు పట్టణాభివృద్ధి శాఖ యొక్క అధికారిక పత్రాలలో చూపకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం వెనుక తమకు రావాల్సిన ప్రయోజనాలను, ఉద్యోగ భద్రతను దూరం చేయాలనే ఉద్దేశం దాగి ఉందని సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారిక నమోదుకు నిరాకరణ.. మంజూరైన స్థానాల సమస్య**

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను నమోదు చేసి, నిర్ధారించడానికి ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ అనే సరికొత్త ఆన్లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్ ద్వారా సిబ్బంది వివరాలను నమోదు చేసుకుంటే ఉద్యోగ భద్రత లభిస్తుందనే ఆశతో, ఈ బిల్లు వసూలుదార్లు తమను కూడా పోర్టల్లో నమోదు చేయాలని జలమండలి అధికారులను పదేపదే కోరారు.

అయితే, అధికారులు అందుకు నిరాకరిస్తూ, 'మీ పోస్టులకు అధికారికంగా మంజూరైన స్థానాలు (సాంక్షన్ పోస్టు లు) లేవు' అని మొక్కుబడి సమాధానం చెప్తున్నారు. 04/08/2023 నాటికి జలమండలి మొత్తం మూడు వేల తొమ్మిది వందల తొంభై ఒక్క (3,991) మంది ఉద్యోగులకు మంజూరై న స్థానాలను తెచ్చుకున్నప్పటికీ, ఈ ప్రక్రియలో బిల్లు వసూలుదార్ల పోస్టులను మాత్రం కావాలనే పట్టించుకోలేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

**ఆందోళన ఫలితం..కనీస వేతనం నుండి కమిషన్ పద్ధతికి మార్పు**

తమను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో నమోదు చేయాలని 06/11/2025 నుండి బిల్లు వసూలుదార్లు నిరంతరంగా పోరాటం చేస్తున్నారు. ఈ నిరసనలకు ప్రతిస్పందనగా, జలమండలి పాలకవర్గం అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వ ఉత్తర్వు (జిఒ 60) ప్రకారం అమలు చేస్తున్న కనీస వేతనం పద్ధతి నుండి వీరిని తొలగించి, కేవలం 'కమిషన్ ఆధారితం' లేదా సేవల ఆధారంగా రుసుము చెల్లించే పద్ధతి కిందకు తీసుకువస్తున్నారు. ఈ మేరకు 03/12/2025 రోజున జలమండలి టెండర్లు కూడా పిలవడం జరిగింది.పదిహేను సంవత్సరాల స్థిరమైన సేవ తర్వాత, హఠాత్తుగా కనీస వేతనాన్ని తొలగించి, వారిని కేవలం కమిషన్ పద్ధతికి మార్చడం వారి ఆర్థిక భద్రతను పూర్తిగా దెబ్బతీస్తుంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకు ని, దశాబ్దాల సేవను అందించిన ఈ బిల్లు వసూలుదార్లను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో నమోదు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్యాయమైన కమిషన్ పద్ధతికి మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి

**.వి.భూమయ్య,**9848559863

## నూతన బస్టాండ్‌లో వసతుల పరిశీలన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ ఛైర్మన్ మేనేజింగ్ అండ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం నూతన బస్‌స్టేషన్‌ను సందర్శించారు. బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవలపై సమగ్ర సమాచారం అడిగి తెలుసుకున్నారు. విమానాశ్రయం తరహాలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా బస్‌స్టేషన్‌లో ఉన్న టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారమ్‌లు, విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యాలు, క్యాంటీన్ పరిసరాలు, అందుబాటు ధరలలో వస్తువుల విక్రయం, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో శుభ్రత, భద్రత, బస్సుల టైమ్ మేనేజ్‌మెంట్ పై డిపో అధికారులతో చర్చించారు. రోడ్డు సౌకర్యాలు ఉన్నప్పటికీ బస్ సౌకర్యం లేని గ్రామాల వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

## డ్యూటీలో మార్పునకు అనుమతించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం:** ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సత్తుపల్లి డిపో మేనేజర్‌కు ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్మికులకు డ్యూటీలో మార్పుకు అనుమతించాలని,మహిళా కండక్టర్లకు విశ్రాంతి గదులు కేటాయించాలని, కండక్టర్ల చార్ట్ కౌన్సిలింగ్ డ్యూటీని నిర్వహించాలని తదితర 25 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఎంకు అందజేశారు. ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, రాంబాబు, యూనియన్ నాయకులు ఉపేందర్, అప్పారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ నేతలను కలిసిన పడమటి తండా సర్పంచ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం రూరల్ మండలం పడమటి తండా సర్పంచ్ బోడ భీమా నాయక్ సోమవారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో సిపిఐ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. విజయానికి సిపిఐ చేసిన కృషి మరువలేనిదని ఈ సందర్భంగా బోడ భీమా నాయక్ తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ లు మాట్లాడుతూ ప్రజల ఆశలకు అనుగుణంగా పడమటి తండా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, సంక్షేమ కార్యక్రమాల అమలులోనూ ముందు వరుసలో నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పడమటి తండాకు చెందిన పలువురు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని ఒకరు మృతి..ధర్నా



**ప్రజాపక్షం/పాల్వంచ :** కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. మృతుని బంధువులు మృత దేహంతో సోమవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలో ధర్నా, రాస్తారోకో చేశారు. వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటి పరిధి వెంగళరావు కాలనీకి చెందిన ధరావత్ హారీలాల్ (39) కూలీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. గత 20 సంవత్సరాల క్రితం శ్రుతిలయతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. మృతుడి భార్య శ్రుతిలయ ములుగు జిల్లా వెంకటాపురం ప్రాంతంలో అటవీశాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఆదివారం రాత్రి భార్యా భర్తల నడుమ వివాదం నెలకొన్నది. గొడవ జరిగింది. దీనితో తీవ్ర మనస్థాపానికి గురైన హారీలాల్ తన ఇంటి ముందు ఉన్న స్లాబ్ హుక్కుకు చీరతో ఉరి వేసుకొన్నాడు. మృతుడి భార్య కేకలు వేసింది. ఇంటి పక్కన ఉన్న భూక్యా రామక్రిష్ణ, మాలోత్ విజయలు వచ్చి కిందికి దింపారు. అప్పటికే మృతి చెందాడని తెలుసుకొన్నారు. శ్రుతిలయ మరొకరితో అక్రమ సంభందం పెట్టుకొన్నదని వివాదాలు, గొడవల జరిగేవి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించామని,నా కొడుకును చంపినదని మృతుడి తల్లి మంగమ్మ ఆరోపించింది. బంధువులతో కలిసి మృత దేహంతో బస్టాండ్ సమీపంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పోలీసులు బాదితులకు నచ్చజెప్పారు. ఆందోళన విరమించారు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## మూడో విడత ఎన్నికకు బందోబస్తు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** బుధవారం మూడోవిడత ఎన్నికల్లో పెనుబల్లి మండలంలో 30 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. పెనుబల్లి మండలంలోని కొన్ని గ్రామాలను వియం బంజర పోలీస్ సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండలంలో ఇద్దరు ఏసీపీలు, సిఐలు, ఎస్సైలు సిబ్బంది మొత్తం 300 మందిని ఉపయోగిస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు. లంకపల్లి, రామచంద్రపురం, రామచంద్ర బంజర,చింతగూడెం గ్రామాలలో సంఘ వ్యతిరేక శక్తులు గ్రామాలలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా రాజకీయ పార్టీలు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** బుధవారం జరగనున్న మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సంబంధించి మండలంలోని కొందరు ఉద్యోగులకు ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఇతర ప్రాంతాల్లో నియమించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం పెనుబల్లి మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో పోలింగ్ కేంద్రంలో ఓటును వినియోగించుకున్నారు. పోస్టల్ ఓటు వేసేందుకు 150 మంది దరఖాస్తు చేసుకోగా 150 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## రైతు సమస్యలు పట్టవా?




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్టేజిపినపాక గ్రామ రైతులు, యువత రైతుల సమస్యలను పరిష్కరించాలని, కొనుగోలు విషయంలో బిల్లులు ఆలస్యం చేయవద్దని సోమవారం వైరా మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావున కలిసి వినతిపత్రం అజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో 8 లారీలకు సంబంధించినబిల్లులురిలీజ్ చేయకపోవడంతో స్టేజిపినపాక యూత్, గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి కృష్ణారావు సూచనతో ఉప సర్పంచ్ గుడిపూడి రణధీర్ ఆధ్వర్యంలో ఏవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ సమస్యను కలెక్టర్‌కి తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరించలని వారు తెలిపారు. మార్కెట్ గంగారావు మాట్లాడుతూ రైతుల సమస్యలను నిత్యం పరిష్కరిస్తామని తెలిపారు. పినపాక గ్రామ రైతులు, పినపాక యూత్ సభ్యులు ఉప సర్పంచ్ గుడిపూడి రణధీర్, తుమ్మలపల్లి లక్ష్మ ణ్, చల్లగుండ్ల హరిబాబు, చెరుకూరి సతీష్, బోడేపూడి వినయ్‌కుమార్, సంతగని పూర్ణచంద్ర, నల్ల సాయి, నిఖిల్, తన్నీరు సాగర్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐకి పూర్వ వైభవం

* నాలుగు స్థానాల్లో పోటీ.. అన్నింటిలోనూ విజయబావుటా
* గెలుపొందిన సర్పంచులకు అభినందన



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** గ్రామపంచాయితీ ఎన్నికల ఫలితాలతో సిపిఐకి పూర్వవైభవం వచ్చిందని సిపిఐ రాష్ట్రసమితి సమితి సభ్యులు రావుల పల్లిరవికుమార్ అన్నారు.సోమవారం మండల సిపిఐ కార్యాలయంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్, ఉపచర్పంచ్‌లు, కౌన్సిల సభ్యుల సమావేశం మండల కార్యదర్శి బొల్లోజు వేణు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల్లో మండలంలో నాలుగు పంచాయితీ స్థానాలలో పోటీ చేసి నాలుగు స్థానాలు విజయం సాదించామన్నారు. ఈ విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.నూతనంగా గెలుపొందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై నూతనంగా ఎన్నుకున్న సర్పంచులకు మరింత భాద్యత పెరిగిందన్నారు.గ్రామంలో ఉన్న సమస్యలపై ప్రజలతో సమీ క్ష సమావేశం నిర్వహించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. ప్రతినిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.గ్రామంలో ఉన్నతాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలపై సమస్య ఉంటే తక్షణమే సంబందిత అధికారులకుసమాచారంఅందించాలని కోరారు. రానున్న యంపిటిసి,జడ్‌పిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.నిత్యం ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన ఘనత సిపిఐకి ఉందన్నారు.రాజకీయంగా ఎన్నో మార్పులు వస్తున్నప్పటికి కమ్యునిస్టుల ఓటు బ్యాంక్ చెక్కు చెదరకుండా పదిలంగానే ఉందన్నారు. రావులపల్లి రవికుమారుని సత్కరించారు. మండల సహాయ కార్యదర్శిలు కాక వెంకటేశ్వర్లు, తాటిపూడి రమేష్, నాయకులు నో ముల రాంరెడ్డి,సర్పంచ్‌లు కుంజా ప్రమీల, అజ్మీ ర శైలజ, కుంజా కనక రత్నం, పాయ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌లు కాటిబొయిన లక్ష్మ య్య, బొమ్మడి, అనిత దేవి,కొర్సా, తస్యం, తాటి నాగేశ్వరరావు, గొంది నాగేశ్వరరావు, చెంచల కృష్ణ, గోరంసత్యం కుంజా సత్తి బాబు, కొర్సా అర్జయ్య, కుంజా గణేష్, వర్సా రామకృష్ణ, కొండ్రు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నైపుణ్యాలతో విజయాలు సొంతం

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యతను పెంచుకుంటే జీవితంలో విజయాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పోలేపల్లిలోని భద్రాద్రికాలనీలో పీఎం శ్రీ కేంద్రియవిద్యాలయంలోఇన్నోవేషన్‌స్కిల్‌సెంటర్‌ను ప్రారంభించారు. తొలుత కేంద్రీ విద్యాలయ సంఘటన ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా అత్యున్నత విద్యను ప్రభుత్వ రంగంలో అందించే సంస్థలుగా కేంద్రీయ విద్యాలయాలకు మంచి పేరు ఉందన్నారు. దీనికి ఉదాహరణగా కలెక్టర్‌గా నాకు అనేక దరఖాస్తులు వస్తాయంటేనే ఎంతో మంచి డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో చదివేందుకు అవకాశం వచ్చిన ప్రతి విద్యార్థి అదృష్టవంతుడన్నారు. కేంద్రీయ విద్యాలయంలో చదివే విద్యార్థులు క్రీడలలో, అకడమిక్స్‌లో సమాంతరంగా రాణిస్తున్నారని,సంతోషంగా ఉందన్నారు. సచిన్ టెం డూల్కర్, విరాట్‌కోహ్లీ వంటి క్రీడాకారులు సైతం ఒకేరోజు గొప్పవారు కాలేదన్నారు. విజయాలు జీవన ప్రయాణంలో ఒక భాగంగా మాత్రమే పరిగణించాలని తెలిపారు. అనంతరం పీఎం శ్రీ కేంద్రీయ పాఠశాల చైర్మన్ హోదాలో కలెక్టర్ మొక్కలు నాటారు. సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమోంటోలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురంమున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, డివైఎస్ఓ సునీల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్, టీచర్లు నసీరుద్దీన్‌బాబా, సిహెచ్ నరేంద్రకుమార్, అనిల్‌భట్, తన్మాయి ఉర్మిళ, విభాష, మమత, త్రినేత్ర తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రసన్నం కోసం ముమ్మర ప్రచారం

**గెలుపే లక్ష్యంగా ఆళ్లపల్లి గ్రామ పంచాయతీలో ప్రచారం**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి, ఆళ్లపల్లికి చెందిన ఎస్‌కే సాబీర్ పాషా ఆధ్వర్యంలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత గెలుపే లక్ష్యంగా ఆళ్లపల్లి గ్రామ పంచాయితీలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెస్సు మమతను గెలిపిస్తే పంచాయితీ అభివృద్ధి ఏ విధంగా చేస్తామో, పలు వరాల జల్లు కురిపించారు. తిరుగులేని పాషా నాయకత్వానికి పంచాయితీ ప్రజలు నీరాజనాలు పలికారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని ఆళ్లపల్లి పంచాయితీ యువత, అదే విధంగా ప్రచారంలో యువతని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు,ఆళ్లపల్లి మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య,నాయకులు,కార్యకర్తలు, పాషన్నఅభిమానులు,తదితరులున్నారు.

# అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలంతా ఆలోచించి అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పట్టం కట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. సోమవారం సత్తుపల్లి మండలంలోని తాళ్ళమడ, బేతుపల్లి, గంగారం, పాకలగూడెం, కిష్టాపురం, తుమ్మూరు, కొత్తూరు, గౌరిగూడెం, సిద్ధారం, సదాశివునిపాలెం తదితర పంచాయతీలలో స్థానిక సంస్థల ఎన్నికలలో బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపును కోరుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాగమయికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 17న జరగనున్న ఎన్నికలలో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత 15 ఏండ్లుగా అభివృద్ధి కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసిన పంచాయితీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం చిరునవ్వులు చిందిస్తున్నాయన్నారు. మండల అధ్యక్షుడు శివ వేణు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చలగుళ్ళ నరసింహారావు,గంగారం అభివృద్ధి ప్రదాత, సీనియర్ నాయకులు దాసరి మధుమోహన్‌రెడ్డి ఉన్నారు.

# పై ‘చేయే’ అయినా గట్టి పోటీ

**పాలేరులో పుంజుకున్న బిఆర్ఎస్**

**మంచి ఫలితాన్ని సాధించిన ఫ్రంట్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పాలేరు నియోజక వర్గంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పై చేయి సాధించినప్పటికీ అత్యుత్తమ ఫలితాలను నమోదు చేయలేకపోయింది. ఈ నియోజక వర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్, సిపిఎం ఫ్రంట్ కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చింది. అంతిమంగా కాంగ్రెస్సే ఎక్కువ స్థానా ల్లో విజయం సాధించినప్పటికీ రెండు మండల కేంద్రాల్లో ఓటమి చవి చూడక తప్పలేదు. మేజర్ పంచాయతీ అయినా నేలకొండపల్లి గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ గెలుపొందగా ముదిగొండ మండల కేంద్ర పంచాయతీని సిపిఎం భారీ మెజార్టీతో గెలుచుకుంది. మొత్తంగా నియోజక వర్గంలో 134 గ్రామ పంచాయతీలు ఉండగా కాంగ్రెస్ 78 స్థానాల్లోనూ, బిఆర్ఎస్ 34, సిపిఎం ఎనిమిది, సిపిఐ నాలుగు, ఇతరులు 10 స్థానాల్లో విజయం సాధించారు. అనేక మేజర్ పంచాయతీలలో విపక్ష కూటమి పాగా వేసింది. ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సొంత గ్రామం చేగొమ్మలోనూ ఫలితం బిఆర్ఎస్‌కే సానుకూలంగా మారింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో లాటరీ తీయగా పంచాయతీ బిఆర్ఎస్ వశమైంది. పంచాయతీ ఎన్నికల సమయం నుండి మాజీ శాసన సభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి గ్రామాల వెంట తిరుగుతూ అభ్యర్థులకు దన్నుగా నిలవగా కాంగ్రెస్ పార్టీ నుండి నాయకత్వం పని చేసినప్పటికీ అంత మెరుగైన ఫలితాలను పొందలేకపోయింది. రెండవ విడతలో జరిగిన పాలేరు నియోజక వర్గ ఫలితాలు మరోసారి ఆలోచింపజేసేవిధంగా ఉన్నాయి. కాంగ్రెస్ మిత్రపక్షాలకు ఆశించినంత సంపూర్ణ సహకారం అందించ లేదని కొన్ని పంచాయతీలలో విపక్ష బిఆర్ఎస్ సిపిఎం కూటమిలకు సహకరించిందన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. మొత్తంగా పాలేరు నియోజక వర్గంలో అధికార పార్టీని ఆలోచింపజేసే రీతిలో ఎన్నికల ఫలితాలు ఉండటం గమనార్హం.

# సురక్షిత పని వాతావరణం కల్పించాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భ గనిని సోమవారం రక్షణ తనిఖీ బృందం సందర్శించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఏరియా జిఎం దుర్గం రామచందర్, విశిష్ట అతిధి రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ బి. సైదులు, జిఎం(ఎన్విరాన్మెంట్), కార్పొరేట్ పాల్గొన్నారు. సింగరేణి 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భ గని ప్రాంగణంలో ప్రాజెక్టు అధికారి వేణు మాధవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రక్షణ తనిఖీ బృందం సందర్శన, కన్వీనర్ బి. సైదులు, జిఎం(ఎన్విరాన్మెంట్), కార్పొరేట్ నేతృత్వంలోని రక్షణ తనిఖీ బృందం కొండాపురం సందర్శించి పని ప్రదేశాలు, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా కార్మికులకు రక్షణపై అనేక ప్రశ్నలు అడిగి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు.

**ఆకట్టుకున్న “రక్షణ నీ బాధ్యత” నాటకం...**

సింగరేణి కళాకారులు ప్రదర్శించిన “రక్షణ నీ బాధ్యత” లకు నాటిక అతిథులను ఆహ్వానితులను కార్మికులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రత్యేకించి ముఖ్య అతిథి ప్రశంసలు అందుకుంది. అనంతరం రెస్క్యూ టీం ఆధ్వర్యంలో ఎవరికైనా ఆకస్మికంగా గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాపాయం నుండి తప్పించేందుకు నిర్వహించే ప్రథమ చికిత్సలో భాగంగా సిపిఆర్ ప్రదర్శన అందరిలో అవగాహన పెంచే విధంగా సభ్యులు డెమో నిర్వహించారు. తనిఖీ బృందంలో సభ్యులు ప్రముఖ సింగరేణి వైద్యులు డాక్టర్ టి. సురేశ్ అడిగిన పలు ప్రశ్నలకు వారు సరైన సమాధానం ఇచ్చి తనిఖీ బృందం అభినందనలు అందుకున్నారు. కొండాపురం భూగర్భగనిలో ప్రమాదాల నివారణకు, ఎస్‌ఓపి, సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలులో చేపడుతున్న చర్యలపై తనిఖీ బృందం నిశితంగా పరిశీలించారు.రక్షణ పక్షోత్సవాల సందర్భంగా కొండాపురం గని ప్రాంగణం ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో భాగంగా చివరిగా కొండాపురం గని ఉద్యోగులు రక్షణ తనిఖీ బృందం కన్వీనర్‌ని, సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే పలు పోటీలలో పాల్గొన్న విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాకారులకు, పనిలో అత్యంత నైపుణ్యత ప్రదర్శించిన ఉద్యోగులకు కూడా అతిథుల చేత బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ డి. వెంకటరామారావు, డిజిఎం(పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి ఎస్. రమేష్, ఇంచార్జ్ ఏరియా ఇంజినీర్ వీరభద్రుడు, డిజిఎం(సివిల్) శివ ప్రసాద్, మేనేజర్ కొండాపురం పి. నరసింహ రావు, ఏఐటియూసి నాయకులు మేకల ఈశ్వర్, ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు వి. మధన్ నాయక్, రక్షణ తనిఖీ బృందం సభ్యులు ఈ. పి. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, క్రే. వెంకట శ్రీను, బి. మహేందర్, ఎం. సునిల్ కుమార్, టి. సురేశ్, కే.వెంకట స్వామి, పి. సందీప్, కే. నాగ మోహన్, అధికారులు సేఫ్టీ అధికారి మధు బాబు, సంక్షేమ అధికారిని సాయి మౌనిక, కేపియూజి మైన్ పిఏ శ్రీ రామ్ చందర్, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ఒక్కటై కదిలారు

**కొత్తూరు పంచాయతీ సిపిఐదే..**

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్రా నరేంద్ర కుమార్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామ పంచాయతీ సిపిఐ అభ్యర్థి అక్కుల రాములు విజయాన్ని కోరుతూ సోమవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్రా నరేంద్ర కుమార్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులుగా ఉండటం వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని కొత్తూరు పంచాయతీలో సింగిల్ గా సిపిఐ బరిలో ఉందని, సిపిఐ అభ్యర్థి అక్కుల రాములను ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కొత్తూరు గ్రామపంచాయతీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి అక్కుల రాములు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు షేక్ నాగుల్ మీరా, పాపకొల్లు పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ గార్లపాటి వీరభద్రం, రమణయ్య, శీను, కృష్ణవేణి, శివ, హుస్సేన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచ్ అభ్యర్థుల గెలుపునకై సిపిఐ ప్రచారం**



**ప్రజాపక్షం/ఇల్లందు:** విజయలక్ష్మి నగర్, తిలక్‌నగర్ గ్రామ పంచాయితీ అభ్యర్థులు పూనెం కవిత, ధనసరి స్రవంతి గెలుపుకై కాంగ్రెస్, సిపిఐ శ్రేణులు విజయలక్ష్మి నగర్, తిలక్‌నగర్ గ్రామ పంచాయితీలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య మాట్లాడుతూ సిపిఐ, కాంగ్రెస్ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థులు పూణెం కవిత, ధనసరి స్రవంతిని అభ్యర్థులు పూణెం కవిత, ధరసరి స్రవంతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ గ్రామ పంచాయితీలో కొంత భాగం ఓసి నిర్వాసిత ప్రాంతంగా ఉందని సింగరేణి యాజమాన్యం ద్వారా నిర్వాసిత ప్రజలకు రావాల్సిన ప్యాకేజీని ఇప్పించడానికి అధికార పార్టీకి, సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటియూసికి మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. మాయ మాటలు చెప్పే పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి పూణేం నరేందర్, ఎట్టి హరికృష్ణ, ధరసరి రాజు, శ్రీకాంత్, తుడుం దెబ్బ నాయకులు రమణాల లక్ష్మ య్య, వట్టం కన్నయ్య, హరీష్, లక్ష్మీ నాథ్, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి.. నీ భూములు పదిలమేనా?

**దేవాలయ భూములు ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్?**

**రెవెన్యూ అధికారుల చేతివాటంపై అనుమానాలు**

**ప్రజాపక్షం/ వైరా:** వైరా మండలంలో ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్న అనుమానాలు, ఆరోపణల నేపథ్యంలోపులిగుట్ట లక్ష్మి నర్సింహాస్వామి భూములు పదిలమేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే మండలంలో ఒక ప్రభుత్వ డొంకను ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్న నేపథ్యంలో దేవుని భూములపైనా అనుమానాలు వస్తున్నాయి. వైరా మండలంలోని గొల్లపూడి రెవెన్యూ పరిధిలో పులిగుట్ట లక్ష్మి నర్సింహా స్వామికి సుమారు 182ఎకరాల భూమి ఉంది. ఇం దులో మెట్ట, మగాణి ఉన్నాయి. ఇది అతి పురాతన దేవాలయంగా చెబుతుంటారు.వైరా మండలంలోని గన్నవరం, గొల్లపూడి, పాలడుగు, బోనకల్ మండలంలోని రాపల్లి గ్రామాల నడుమ ఈ దేవాలయం ఉంటుంది. దేవాలయానికి సమీపంలో ఏ గ్రామం ఉండదు. నాలుగు గ్రామాల కూడలిలో ఉండే ఈ దేవాలయానికి ఆనాటి సంస్థానాధిశులు ఈ భూమిని కేటాయించి నిత్య నైవేద్యాలు జరిగేవిధంగా ఏర్పాట్లు చేశారు. భూమి కౌలు విషయంలోనూ కొంత వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ డొంక రియల్ వ్యాపారి సహకారంతో రిజిస్ట్రేషన్‌చేయించుకున్నవిషయంవెలుగుచూడడంతోఇప్పుడు ఈ భూములు కూడా ఒకరిద్దరు ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయించి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వైరా సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని ఓ డాక్యుమెంట్ రైటర్ వద్ద నుంచి పెద్ద మొత్తంలో వైరా తహసీల్దార్‌కు డబ్బులు బదిలీ కావడం వెనక లావాదేవీలు ఉన్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. డొంక రిజిస్ట్రేషన్ వెలుగు చూసిన తర్వాత శ్రీనివాసరావు సెలవుపై వెళ్లడంఅనుమానాలకు ఊతమిస్తుంది.ఒక రియల్‌ఎస్టేట్‌వ్యాపారిచెప్పినదానికి తలఊపుతూ వైరా రెవెన్యూ శాఖ చెప్పిన పని చేస్తున్నదని ఒక ఫ్యాన్సీ దుకాణ నిర్వహకుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. కలెక్టర్ లేదా ఉన్నతాధికారులు సమ గ్ర విచారణ జరపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కమ్మగాని పుష్పలీల నాగయ్య గెలుపుకోరుతూ ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డిలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే కత్తెర గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య, అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కమ్మగాని పుష్పలీల నాగయ్య గెలుపుకోరుతూ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డిలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే కత్తెర గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య, అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.



## 17న మూడవ విడత పోలింగ్

### సమన్వయంతో నిర్వహించండి : కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ:** మొదటి, రెండవ విడుత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లే మూడవ విడుత ఎన్నికలను వివిధ శాకల అధికారులు సమన్వయంగా పనిచేసి పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీన మూడవ విడుత ఎన్నికలు జరిగే దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, కొడకండ్ల మండలాలలో ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఇతర అధికారులతో సోమవారం కలెక్టర్ రిజ్వాన్ గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్, కౌంటింగ్ మొదలగు అంశాల మీద దిశా నిర్దేశం చేశారు. పోలింగ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండాలన్నారు.పోలింగ్, కౌంటింగ్ సంబంధించిన రిపోర్ట్‌లన్నీ నిర్దేశిత సమయంలో ఫార్మట్‌లకు తగ్గట్టుగా పోల్‌లో సబ్‌మిట్ చేయాలన్నారు. అధికారులు సమన్వయంగా పనిచేసి మూడవ విడుత ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

## ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు :ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నియోజవర్గ పరిధిలోని 47వ డివిజన్ బోడగుట్ట,31వ డివిజన్ శాయంపేట ఎస్సీ కాలనీ,8 వ డివిజన్ గుడి బండల్ లలో సుమారు రూ.1.70 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం,సైడ్ డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయా డివిజన్ లలో పర్యటించిన ఎమ్మెల్యే నేరుగా ప్రజలతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ప్రతి కాలనీలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.ఇప్పటికే నియోజవర్గంలోని అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని,శంకుస్థాపన చేసిన అనతి కాలంలోనే పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాయంపేట దళిత కాలనీలో చాలా వరకు నూతన రోడ్లు వేశామని మిగిలిన అన్ని రోడ్లు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ,కార్యకర్తలు,ప్రజలు,అధికారులు ఉన్నారు.

## హుటాహుటిన మల్లూరు ప్రాజెక్టు తూము మరమ్మతు పనులు



**ప్రజాపక్షం/మంగపేట :**మండలంలో నర్సింహసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో మల్లూరు వాగు ప్రాజెక్టు కూడి ఎడమ తూముల లాకులు లీకేజీతో నీళ్లు వృధాగా పోవటం. తూముల వద్దా చెత్త చెదారం మొట్లు రాళ్లు చేరి లాకులు పనిచేయడం లేదు. వేసంగి వరి పంటకు నీళ్ల ఇబ్బంది కాకూడదని ప్రాజెక్టు ఆయకట్టు కింద వరి పంట సాగు చేసే రైతులు పలుమార్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క కు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆయకట్టు రైతులు వినతి పత్ర రూపంలో తెలుపగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, హుటాహుటిన మల్లూరు వాగు ప్రాజెక్టు పనులను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించి, తూముల వద్దా లాకుల మరమ్మత్తులు చేశారు. దీనిని సందర్శంచాడానికి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరో పక్కా బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు. ప్రాజెక్టు తూముల లాకుల సమస్యను తెలిపిన వెంటనే మంత్రి సీతక్క కలెక్టర్ దివాకర టిఎస్ ఇరిగేషన్ అధికారులకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు కు మండల కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు మల్లూరు వాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## అనంతసాగర్ సర్పంచ్‌గా రామంచ వెన్నెల దయాసాగర్



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల్లో అనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం అనంతసాగర్ గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచినరామంచవెన్నెల దయాసాగర్ గ్రామ సర్పంచిగా విజయం సా ధించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల అభివృద్ధి పారదర్శక పాలనతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకంగా వ్యవహరిస్తారని ఈ విజయం తన వ్యక్తిగత గెలుపు కాదని అనంతసాగర్ ప్రజల విశ్వాసానికి ప్రత్యేకతమాత్రమేనని గ్రామ ప్రజల విశ్వాసానికి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతారని తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

### కాలి బూడిదైన రూ.75,000 నగదు, బంగారు ఆభరణాలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన సంఘటన భూపాలపల్లి మండలం గొల్ల బుద్ధారం గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకురాలు లోకలవేణి నవనీత కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. ఇంటిలో బీరువాలో ఉన్న రూపాయలు 75 వేల తో పాటు విలువైన బంగారు ఆభరణాలు కాలి బూడిద అయ్యాయి. ఇంటిలో నూతనంగా నిర్మించే ఇంటికి సంబంధించిన దర్వాజాలు కిటికీలు, డెకోళం మంచాలు పూర్తిగా దగ్ధం కావడం జరిగింది. వస్తువులు బియ్యం బట్టలు, రూ.75000 పూర్తిగా కాలి బూడిద అయినట్లు ఆమె తెలిపారు. బీరువాలో ఇంటిలో ఉన్న వస్తువులు బియ్యం బట్టలు, డబ్బులు రూ.75000 పూర్తిగా కాలి బూడిద అయి పోయయాని బాధితురాలు బోరునవిలపిస్తుంది. గత ఏడు సంవత్సరాల క్రితం బాధితు రాలు భర్త రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ప్రతి రోజు కూలి పని చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించుకున్నటువంటి బీద నిరుపేద మహిళ కు నష్టం జరగడంతో ప్రభుత్వం తరపున తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటుంది.

# పారదర్శకంగా జాతీయ స్థాయి పరీక్షలు

### మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వాహణ

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పారదర్శకంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి సమన్వయ కమిటీ చైర్మన్,జిల్లా కలెక్టర్, స్నేహా శబరీష్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జె.ఈ.ఈ, (మెయిన్స్) 2026లో ఎన్.టి.ఏ నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీ నిర్వహించనున్న జాతీయ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్షల సంస్కరణపై ఉన్నత స్థాయి కమిటీ సమర్పించిన నివేదికకు అనుగుణంగా, ఎన్.టి.ఏ ద్వారా పరీక్షలను పారదర్శకంగా, సజావుగా, నిష్పక్షపాతంగా, సురక్షితంగా నిర్వహించడానికి రాష్ట్ర, జిల్లా అధికారులతో సంస్థాగత అనుసంధానాన్ని ఏర్పాటు చేయాలని నిర్దేశించినందున, జనవరి 2026లో మొదటి సెషన్ జనవరి 21 నుండి 30 వరకు, రెండవ సెషన్ ఏప్రిల్ 2 నుండి 9 వరకు నిర్వహించే జెఈఈ (మెయిన్) 2026 పరీక్షల కోసం హనుమకొండ (జిల్లా)లోని 4 పరీక్షా కేంద్రాల ఆడిట్ నిర్వహణకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నివేదికను సమర్పించలన్నారు. కమిటీ సభ్యులు పోలీసు శాఖ డి.సి.పి రవి, ఎసిపి నర్సింహారావు, ఎన్.టి.ఏచే నామినేట్ చేయబడిన జిల్లా నోడల్ అధికారి జవహర్ నవోదయ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కె. శ్రీమతి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజ్ గౌడ్, ఈడిఎమ్ శ్రీదర్, కలెక్టరేట్ పాలన అధికారి గౌరీ శంకర్లు సమన్వయంతో జిల్లాకు సంబంధించి ఎన్.టి.ఏ అందించిన జాబితా ప్రకారం పరీక్షా కేంద్రాలను సందర్శించి సమగ్ర, భౌతిక అడిట్ నిర్వహించాలన్నారు. ఆడిట్ పూర్తయిన అనంతరం ఫీడ్బ్యాక్ ఫారమ్ సమర్పించాలన్నారు. జిల్లాకు సంబంధించి ఆన్ లైన్లో వరంగల్ జిల్లా కేంద్రంగా పరీక్షా కేంద్రాలు హనుమకొండ జిల్లాలో ఉండటం వంటి పలు సాంకేతిక అంశాలను పరిగణలోకితీసుకొని వాటిని నివృత్తి చేయాలన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్)కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 63, ఇంజనీరింగ్ 41, రెవెన్యూ 04, హెల్త్ శానిటేషన్ 03, సీటి సరఫరా 05, హార్టికల్చర్ 01, మొత్తం 117 వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిఎఫ్ఓ శంకర్‌లింగం, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్నరాణి, బిర్రు శ్రీనివాస్, టిఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మూడవ విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు విధులు కేటాయించిన సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాటారం, మల్హర్, మహదేవపూర్, మహా ముత్తారం మండలాల్లో 3వ విడత జరుగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 17న ఎన్నికల విధులు నిర్వహించే పిఓ, ఓపిలకు సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ర్యాన్డమైజేషన్ నిర్వహించినట్లు తెలిపారు.. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో మినహాయింపు కల్పించామని తెలిపారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించినట్లు ఆయన స్పష్టంచేశార. 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ చేసినట్లు ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,జిల్లా పంచాయతీ అధికారిశ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పని చేస్తా : కడియం




**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** తనపై, తన కుటుంబంపై విమర్శలు చేస్తూ తీవ్ర పదజాలంతో దూషించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల ఉన్న నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు ఓటేసి మెజారిటీ సర్పంచ్‌లను గెలిపించారాని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న అభివృద్ధి పట్ల నియోజకవర్గ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని దానికి తోడు తమ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ కృషి చేశారని, నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏడు మండలాలలో రెండు విడుతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగినాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 143 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. 143 గ్రామపంచాయతీలలో ప్రజలు ఆశీర్వదించి అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు తెలిపారని తెలిపారు. అందులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 94 మంది సర్పంచ్‌లు ఎన్నికయ్యారని, ఇంకో ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్ రెబెల్స్ గా ఉన్నారని తెలిపారు. బిజెపి 1, ఇండిపెండెన్స్ 3, బిఆర్ఎస్ 39 స్థానాల్లో గెలిపోందారని తెలిపారు. 94 గ్రామపంచాయతీలు ఆరుగురు రెబల్స్ కూడా వచ్చే అవకాశం ఉందని మొత్తం 100 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన లేదా కాంగ్రెస్ పార్టీ రెబెల్స్ గెలవడం జరిగిందని అన్నారు.పెద్ద పెద్ద గ్రామాలు అన్ని కాంగ్రెస్ పార్టీకే వచ్చాయని ధర్మసాగర్, పెద్ద పెండ్యాల, వేలేరు, మల్కాపూర్, పల్లగుట్ట, తాటికొండ వంటి గ్రామాలన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వచ్చాయని కొన్ని చిన్న చిన్న గ్రామపంచాయతీలు 500 ఓట్లకు తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ గెలిచిందని అన్నారు. మొత్తంగా భారీ మెజారిటీ కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరఫున హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ గెలుపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, బాధ్యత పెరిగింది కాబట్టి ఇంకా జాగ్రత్తగా పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి కొరకు నియోజకవర్గ సమస్యల పరిష్కారం కొరకు మరింత పట్టుదలతో పని చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో విపరీతమైన ధోరణిలో ఒకవైపు రాజయ్య, మరొకవైపు పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామాల్లో ప్రచారం చేస్తూ చాలా దిగజారి మాట్లాడారని అన్నారు. వ్యక్తిగతమైన దూషణలు, వ్యక్తిగతమైన ఆరోపణలు చేశారని అయినా టిఆర్ఎస్ చాలా గ్రామాలలో వారి ఉనికే లేదని, కనీసం వాళ్ళు పోటీలలో కూడా లేరని అన్నారు. ఈ నెల 18వ తేదీన నీడిగొండ సత్యసాయి కన్వెన్షన్ లో సన్మానించుకొని గౌరవించుకుంటామని, వాళ్లకు మార్గ నిర్దేశం కూడా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరును ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

### డిసిసి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి




**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆత్మకూరును ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశం నాకు ఇవ్వండి.. ఆత్మకూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంతో పాటు తెలంగాణకే ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశాన్ని ఆత్మకూరు ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పర్వతగిరి మహేశ్వరి రాజుకు ఓటు వేసి గెలిపించాలని డిసిసి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు ప్రచారంలో ఇనుగాల వెంట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆత్మకూరు మండల కేంద్రానికి డబుల్ బెడ్‌రూమ్‌లు, రేషన్ కార్డు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మోసం చేసిన విషయం వాస్తవం కాదా అన్నారు. తప్పుడు ఆరోపణలు చేసే ముందు నువ్వు చేసిన తప్పులు, ప్రజలకు చేసిన మోసాలను గుర్తుంచుకోవాలన్నారు. మహిళల ముందు ఆత్మకూరు గ్రామస్థులను అవమానపర్చే విధంగా సిగ్గు, శరం అని మాట్లాడటం ఎంత వరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రశ్నించారు. ప్రజలు గుణపాఠం చెప్పినా నీలో మార్పు రాలేదని మహిళలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఆత్మకూరు మండల కేంద్రానికి ప్రభుత్వ నిధులతోపాటు కుడా నిధులు తీసుకొచ్చి ఆదర్శంగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని ప్రజలకు భరోసా ఇచ్చారు. . ఎవరికి అవసరమొచ్చినా మీ కుటుంబ సభ్యునిగా ఉండి ఆత్మకూరుకు కావల్సిన ఇందిరమ్మ ఇళ్లు, గీత, నేత కార్మికులుకు, వితంతువులకు, వృద్ధులకు త్వరలోనే కొత్త పింఛన్లు ఇప్పిస్తానన్నారు. పార్టీ కోసం పనిచేసే నేతల అందరికీ పదువులు కూడా అందించే విధంగా చూస్తానని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు ప్రజలకు తెలియచేసి భారీ మెజార్టీతో మహేశ్వరిని గెలిపించాలని కోరారు.

## రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ పెంచిన తరువాతనే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో ప్రకటించిన స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్ వాగ్దానాన్ని తుంగలో తొక్కి గ్రామపంచాయతీ ఎన్నికలను బిసిలకు 17శాతం రిజర్వేషన్ తోనే నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు తీరని అన్యాయం చేసిందన్నారు. అయినా అనేక జనరల్ స్థానాలలో అగ్రకులాల ఆగడాలను అక్రమాలను బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కొని బిసిలు పోటీ చేసి తమ సత్తాచాటడం అభినందనీయమన్నారు. మూడో విడత ఎన్నికలు ముగిసిన తర్వాత జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే బిసిలకు తీరని ద్రోహం చేసిన వారుగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. లేనిచో బిసిల ఆగ్రహానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు, బిసి వ్యతిరేక పార్టీలు గురికాక తప్పదని హెచ్చరించారు.

## అమ్మాపురంలో వార్డు ఎన్నికల్లో సత్తా చాటిన సిపిఐ



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు సీపీఐ అభ్యర్థులు గెలుపొంది ఎర్ర జెండా సత్తా చాటినట్లు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన వార్డు సభ్యులను సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ సిపిఐ బలపర్చిన అభ్యర్థులను ఓట్లు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు, సిపిఐ వార్డు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. అనంతరం గెలుపొందిన సీపీఐ వార్డు అభ్యర్థులు దొనక యాకయ్య, కోటగిరి చైతన్య, గణపురం సునీత మాట్లాడుతూ తమ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, మాజీ సర్పంచ్ మామిండ్లపల్లి రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గణపురం లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు కోటగిరి యాకాంతం, డిహెచ్‌పిఎస్ నాయకులు గూడెల్లి ఎల్లయ్య, నాయకులు యాకాంతాచారి, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యఖర్చుపై కొరవడిన నియంత్రణ

### ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పేషెంట్ల వద్ద అదనపు వసూళ్లు ఆపాలి

### సిపిఐ, ప్రజాసంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య ఖర్చుపై నియంత్రణ కొరవడిందని, వైద్యం పేరుతో అడ్డూ అదుపూ లేకుండా దోపిడీ కొనసాగుతున్నదని సిపిఐ,ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఆరోపించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, బికెఎంయు జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టెపాక రవి, నాయకులు అలువాల రాజు, దొమ్మాటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో హనుమకొండ పట్టణం వైద్యానికి ఒక హబ్ గా మారిందని, ప్రతి ఏటా ఇక్కడి ప్రజలు వెయ్యి కోట్లకు పైగా వైద్యానికి ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యం సరిగా అందక పేదలు ప్రైవేటు వైద్యం కోసం లక్షలు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చేస్తున్న వైద్యానికి కూడా అదనపు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఒక్కో జబ్బుకు ఒక్కో ఆసుపత్రులో ఒక్కో రేటు వసూలు చేస్తున్నారని, ఐసియు బెడ్ చార్జీలలో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో దోపిడీని అరికట్టాల్సిన జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థ ప్రైవేటు ఆసుపత్రల యాజమాన్యాల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఆసుపత్రులలో వైద్యం ఖర్చు పై హేతుబద్ధీకరణ లేకుండా పోయిందని, ఏ రోగానికి ఎంత ఖర్చు అవుతుందో స్పష్టత లోపించిందన్నారు. రోగ నిర్ధారణ కేంద్రాలైన ప్రైవేటు ల్యాబ్‌లు, దయాగ్నొస్టిక్ కేంద్రాలు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని, అనుమతి లేని కేంద్రాలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రులు చేస్తున్న దోపిడీపై జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్

**ప్రజాపక్షం/ములుగు:**జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మూడవ విడతలో ఎన్నికలు జరుగనున్న కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బంది పోలింగ్ విధుల కోంస ఎంపిక చేశారు. అనంతరం ఎన్నికలన నిర్వహణ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌తో సమీక్షించారు.



# క్రీడ

## ఆత్రుతగా ఉన్నాం..

### వైభవ్ సూర్యవంశీని కట్టడి చేసేందుకు మా వద్ద వ్యూహాలున్నాయి

### మలేసియా కెప్టెన్ డియాజ్



భారత క్రికెట్‌లో యంగ్ సెన్సేషన్‌గా మారిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఎసిసి పురుషుల అండర్ 19 ఆసియా కప్ భారత్ జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లో 95 బంతుల్లోనే 171 పరుగులు సాధించాడు. అందులో 14 సిక్స్‌లు, 9 ఫోర్లు ఉండటం విశేషం. అయితే, టోర్నీలో రెండో మ్యాచ్ పాకిస్థాన్‌తో జరగ్గా బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. కేవలం 5 పరుగులకే వెనుదిరిగాడు. మూడో మ్యాచ్ మంగళవారం మలేసియాతో జరగనుంది. ఈ సందర్భంగా సూర్యవంశీని పాకిస్థాన్‌లాగే తామూ కట్టడి చేస్తామని ఆ జట్టు కెప్టెన్ డియాజ్ పాత్రో ధీమా వ్యక్తం చేశాడు. వైభవ్ కోసం తమ వద్ద ప్రణాళికలు ఉన్నాయని చెప్పాడు. 'వైభవ్ సూర్యవంశీ భారత్ క్రికెట్‌లో ఎదుగుతోన్న గొప్ప క్రికెట్ స్టార్. అతడితో ఆడేందుకు మేం ఆత్రుతగా ఉన్నాం. వైభవ్‌ను కట్టడి చేసేందుకు మా వద్ద వ్యూహాలున్నాయి. ఈ మెగా టోర్నీ విషయానికొస్తే.. మేం ఈ టోర్నీలో ఆడటం చాలా గొప్ప విషయం. ఇక్కడ ఆడేందుకు మా జట్టు కఠిన శిక్షణ తీసుకుంది. అనంతరం మాకు పెద్దగా సమయం లభించలేదు. అయినా.. అత్యుత్తమ శిక్షణ, నైపుణ్యాలు పొందాం. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు ఎదురు చూస్తున్నాం'అని డియాజ్ తెలిపాడు.

**మలేసియా కెప్టెన్ మనోడే!**

మలేసియా జట్టు కెప్టెన్ డియాజ్ పాత్రో తండ్రి ఒడిశాకు చెందిన వ్యక్తి. 20 ఏళ్ల క్రితం మలేసియాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. నాలుగేళ్ల వయసులో డియాజ్ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. చిన్నతనం నుంచే తన జీవితంలో క్రికెట్ ఒక భాగమైందని డియాజ్ చెప్పుకొచ్చాడు. 'పదేళ్ల వయసులో కౌలాలంపూర్ అండర్–16 జట్టు కోసం ఆడాను. 13 ఏళ్ల వయసులో మలేసియా అండర్–16 జట్టుకు ప్రాతినిథ్యం వహించా. ఈ ఏడాది అదే జట్టుకు కెప్టెన్‌గా మారడంతోపాటు ఇప్పుడు అండర్–19 మలేసియా జట్టుకు సారథిగా ఉన్నాను. ఇదంతా నా తల్లిదండ్రుల సహకారంతోనే జరిగింది. మా తండ్రిది ఒడిశా కావడంతో అక్కడ చాలా మంది బంధువులున్నారు. ఏడాదిలో ఒక్కసారైనా ఒడిశాకు వెళ్లి వారందరినీ కలుస్తుంటా. ఇక డేవిడ్ వార్నర్ నా అభిమాన క్రికెటర్. అందుకే, ఆయన జెర్సీ నంబర్ (31)నే నా జెర్సీకి పెట్టుకున్నా' అని డియాజ్ చెప్పాడు.



## మెస్సీకి స్పెషల్ గిఫ్ట్..

### టీ-20 ప్రపంచకప్ 2026 టికెట్ ఇచ్చిన జై షా

భారత పర్యటనలో ఉన్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి సోమవారం ఢిల్లీలో సందడి చేశాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఐసిసి ఛైర్మన్ జై షా.. మెస్సీని కలిసి భారత క్రికెట్ జట్టు జెర్సీలను, బ్యాట్‌ను బహూకరించాడు. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో యుఎస్‌ఎతో తలపడనుంది. ఫిబ్రవరి 7న వాంఖడే వేదికగా జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు రావాలని మెస్సిని జై షా కోరాడు. ఈ మేరకు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్‌ను మెస్సికి అందించాడు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ సిఎం రేఖా గుప్తా, డిడిసిఎ అధ్యక్షుడు రోహన్ జైట్లీ హాజరయ్యారు.

**అప్పుడే టీ20 ప్రపంచ కప్ జట్టు ప్రకటన!**

టీ20 ప్రపంచ కప్ కంటే ముందు న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20లు ఆడనుంది. జనవరి 21 నుంచి ఈ సిరీస్ ప్రారంభంకానుంది. టీ20 వరల్డ్ కప్ జట్ల ప్రకటన కోసం ఐసిసి డెడ్‌లైన్ విధించడంతో కివీస్‌తో సిరీస్‌కు ప్రకటించిన జట్టునే ప్రపంచ కప్ కోసం ఎంపిక చేసే అవకాశమున్నట్లు బిసిసిఐ వర్గాలు తెలిపాయి.

## ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా షెఫాలి వర్మ



భారత మహిళా క్రికెటర్ షెఫాలి వర్మ నవంబర్ 2025గాను ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలుచుకుంది. భారత మహిళల జట్టు 2025 వన్డే ప్రపంచ కప్ సాధించిన సంగతి తెలిసిందే. టోర్నీ చివర్లో ప్రతీక రావల్ గాయపడటంతో అనుహ్యంగా జట్టులోకి వచ్చిన షెఫాలి.. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. 78 బంతుల్లోనే 87 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచి భారత్ టైటిల్ గెలవడంతో కీలక పాత్ర పోషించింది. బంతితోనూ షెఫాలి ఆకట్టుకుంది. ఏడు ఓవర్లు వేసిన ఆమె 36 పరుగులు ఇచ్చి కీలక సమయంలో రెండు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు దక్కడంపై షెఫాలి వర్మ సంతోషం వ్యక్తం చేసింది. 'ఫైనల్‌లో జట్టు విజయానికి నేను దోహదపడినందుకు సంతోషిస్తున్నా. స్వదేశంలో ప్రేక్షకుల ముందు మొదటిసారిగా ప్రపంచకప్‌ను గెలిచి చరిత్ర సృష్టించడంలో భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉన్నా. నవంబర్ నెలకుగాను మహిళల విభాగంలో ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నా. ఈ అవార్డును నా సహచరులు, కోచ్‌లు, కుటుంబం, ఇప్పటి వరకు నా ప్రయాణానికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నాను. మేము జట్టుగా గెలుస్తాం.. ఈ అవార్డు విషయంలో కూడా అంతే' అని షెఫాలి వర్మ పేర్కొంది.

**పురుషుల విభాగంలో సౌతాఫ్రికా స్పిన్నర్**

పురుషుల విభాగంలో నవంబర్ 2025కిగాను సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హార్మర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు దక్కింది. భారత్‌తో జరిగిన రెండు టెస్టు సిరీస్‌లో హార్మర్ 17 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 'ఈ అవార్డుకు ఎంపిక కావడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. సౌతాఫ్రికా తరఫున ఆడాలనే నా కల నిజమైంది. దాని ఫలితంగా వచ్చే ఫలితమేదైనా బోనస్ లాంటిది. మరింత కాలం సౌతాఫ్రికాకు ఆడి జట్టు విజయాల్లో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాను' అని సైమన్ హార్మర్ తెలిపాడు.

# ఫోకస్

# యువతరంగం




## నైపుణ్య విద్యకు కంప్యూటర్ పరిజ్ఞానం తోడవ్వాలి!

ఏ దేశానికి లేని ఓ అద్భుత వరం భారతమాత చెంత ఉన్నది. యువశక్తి అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ ముందు వరుసలో ఉంటూ యువభారత్‌గా పిలువబడుతున్నది. ఆఫ్రికాలో ప్రజల సగటు వయస్సు 19 ఉండగా చైనాలో 40, యూఎస్లో 44, ఇటలీలో 48, జర్మనీలో 46, జపాన్లో దాదాపు 50గా నమోదు అవుతున్నది. భారత్లో జనాభా సగటు వయస్సు 29గా లెక్కించబడింది. యువ జనాభా అధికంగా ఉండడం వరంగా మారాలంటే డిజిటల్ యుగానికి సమానంగా, అంతర్జాతీయ స్థాయి విద్యా బోధనలు జరగాలి. విద్యా విధానంలో నాటి పాత పోకడలు కొనసాగితే భారత యువశక్తి శాపంగా మారి దేశం అశాంతికి కేంద్రంగా మారుతుందని గమనించాలి. ఎనిమిది బిలియన్లకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో భారత జనాభా 1.4 బిలియన్లు దాటింది. నేటి విద్యావిధానం ప్రపంచ స్థాయి నవ్య శాస్త్రసాంకేతిక శాస్త్రాల స్థాయికి చేరడానికి భారతదేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశాల్లో మార్పులు, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, టీచర్ల నియామకాలు, ఉపాధ్యాయ శిక్షణ, ఉపాధ్యాయుల వేతనాలు, పాఠశాలల విస్తరణ, ఆధునిక సదుపాయాలు తక్షణమే అవసరం అవుతాయని తెలుసుకోవాలి. భారత దేశవ్యాప్తంగా 1.4 మిలియన్ల పాఠశాలలు ఉండగా సదుపాయాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. భారత్లో 10 నుంచి 20 ఏండ్ల వయస్సు కలిగిన బాలలు/యువత 200 మిలియన్లు ఉన్నారు. ఆధార్, యూపిఐ చెల్లింపులు, డిజిటల్లాకర్ సౌకర్యాల్లో ముందున్న భారతం పాఠశాల విద్యా ప్రమాణాల్లో వెనుకబడి ఉందని నిపుణులు వాపోతున్నారు. డిజిటల్, ఏఐ విప్లవానికి తగిన విద్యా బోధన భారతానికి అందని ద్రాక్షే అవుతున్నది. నాణ్యమైన విద్య, ఆ విద్యకు తగిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు బోధించకపోతే మన యువ జనాభా దేశానికి పెనుశాపంగా మారి నిరుద్యోగం మరింత పెరుగుతుంది. మన ప్రస్తుత విద్యా విధానాన్ని తక్షణమే పునఃసమీక్షించాల్సిన అగత్యం ఏర్పడింది. నాణ్యమైన ఉపాధ్యాయులు, పాఠశాల వసతులు, నిరంతర సెలబస్ రూపకల్పనలు, కొత్త పోకడలకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దారులు వెతకాలి. అగ్ర రాజ్యాల యువత రేపటి కలలను సాకారం చేసుకోవడానికి నేడే నాంది పలుకుతుండగా, భారతం మాత్రం ఓల్ ఈజ్ గోల్ అనే నానుడికి లోబడి పాత సిలబస్లు, అరకొర అర్హతలకు అతుక్కుపోతూ ఉపాధ్యాయులు/పాఠశాలలతో నత్తనడకన బోధనలు కొనసాగుతున్నాయి. రేపటి అవకాశాలకు నేడే నైపుణ్య పెట్టుబడి పెట్టాలని మరిచి పోతున్నాం, మారడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాం. ప్రతి భారతీయ విద్యార్థి చేతికి ఆధార్ కార్డు వలె ఒక కంప్యూటర్ అందజేయాలని, ఒక్క విద్యార్థి వేసి ముద్రలతోనే పని చేసే విధంగా రూపొందించాలని, అమ్మడానికి/మార్చుకోవడానికి వీలు లేకుండా తయారు చేయాలని, అనవసర అంశాలు చూడడానికి తావు లేకుండా ప్రత్యేక కంప్యూటర్లను పంపిణీ చేయాలని సూచిస్తున్నారు. అన్ని పాఠశాలలను వైఫై కనెక్షన్, అపరిమిత డాటా వినియోగం అందుబాటులో ఉండే ఆధునీకరించాలి. కంప్యూటర్ విద్య నేర్పడానికి అర్హులైన శిక్షకులను నియమించి, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఆకర్షనీయ బహుమతులు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. పాఠ్యాంశాలను దాటి నేర్చుకోవడానికి ఇష్టపడే యువత నుంచి అదనంగా ఫీజులు వసూలు చేయాలి. నేటి విద్యా విధానానికి అదనంగా ఈ కంప్యూటర్ లిటరసీ విద్యా బోధన కొనసాగాలి.

## ధైర్యానికి మారుపేరు హెయిస్

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..





జాన్ కాఫీ జాక్ హెయిస్.. ఒకప్పుడు ఈ పేరు అమెరికా పశ్చిమపు సరిహద్దుల్లో మారుమోగేది. ధైర్యానికి, అప్రతిహతమైన మనోస్థైర్యానికి ప్రతీకగా నిలిచింది. 1817లో టెనసీలో జనించిన హెయిస్, యౌవనంలోనే తిరుగుబాటుతో, రక్తపాతంతో మునిగిపోయిన టెక్సాస్ వైపు ప్రయాణం మొదలుపెట్టాడు. ఇరవై సంవత్సరాలు పూర్తికాకముందే అతను టెక్సాస్ రేంజర్స్‌లో చేరి, నడుముపై కోల్ట్ తుపాకీతో పోరాట యోధుడిగా పేరు సంపాదించాడు. మరణం తప్పదనుకున్న యుద్ధాల్లోనూ అతను బతికి చూపించాడు. 'ప్లమ్ క్రీక్' యుద్ధంలో సంగ్రామం, బేగార్‌పై దాడులు జరిగినప్పుడు, సాన్ జసింటో యుద్ధ బాంబుల దాడుల మధ్య, అతను మరణాన్ని సవాలు చేశాడు. యుద్ధంలో సహచరులు తడబడినప్పుడు, ముందుకు వెళ్లాలా? లేదా? అని ఆలోచిస్తున్నప్పుడు అతను స్థిరంగా ముందుకు కదిలేవాడు. 1844లో వాకర్స్ క్రీక్ వద్ద, కామాంచీ వీరులు మెరుపు దాడి చేసినప్పుడు హెయిస్ వారిని సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఈటెలు, బుల్లెట్లు గాల్లో ఎగురుతున్నా, హెయిస్ వెనుకడుగు వేయకుండా ఆరు తుపాకీ గుండ్లు పేల్చాడు. అతను ఎన్నడూ తడబడలేదు. హడావుడి చేయలేదు. అతని నాయకత్వంలో అరుపులు వినిపించవు. గందరగోళం అసలే ఉండదు. ఉద్రేకపూర్వకమైన చర్చలు.. ఉపన్యాసాలు.. నినాదాలకు అతను పూర్తి దూరం. అతని తీరు చాలా స్థిరంగా ఉంటుంది. యుద్ధం తీవ్రత ఏ స్థాయిలో ఉన్నా, అతనిలో అదే స్థిరత్వం. కామాంచీ దాడి సమయంలో హెయిస్ ఒక్క గాయం కూడా తగలకుండా నిలిచాడు. మరణం కూడా అతనిని చూసి భయపడుతుందేమో అనిపించేది. కాలిఫోర్నియా వైపు సవారీ చేస్తున్నప్పుడు, హెయిస్ నాయకుడిగా ముందు నిలిచాడు. సరిహద్దుల్లో నిలిచి ప్రత్యర్థి సైన్యం కళ్లలోకి నేరుగా చూశాడు. అతని ధైర్యాన్ని కొలిచే కొలమానం ఏదీ లేదు. నాయకుడంటే ఎలా ఉండాలో హెయిస్‌ను చూసి నేర్చుకోవాలి. అప్పుడే కాదు... ఇప్పటికీ అతని నాయకత్వ ప్రతిభ ప్రపంచానికి మార్గదర్శకం. ఆదర్శప్రాయం.

## గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం : ఎమ్మెల్సీ సత్యం





**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే కమ్యూనిస్టుల లక్ష్యమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించేందుకు ఎమ్మెల్సీ సత్యం సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం గ్రామంలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామ పాలన ప్రజల చేతిలో ఉండాలంటే నిబద్ధత నిజాయితీ కలిగిన నాయకుల అవసరమన్నారు. పేదలు, కూలీలు, రైతుల హక్కుల కోసం పోరాడే పార్టీ సిపిఐ మాత్రమే నన్నారు. సిపిఐ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగొని గాలయ్య పాల్గొన్నారు.

**సొంత నిధులతో అభివృద్ధికి సహకరిస్తా...**మండలంలోని లింగం వారి గూడెం గ్రామంలో కాంగ్రెస్ సిపిఎం, టిడిపి బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి పల్లె సరళ శేఖర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సరళ శేఖర్ రెడ్డిని గెలిపించండి అభివృద్ధికి తన సొంత నిధులతో ప్రత్యేకంగా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా హామీ ఇచ్చారు.

## కమ్యూనిస్టులతో గ్రామాభివృద్ధి

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మూడో విడత ఈనెల 17న జరగబోయే పంచాయతీ ఎన్నికలలో సిపిఐ పోటీ చేస్తున్న రంగాపురం గ్రామ పంచాయతీలలో సిపిఐ అభ్యర్థులను సర్పంచ్‌లుగా అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండలంలోని రంగాపురం, గానుగబండ గ్రామాల్లో మిత్రపక్ష పార్టీలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగాపురం, గానుగబండ గ్రామ పంచాయతీలలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు కట్ట కళ్యాణి, కడియాల పద్మ విజయానికి సహకరిస్తున్న బిఆర్ఎస్, సిపిఐ ఎంఎల్ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యకర్తలు కృషి చేసి ఈ రెండు గ్రామాల్లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కడియాల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐతోనే గ్రామాల అభివృద్ధి : కూనంనేని

### ఖమ్మం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో ముమ్మర ప్రచారం





**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులతోనే గ్రామీణ ప్రాంత సమస్యలు పరిష్కారం కావడంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం లక్ష్మిదేవిపల్లి మండలంలోని అశోక్‌నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, సీతారామపురం, వేపలగడ్డ, లాలుతండా, రేగళ్ల పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించామని వివిధ పథకాల్లో రోడ్లు, డ్రైన్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయ నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మరికొన్నింటికి ప్రతిపాదనలు పంపించామని ఆయన తెలిపారు. ఓట్ల కోసం కొందరు ఓటర్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కూనంనేని ఆరోపించారు. నిధులు ఎవరి సొత్తు కాదని అవి ప్రజాధనమని ఎవరి ఇంట్లో నుంచి అభివృద్ధి పనులకు కేటాయించడం లేదని ఆయన తెలిపారు. రెండవ దఫా పంచాయతీ ఎన్నికల్లో సిపిఐకి ప్రజలు సంపూర్ణ మద్దతునిచ్చి భారీ విజయాన్ని చేకూర్చారని, అదే రీతిలో మూడవ దఫాలో కూడా ఓటర్లు సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, లక్ష్మి పతి, శ్రీనివాస్, నునావత్ గోవింద్, సఫవత్ రవి, రాజు, సత్యనారాయణ, శేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**బాజుమల్లాయిగూడెంలో భారీ ర్యాలీ**

కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సిపిఐ అభ్యర్థి కోరం కోటమ్మ గెలుపును కాంక్షిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతామని ఆయన తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివక్షకు తావులేకుండా అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. కోరం కోటమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, రావి శివరామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సిపిఐ నాయకులు ఉంగరాల సుధాకర్, బాగం మాధవరావు, రాంబాబు, వెంకట్, బొమ్మగాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా సిపిఐ అభ్యర్థులు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించి ఉపసర్పంచ్‌లుగా ఎంపికయ్యారు. చిగురుమామిడి మండల పరిధిలోని చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన సిపిఐ మండల సహాయకార్యదర్శి పైడిపల్లి వెంకటేష్ ముల్కనూర్ గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఇందుర్తి గ్రామంలో 3వ వార్డు సభ్యుడిగా గెలుపొందిన చింతపూల అనిల్‌కుమార్ గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నుకోబడ్డారు. చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన ఐదో వార్డు సభ్యురాలుగా దున్నపోతుల సౌందర్య రాములు, 9వ వార్డు సభ్యుడిగా రాకం అనిల్, పదో వార్డు సభ్యురాలుగా రాకం అంజవ్వ, బొమ్మనపల్లి గ్రామ 11వవార్డు సభ్యుడిగా అందె సంపత్ ఎన్నికయ్యారు. మండలంలోని ఇందుర్తి గ్రామ 1వ వార్డు సభ్యురాలుగా తోట లావణ్య సంతోష్ ఎన్నిక కాగా 9వ వార్డు సభ్యుడిగా అందె తిరుపతి, 11వ వార్డు సభ్యురాలుగా బింగి విజస్వామి, 12వ వార్డు సభ్యుడిగా కముటం అనిల్ ఎన్నికయ్యారు. రేకొండ గ్రామ 1వ వార్డు సభ్యురాలుగా దుద్దేల వసంత, 6వ వార్డు సభ్యుడిగా బోయిని అనిల్ ఎన్నికయ్యారు. నవాబుపేట గ్రామ 6వ వార్డు సభ్యుడిగా పిల్లి తిరుపతి, గాగిరెడ్డిపల్లి గ్రామ 7వ వార్డు సభ్యుడిగా బరిగెల చొక్కయ్య ఎన్నికయ్యారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ 3వ వార్డు సభ్యుడిగా పిట్టల సమ్మయ్య, మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామ 7వ వార్డు సభ్యుడిగా శాతరాజు సంపత్, గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామ 6వ వార్డు సభ్యురాలుగా బోయిని మమత తిరుపతి, హన్మాజీపల్లి గ్రామ 2వ వార్డు సభ్యుడిగా బస్వాపురం చంద్రయ్య విజయం సాధించారు.

**అమ్మాపురంలో ..**



**తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని అమ్మాపురం గ్రామంలో సిపిఐ బలపర్చిన ముగ్గురు వార్డు సభ్యులు ఆదివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఒకటవ వార్డు సభ్యులు దొనక యాకయ్య, మూడవ వార్డు సభ్యురాలు కోటగిరి చైతన్య, 12వ వార్డు సభ్యురాలు గణపురం సునిత విజయం సాధించారు.

**సీతారాంపల్లి ఉపసర్పంచ్‌గా సిపిఐ మండల కార్యదర్శి మిట్టపల్లి సుధాకర్**



**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా రూరల్ మండలం సీతారాంపల్లి ఉప సర్పంచ్‌గా సిద్దిపేట రూరల్ మండల సిపిఐ కార్యదర్శి మిట్టపల్లి సుధాకర్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సిపిఐ నేత, నూతన సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్న వారు సభ్యులకు, సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సీతారాంపల్లి నూతన సర్పంచ్‌గా ఎన్నికైన సుధాకర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అభినందించి సన్మానం చేశారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/వెల్దుర్తి:**కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం వెల్దుర్తి యశ్వంత్‌రావుపేట్ మానేపల్లి చేరేలా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల కోసం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని సన్న బియ్యం పథకం ఉచిత కరెంటు తదితర పథకాలతో పల్లెల్లోకాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని, గత రెండు విడతల పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించిందని మూడో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. వెల్దుర్తిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దందురమాములను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అవుసుల మల్లేష్ చారి, సింగిల్ విండో డైరెక్టర్ నాలా చెరువు కిష్టా గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగ్గశంకర్, శేఖర్ గౌడ్, కృష్ణ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/నిజాంపేట:**నిర్వాహకులకు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా గోనె సంచులు రోడ్డుపైన వదిలిపెట్టిన ఘటన నిజాంపేట మండలం కాసింపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వరి కొనుగోలు కేంద్రాలు గత రెండు నెలలుగాధాన్యం విక్రయించి కేంద్రాలు ముగిసిపోయినప్పటికి నిర్వాహకులు గోనె సంచులు తూకం వేసే కాంటాను రోడ్డుపైన వదిలిపెట్టడం జరిగింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించకపోవడం ఏమిటని..? గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వేలు ఖర్చుపెట్టి ప్రభుత్వం గోనె సంచులను కొనుగోలు చేసి రైతులకు అందిస్తుంటే నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గోనె సంచులను తీసుకువెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మూడవ విడుత పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని చండి గ్రామ శివారులోని జెఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మూడవ విడుత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం అవసరమైన ఎన్నికల సామాగ్రిని తగిన జాగ్రత్తలతో పంపిణీ చేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా లేదోనని అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలోఅలసత్వం వహిస్తే మాత్రం అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. మండల ఎన్నికల అధికారి వెంకటలక్ష్మమ్మ, తహశీల్దార్ కమలాద్రి, ఎంపిఒ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు బందోబస్తుపై సమీక్ష



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:**ప్రజలుశాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ఏర్పాట్లు చేయాలని పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడవ విడత నిర్వహణలో భాగంగా ఆర్మూర్ ఎసిపి కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని తూ .చ.తప్పకుండా పాటించాలన్నారు. డివిజన్ పరిధిలో సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్సు సేవలను వినియోగించుకొని గుంపులను చెదరగొట్టాలన్నారు. ఎన్నికల రోజు సిబ్బంది తెల్లవారుజామునే తమకు కేటాయించిన పోలింగ్ బూతులో సక్రమమైన విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల తర్వాత ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొత్తం పూర్తయ్యేవరకు ఎవరు ఎలాంటి ప్రలోబాలకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎసిపి జె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఒ పి.సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సిఐ కె. శ్రీధర్ రెడ్డి, భీంగల్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్, బాల్కొండ ఎస్ఐ కె. శైలేందర్, నందిపేట్ ఎస్ఐ జి. శ్యామ్‌రాజ్, వేల్పూర్ ఎస్ఐ బి.సంజీవ్, ఎస్ఐ ముప్కాల్ కిరణ్ పాల్, మెండోరా ఎస్ఐ సుహాసిని, భీంగల్ ఎస్ఐ కె. సందీప్, మోర్తాడ్ ఎస్ఐ బి. రాము, కమ్మర్‌పల్లి ఎస్ఐ జి. అనిల్ రెడ్డి, ఏర్గట్ల ఎస్ఐ పి. రాజేశ్వర్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

## మూడో విడత పోలింగ్‌లో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

### జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :**శత శాతం ఓటింగ్ లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని, మెదక్ జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ శాతంలో రాష్ట్రంలో 05 స్థానంలో ఉందని, మూడో విడత ఎన్నికలలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలందరికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లే మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేసి పూర్తి చేయాలన్నారు. ఈ నెల 17 వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరిగే మండలాల్లో నర్సాపూర్, చిలిపిచేడ్, కౌడిపల్లి, కొల్చారం శివంపేట్, వెల్దుర్తి, మాసాయిపేట్ మండలాల్లో అత్యధికంగా ప్రజలు పాల్గొని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. మొదటి విడతగా మొదటి విడతలో 88 శాతం, రెండో విడతలో 88 శాతం ఓటింగ్ నమోదయిందని కలెక్టర్ వివరించారు.

# సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాపక్షం / చెన్నూర్ :**మూడవ విడత పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లాలోని కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లో ఏర్పాటు చేసిన 3వ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెల 16న అధికారులు నిర్దేశిత సమయానికి సామాగ్రి పంపిణీ కేంద్రాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని వివరించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కోటపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**సమీకృత కలెక్టరేట్‌లో తపాలా ఉప కార్యాలయం ప్రారంభం**

ప్రజల సౌకర్యార్థం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తపాలా శాఖ ఉప కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ లో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా పొదుపు ఖాతాలు, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్సిల్ సేవ, జీవిత భీమా, ఆర్డి, సుకన్య సమృద్ధి, టైం డిపాజిట్, పిపిఎఫ్, మంత్లీ ఇన్కమ్ స్కీం, సీనియర్ సిటిజన్, కిసాన్ వికాస్ పత్ర వంటి అన్ని తపాలా సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆర్. రామారావు, సబ్ పోస్ట్ మాస్టర్ రవి, ప్రణబ్ పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బిఆర్ఎస్ మద్దతుదారులనే సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిపించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో ఎన్నికలలో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి చింతస్వామి, వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలలో పూర్తిగా వ్యతిరేకత ఏర్పడుతుందని, రెండేళ్ల సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని ఎద్దేవ చేశారు. బిఆర్ఎస్‌మద్దతుదారులను గెలిపించుకుంటే తాను కూడా నిధుల మంజూరు కోసం సంపూర్ణ సహకారం అందిస్తానని ఆమె అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చింతస్వామి ప్యానల్‌లో పోటీ చేస్తున్న వార్డుసభ్యులను తప్పకుండా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడురమణాగౌడ్, మండల నాయకులు నాయిని మురళీధర్‌గౌడ్, పిల్లి కృష్ణ, కమ్మరి సురేశ్, బుర్ర పెద్దపోచాగౌడ్, పిల్లి మధు, సండ్ర సీఆర్ఐ సత్తి, ఆలయ కమిటీ ఛైర్మన్ పిల్లి శివకుమార్, దప్పు వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు లేకుండా ఓటు వినియోగం

### బొజ్జు ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/ముధోల్:**మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు.సోమవారం మండల కేంద్రమైన ముధోల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన షబానా బేగంకు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో జరిగే సర్పంచుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.రెండేళ్ల కాంగ్రెస్ పరిపాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.ఇక్కడ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ప్రతి ఒక్క దాన్ని నెరవేర్చడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు.బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు.పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపిస్తే నిధులు తెచ్చేందుకు తనవంతుగా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి పిలు ఏజాజుద్దీన్,అఫ్రోజ్ ఖాన్,మాజీ ఎంపిటిసి సభ్యుడు ఎస్డీ ఖాలీద్,షకీల్,అజర్,ఇమ్రాన్,స్థానికనాయకులు,కార్యకర్తలు అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి , జెడ్‌పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలి

### మెదక్ ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:**రాబోయే ఎంపిటిసి,జెడ్‌పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని మెదక్ ఎంపి రఘునందన్ రావు సూచించారు. ఈ మేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల బిజెపి నాయకులు సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్ చారి ఆధ్వర్యంలో ఎంపిరఘునందన్ రావు ను హైదరాబాద్ లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపిమాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలలో ఉత్తమ ఫలితాలు కనబరచలేకపోయామని రాబోయే ఎంపిటిసి,జెడ్‌పిటిసి ఎన్నికలలో బిజెపి గుర్తుతో పోటీ ఉంటుంది కాబట్టి మన సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. అంతిమంగా 15 ఎంపిటిసి స్థానాలు జెడ్‌పిటిసి స్థానం కైవసం చేసుకునే దిశగా బిజెపి నాయకులు పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేశారు. మండలంలో త్వరలో బిజెపిలోకి భారీగా చేరికలు ఉంటాయని బిజెపి మండలంలో బలోపేతమై తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈరోజు గాజుల గూడెం కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ కాండేట్ పుట్టల మల్లేశం ఎంపిమరియు మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో బిజెపిలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి, ఉపాధ్యక్షుడుబాగేష్, మల్లేశం, నాగభూషణం, గౌస్, మండల నాయకులు సాయి లు, మురళి,బాబు,శంకరయ్య,పాల్గొన్నారు.

## అధికారుల ర్యాండమైజేషన్ పూర్తి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షణలో పకడ్బందీగా సాగిన ర్యాండమైజేషన్ ప్రక్రియ



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :**నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.మూడవ విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ర్యాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు.ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది ఆర్వో,ఓఆర్వోలను నియమించనున్నారు.ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు.దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు.అధికారులతో మాట్లాడుతూ,గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి రెండు దశలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేశామని,మూడవ దశ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.మూడవ దశ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని వివరించారు.ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్, డిపిఒశ్రీనివాస్,డిఇఒఒ భోజన్న ,జెడ్‌పి సిఇఒ శంకర్,ఇతర అ ధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో హస్తానిదే హవా!

**ప్రజాపక్షం/సంగారెడ్డి :**పంచాయతీ ఎన్నికల్లో పల్లెల ఓటర్లు అధికార పక్షం బలపరచిన వైపు మొగ్గు చూపారు. దీంతో రెండవ విడత పంచాయతీ ఎన్మిక ల్లో హస్తం మద్దతుదారుల హవా కొనసాగింది. భారాస మద్దతుదారులు గట్టి పోటీ ఇచ్చారు. బ్యాలెట్ పేపర్‌లో పార్టీల గుర్తులు లేనప్పటికి రెండో దశ ప్ర జాతీర్పులో సత్తాచాటారు. అందోల్ ,జహీరాబాద్ , నియోజకవర్గల పరిదిలో ని 10 మండలాల్లో మొత్తం 243 గ్రామ పంచాయతీలు 2104 వార్డు స్థానాలకు నిర్వహించేందుక అధికారులు ఎర్పాట్లు చేశారు. ఇందులో 14 మంది స ర్పంచులు 222 వార్డు స్థానాలు ఏకగ్రీమయ్యాయి. మిగిలిన పల్లెలో ఎన్నికలు నిర్వహించి పలితాలు వెల్లడించారు. కాంగ్రెస్ మద్దతుదారులు 148 భారాస మద్దతు దారులు 83, సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్నారు. అందోలు మ ండలంలో కాంగ్రెస్ కు 13 ,భారసకు 12 స్థానాలు దక్కాయి. చౌటుకూర మండలంలో కాంగ్రెస్ 12 బారాసకు 01 స్థానాలు, పుల్కల్ మండలంలో కాంగ్రెస్‌కు 13,భారాసకు 05స్థానాలు, వట్‌పల్లి మండలంలో కాంగ్రెస్ కు 16, బా రాసకు 06,రాయికోడ్ మండలంలో కాంగ్రెస్‌కు 19, బారాసకు 18,మునిప ల్లి మండలంలో కాంగ్రెస్‌కు 21, భారాస 07 , ఝురా సంఘం మండలంలో కాంగ్రెస్‌కు 18,భారాసకు 15,జహీరాబాద్ మండలంలో కాంగ్రెస్‌కు 09, భారాసకు 10, మొగుడంపల్లి కాంగ్రెస్‌కు 14,భారాసకు 07, కోహీర్ మండలంలోకాంగ్రెస్‌కు 17,బారాసకు 04,కోహీర్ మొత్తం 243 స్థానాల్లో కాంగ్రెస్‌కు140,భారాసకు83,భాజపా02,స్వాతంత్రులు12 స్థానాలు లభించా యి.

**మాట నిలుపుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**

అందోల్ నియోజకవర్గంలో పరిధిలోని 143 గ్రామాల్లో ఎన్నికలు జరగాయి. 78 చోట్ల అధికార కాంగ్రెస్ మద్దతుదారులు 48 స్థానాల్లో ,04 స్థానాలో బారాస బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అత్యధిక సర్పంచు స్థానాలు ఆ పార్టీ మద్దతు దారుల స్వాధీనం చేసుకొని మాట నిలుపుకున్నారు.

## వేధింపులు భరించలేక భర్తను హతమార్చిన భార్య

**ప్రజాపక్షం / మందమర్రి :**మద్యం మత్తులో నిత్యం వేధిస్తున్న భర్తను భార్య స్టీల్ రాడ్ తో కొట్టి హతమార్చింది. మందమర్రి పట్టణంలోని రాజీవ్ నగర్ లో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ నగర్ కు చెందిన మాటెటి చంద్రయ్య లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఇతను తరచూ మద్యం సేవించి భార్య లక్ష్మి , కుమార్తెను కొడుతూ వేధించేవాడు. ఆదివారం రాత్రి కూడా గొడవ జరగడంతో వేధింపులు భరించలేక లక్ష్మి స్టీల్ రాడ్ తో భర్త తలపై బలంగా కొట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావమై చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి చెల్లెలు దుడం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కేసును మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల హాస్టళ్లను సందర్శించండి




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :**ముఖ్యమంత్రి గారు.. మెస్సీతో ఫుట్‌బాల్ ఆట కాదు, విద్యార్థుల హాస్టళ్లను సందర్శించండని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాం కోరారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సుబోద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదని, అందాల పోటీల కు ఉన్న నిధులు, మెస్సీతో ఫుట్‌బాల్ ఆటపై ఉన్న శ్రద్ధ, విద్యార్థులపై ఎందుకు లేవన్నారు. రేవంత్‌రెడ్డి మెస్సీతో ఫుట్‌బాల్ ఆట కాదు విద్యార్థుల హాస్టళ్లను సందర్శించి నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుండి విద్యారంగానికి నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలం చెందారని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి రెండేళ్ళ పాలన ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారని, రెండేళ్ళపాలనలో విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏకకాలంలో విడుదల చేస్తామన్న హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న గురుకులాలు సంక్షేమ హాస్టళ్ళు సమస్యలకు నిలయంగా మారిందన్నా రు. విద్యాశాఖకు ప్రత్యేకమంత్రిని నియమించాలని, ప్రభుత్వం వెంటనే ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షం లో మంత్రులను, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుబోద్, జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, చోటు, జిల్లా సహాయ కార్యదర్శి కుసాల్, సంజయ్‌పాల్గొన్నారు.

## ప్రజా తీర్పు కాంగ్రెస్‌పై విశ్వాసానికి ప్రతీక

### ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ప్రజాపక్షం /జైనూర్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ప్రతీక అని ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. జైనూర్ మండలంలోని గౌరీ కొలామ్ గూడా గ్రామపంచాయతీ సర్పం చ్ ఆత్రం అయ్యుబాయి భుజంగ్ రావ్, ఉప సర్పంచ్ షేక్ ఫైసల్, వార్డ్ సభ్యులను సోమవారం లెండిగూడా గ్రామంలో మాజీ వైస్ ఎంపిపి షేక్ రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాత్ రావ్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజలకు చేరువగా ఉండి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పార్టీ అండతో పాటు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాపాలన చూసి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టం కడుతున్నారని, నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తూ లబ్దిపొందేలా చూడాలని కోరారు. ప్రజా పాలనకు ఆకర్షితులై బిఆర్ఎస్ నుంచి గౌరీ గ్రామానికి చెందిన మహెబూబ్, అయ్యూబ్, సలవుద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఫెరోజ్ ఖాన్, మండల నాయకులు అజ్జులాల, దత్తు, రాంశావ్, వార్డ్ సభ్యులు షేక్ రహీం, షేక్ అబ్బు, షేక్ తాజూ, ఖదీర్, షకీర్, షేకిల్, స్థానిక వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## 17న ప్రభుత్వ సంస్థలకు, పాఠశాలలకు సెలవులు

కలెక్టర్ కె హైమవతి

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** ఈ నెల 17 తేదిన సాధర ఎన్నికల నేపధ్యాంలో జిల్లాల్లోని మూడవ విడత ఎన్నికల దృష్య అక్కన్నపేట , హుస్నాబాద్ , కోహెడ, ధూల్‌మిట్ట, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి , కొండపాక ,మరియు కుకునూర్‌పల్లి,మండలాల పరిదిలోని గ్రామాల్లో జరుగనున్న గ్రామ పంచాయితీ ఎన్నిక 3వ విడత ఎన్నికలు ఓటు హక్కుమినియోగించుకునేందుకు సంబందిత 9 మండలాలోని గ్రామ పరిదిలోని ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి కే హైమవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పాఇదరకంగా శాంతియుత వాతవరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అన్ని ఏర్పట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 17వ తేదిన ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు నిర్వహించన్నుట్లు ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

## ఓడినా, గెలిచినా, ప్రజల మధ్యలో ఉండాలి: మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ ముత్తారం :** ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని ఎన్నికలలో గెలిచినా ఓడిన ప్రజల మధ్యలో ఉండి సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు.సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామ కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి బండ సమ్మయ్య ఓటమి చెందగా కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని గెలుపు ఓటములు సహజమని ప్రజల మధ్యలో ఉంటూ సేవలందించాలని సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బండ సమ్మయ్య,కాంగ్రెస్ నాయకులు చెల్కల జితేందర్,శ్రావణ్,రమేష్, అనిల్ ,శ్రీశైలం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 83 సీట్లు గెలిచామంటున్న కెటిఆర్.. అభ్యర్థుల పేర్లు చెప్పగలవా?: ఆది



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో 83 సీట్లు గెలిచామంటున్న కేటీఆర్ పేర్లు చెప్పగలవా అని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కేటీఆర్ ను ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీత శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించారు. మూడో విడుత ఎన్నికల ప్రచారం కోసమే కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశాడనీ విమర్శించారు. జిల్లాలో 80 దాటలేదనీ 60 దగ్గరే బిఆర్ఎస్ ఆగిందన్నారు. కేటీఆర్ మాత్రం 83 స్థానాలు గెలిచాం అని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలువ లేక తప్పుడు అంకెల గారడీతో కేటిఆర్ పరవు నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు.నీ నియోజకవర్గంలో ఒక్క సీటైన ఎక్కువ గెలిచి పరువు కాపాడుకోవాలని సవాలు విసిరారు. మూడు విడుతల ఎన్నికల తరువాతనే ఆత్మీయ సమ్మేళనం పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ ఖాతం అయ్యిందనీ అన్నారు. కేటీఆర్ రెండు విడతల్లో పోయిన పరువు కోసమే ఆత్మీయ సమ్మేళనం పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదిస్తుంటే కేటీఆర్ చూస్తూ ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడన్నారు. 2009 లో 175 కోట్ల తేడాతో గెలిచింది మరిచిపోయి మాట్లాడుతున్నావ్ అన్నారు. నేను ఓడిన గెలిచిన ప్రజల మధ్యే ఉంటూ ప్రజల సేవలు చేస్తున్నానన్నారు. మీలాగా ప్రజలను విడిచి పట్టణంకి పారిపోలేదన్నారు.యువరాజుగా చక్రం తిప్పిన నువ్వు 2023 ఎన్నికల్లో నీకు మెజారిటీ ఎందుకు తగ్గిందో అర్థం చేసుకోనన్నారు. మీ స్వంత చెల్లి మీ పార్టీని వదిలీ వెళ్ళిందో అప్పుడే మీ పార్టీ పరిస్థితి ప్రజలకు తెలిసిందన్నారు. మీలాగా సర్పంచ్ లను ఇబ్బందులకు గురిచేయడం లేదని కెటిఆర్ ఫ్రస్టేషన్ లో ఏదో మాట్లాడు తున్నాడని అలాంటి వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. కేటీఆర్ హత్య రాజకీయాలపై మాట్లాడడం హాస్యాస్పదమని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయకుని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే, చంపడానికి యత్నిస్తున్న మీరు హత్యా రాజకీయాల గూర్చి మాట్లాడే హక్కు లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, గడ్డం నరసయ్య, బొప్ప దేవయ్య భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన బల్మూరి పాపారావు ,ఉప సర్పంచ్ ఎడపల్లి జమున తో సహా పలువురు వార్డ్ సభ్యులు ,చొప్పదండి ఎమ్మెల్యే మేడి పెల్లి సత్యం సమక్షం లో సోమవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోందని , ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందనీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందనీ, చొప్పదండి నియోజక వర్గం లోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

## స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పోలింగ్‌కు ప్రజలు సహకరించాలి: డిసిపి

**ప్రజాపక్షం/పెద్దపలి:** స్వేచ్ఛాయుత,నిష్పక్షపాత పోలింగ్ కు ప్రజలు సహకరించాలని పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రూరల్ పరిధిలోని రాఘువాపూర్, అప్పన్నపేట, పెద్ద కల్వల, సుల్తానాబాద్ మండలం, ఎలిగేడు మరియు పోత్కపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించి, పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలతో మాట్లాడి ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు కాపాడుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూస్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్, ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలనీ, ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగేందుకు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలనీ,గొడవలు చేయడం లేదా ఉద్రిక్తత సృష్టించడం చేయరాదనీ, ఇతర ఓటర్లను భయపెట్టడం, ప్రభావితం చేయడం లేదా ఓటు హక్కును అడ్డుకోవడం నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా

# స్థానిక ఎన్నికల ప్రచారం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ ,బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి సర్పంచులుగా గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిణ్ కుమార్ పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా,సోమవారం మండల కేంద్రంలోని చందోలి,గొల్లపల్లి గ్రామాల్లో మంత్రి అడ్లూరి స్థానిక ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పాలన మరింత బలోపేతమైందని ప్రజల నిత్యావసరాలు, జీవన భద్రత దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు.గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందన్నారు .గత ప్రభుత్వాలు పదేళ్ల కాలంలో పేదలకు ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు .కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి నీడ కల్పించిందన్నారు .మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రైతుబంధు ,రైతు బీమా అందించిందని అన్నారు .మండల సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి, మంచిర్యాల అభివృద్ధికి రూ.4,000 కోట్లు: ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు సంబంధించిన రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వివరాలను అడిగారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రాజెక్టుల స్థితిగతులపై పూర్తి వివరాలతో సమాధానం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారనీ తెలంగాణకు తీసుకురావాల్సిన సెమీకండక్టర్ ఫెసిలిటీ రాజకీయ కారణాలతో ఆంధ్రప్రదేశ్‌కు తరలించడంపై ఎంపీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాజెక్టు తెలంగాణకు వచ్చి ఉంటే వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగేవని పేర్కొన్నారు. స్పష్టమైన ప్రపోజల్ ఇవ్వాలని కేంద్రం సూచించగా, దానిపై అన్ని అవకాశాలు పరిశీలిస్తామని మంత్రి తెలిపారనీ, మంత్రి అశ్విని వైష్ణవ్‌ను వ్యక్తిగతంగా కలిసి, పెద్దపలి, మంచిర్యాల ప్రాంతంలో ఉన్న నీటి వనరులు, భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన యువత ప్రతిభను వివరించారు. రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, ఈ ప్రాంతం పరిశ్రమలకు అత్యంత అనుకూలమని తెలిపారు. సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు అయితే రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు గణనీయమైన ప్రయోజనం ఉంటుందని వినతి పత్రం అందజేసి ఆశాభావం వ్యక్తం చేశారు.

## బ్రిడ్జిని వెంటనే నిర్మించండి

సిపిఐ పార్టీ జిల్లా సహాయకార్యదర్శ గడిపె డిమాండ్



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** స్థానిక ఎన్నికల లేక గ్రామాల్లో అభివృద్ధి నిలిచి పోయిందని , కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నికల అనంతరం హుస్నాబాద్ కూత వేటులో ఉన్న గాంధీనగర్ పురాతన బ్రిడ్జిని కూల్చి వెంటనే కొత్త బ్రిడ్జిని నిర్మించాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయకార్యదర్శ గడపె మల్లేశ్ ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. సోమవారం అయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల గాంధీనగర్‌లో సిపిఐ పార్టీ అభ్యర్తికి ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కనీసం సీసీ రోడ్డులు, డ్రైనేజి వ్యవస్థ సరిగా లేక తీవ్రంగా ఉందని అరోపించారు. రాష్ట్రంలో ఎన్నికలు లేక ఎక్కడి పనులు అక్కడే అగిపోయాయనిఅన్నారు. గ్రామాల్లో ప్రజల కోసం పని చేసే పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పేదల కోసం పోరాటం చేసే భారతకమ్యూనిష్టు పార్టీని అదరించిజాగీరు లక్ష్మి పుట్ బాల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను గడిపె మల్లేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిపిఐ పార్టీ సర్పంచు అభ్యర్థి జాగీరు లక్ష్మి, పొదిల కూమారస్వామి, సంజీవరెడ్డి, మహిళ నాయకురాలు గూడ పద్మ, మల్లారెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, రాయిల్లశొభ, డి రాజవ్వ, పోదిల సంపత్,సాయి నవీన్‌లు పాల్గోన్నారు.

## వీ-హబ్ భవన పనులు పూర్తి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వీహబ్ భవన పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం పెద్దపల్లి మండలంలోని రంగంపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న వీహబ్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన వీహబ్ లో సిసి కేమేరాలు, ఏసీ లను త్వరగా ఫిక్స్ చేసి 3 రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేలా వీహబ్ భవనాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా జిల్లాలో మహిళలకు చాలా మేలు చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పవన్ ,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా మూడవ విడుత పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి





**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో మూడవవిడుతలో 9 మండలాలు, 163 గ్రామపంచాయతీలు, 1432 వార్డుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హైమావతి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఆర్డీఓ, ఎంపిడిఓలు, ఎంపిఓ, తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం అయిన గ్రామాలు, వార్డులను మినహాయిస్తూ మిగిలిన పోలింగ్ స్టేషన్లకుఏర్పాట్లు చేయాలన్నారు. డిస్టిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బంది2 ఆర్ఓలు, పిఓ, ఓపిఓలకు, టెబుల్స్, కుర్చీలు,హ మైక్‌సిస్టమ్, పోలింగ్ మెటిరియల్, ప్రతిది బెటర్ అరెంజ్మంట్ చేయాలన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఏలాంటి కొరత లేకుండ చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ రోజు సిబ్బందికి మాస్టర్ ట్రైనర్‌చే సందేహాలకు పరిష్కారం చూపాలన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి సరిపడు బస్సులు, పోలింగ్ మెటిరియల్ పంపిణి చేసుకొని ఆయా జోనల్ ఆఫీసర్లు కేటాయించిన రూట్లో లంచ్ తర్వాత పోలింగ్ స్టేషన్‌కు వెళ్లెందుకు సిద్ధం కావాలని తెలిపారు. జోనల్ అధికారి, రూట్ అధికారులు, మీకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ సిబ్బందికి కాంటాక్ట్ లో ఉండాలి ఆదేశించారు. 17న ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించి 7 గంటలకు ఓటింగ్ ప్రారంభించి, మధ్నాహ్నం 1 గంటవరకు ఓట్లను ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కుకు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ శాతం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పిసిఈఓ రమేశ్, డిపిఓ రవీందర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మూడవ విడుత పో లింగ్ జరిగే 9 మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ. ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్య సంస్థలు ప్రభుత్వం సెలవు ప్రకటించారు.

## మూడో విడత ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తో సమీక్షించారు. గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికలు నిర్వహించే మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

**ఐదు మండలాల్లో నిషేదాజ్ఞాలు అమలు**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరగనున్న మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రశాంత నిర్వహణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడో విడతలో వీణవంక , ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి.సైదాపూర్ ఐదు మండలాల పరిధిలో ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని, ఈ మండలాల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం లేదా సమావేశం కావడం పూర్తిగా నిషేదమని సిపి పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమీషనర్ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మిట్టపల్లి సర్పంచ్ ఫలితం ఊహించిందే...

చైర్మన్ శ్రీనివాస్ ఆధిపత్యం కొనసాగింది

అధికారుల వైఫల్యంతో

అర్ధరాత్రి వరకు ఉత్కంఠ

ఎన్నికల భద్రతలో పోలీసులు సక్సెస్





సర్పంచ్ ఎన్నికల్లో..శ్రీనుల సితార మారేనా...


మిట్టపల్లి సర్పంచ్ బరిలో నలుగురు శ్రీనులు..

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట నియోజకవర్గం లో రెండవ విడుత ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా చిన్నోదూర్ నుండి ఇట్టబోయిన శ్రీనివాస్,మిట్టపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా చింతల శ్రీనివాస్,సిద్దిరబోయిన శ్రీనివాస్(ఎస్ఎం),సిద్దిరబోయిన శ్రీనివాస్,వరికోలు శ్రీనివాస్‌లు,నాంచార్‌పల్లి నుండి దొమకొండ శ్రీనివాస్‌తో పాటు సిద్దిపేట నియోజకవర్గంలో పలువు శ్రీనివాస్‌లు తమ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. ప్రధానంగా అందరి చూపు సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో నలుగురు శ్రీనివాస్‌లు పోటీ పడడం గమనార్హం. అందులో ప్రస్తుత పిఏసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్.మాజీ పిఏసిఎస్ చైర్మన్ సిద్దరబోయిన శ్రీనివాస్‌ల మధ్య తీవ్రమైన పోటీ ఉందనే సమాచారం. గత సర్పంచ్ ఎన్నికల్లో పిఏసిఎస్ చైర్మన్‌లుగా కొనసాగిన వారే ఆధిపత్యం చూపారు. ప్రస్తుతం పిఏసిఎస్ చైర్మన్ పదవిలో కొనసాగుతున్న చింతల శ్రీనివాస్,మాజీ చైర్మన్ సిద్దరబోయిన శ్రీనివాస్‌ల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు కొనసాగుతుందనే సమాచారం. మరి ఆనవాయితీ కొనసాగుతుందా లేదా అనే విషయం ఆదివారం తేలనుంది.

**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల ఫలితాలను ప్రజాపక్షం పత్రిక ముందు చెప్పినట్లే గ్రామ ప్రజలు ఆనవాహితిని నిజం చేశారు. ప్రజాపక్షం పత్రికలో ఈ నెల 12 విశ్లేషణాత్మక "శ్రీనుల సితార మారేనా"కథనంలో గతంలో పిఎసిఎస్ చైర్మన్‌ల ఆధిపత్యం కొనసాగినదని..ఈ ఎన్నికల్లో కూడా కొనసాగుతదని,ప్రస్తుత పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్(తిరుపతి) గెలుపొందే అవకాశం ఉందనే విషయం ప్రజాపక్షం పాఠకులకు తెలియజేసింది. అనుకున్నట్లుగానే మాజీ పిఎసిఎస్ చైర్మన్ సిద్దరబోయిన శ్రీనివాస్(667)పై ప్రస్తుత పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్(1197) 530 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందాడు. ప్రజాపక్షం కథనం నిజమైనదని ఆ గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. మిట్టపల్లి గ్రామంలో ఓట్ల లెక్కింపు ఆలస్యం కావడం, ఉపసర్పంచ్ ఎన్నికలో ఆధికారుల వైఫల్యంతో అర్ధరాత్రి వరకు ఉత్కంఠ కొనసాగినది. ఎన్నికల అధికారి ఓ అభ్యర్థికి అనుకూలంగా పని చేశాడని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు. ఇలాంటి అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల కేంద్రం వద్ద అభ్యర్థుల మద్దతు దారులు ఎక్కువ సంఖ్యలో గుమిగూడారనే సమాచారంతో సిద్దిపేట ఎసిపి,సిద్దిపేట త్రీటౌన్ సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మిట్టపల్లి గ్రామంలో నువ్వా నేనా అన్నట్లు అభ్యర్థుల మద్దతుదారులు ప్రచారం చేయడంతో గ్రామంలో ఎన్నికల వేడి రాజుకుంది, గ్రామంలో ఎలాంటి గొడవలు కాకుండా శాంతి భద్రతలు కాపాడడంలో త్రీ టౌన్ పోలీసుల విజయం సాధించారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## సిఎంఆర్ రూ.8.50 కోట్ల బియ్యం దోపిడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు




**ప్రజాపక్షం/ముత్తారం:** పేద ప్రజల కోసం ఉచిత రేషన్ బియ్యం అందించేదుకు ప్రభుత్వం ఐకెపి ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన వడ్లను మిల్లింగ్ చేసి ఎఫ్ సి ఐ కి బియ్యం అందించాల్సిన రైస్ మిల్లర్ యజమాని సిఎంఆర్ ఎగవేత పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు మంథని డివిజన్ దళిత సంఘం నాయకుడు ఊట్ల శ్రీను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ను కలసి ఎఫ్ సి ఐ కి అప్పగించాల్సిన సిఎంఆర్ బియ్యం శ్రీ వెంకట సాయి ఇండస్ట్రీస్ చేసిన దోపిడి గురించి కలెక్టర్ కి వివరించారు.ఈ సందర్భంగా ఊట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంథని మండలంలోని కూచ్రాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ వెంకటా సాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల యజమానులైన చెల్కల అశోక్ కుమార్, బోడ సంపత్ రెడ్డి, చెల్కల స్వర్ణలత, బోడ సరోజన లు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ 8 కోట్ల 50 లక్షల పైచిలుకు ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు తెలిపారు పేద ప్రజలకు చెందిన బియ్యాన్ని అడ్డగోలుగా దోచుకున్న వారిపై ఇంకా ఎలాంటి చర్య తీసుకోలేదని అన్నారు పేద ప్రజల సొమ్మును ఎంత రికవరీ చేశారో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలన్నారు పేదోడు తప్పు చేస్తే జైల్లో వేస్తారు కానీ ధనవంతుడు దోచుకుంటే మాత్రం అరెస్టు చేయరా అని అన్నారు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఎంక్వైరీ చేస్తానని తెలిపినట్లు ఊట్ల శ్రీనివాస్ తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని, పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి పల్లెల అభివృద్ధికి తోడ్పడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు పిలుపునిచ్చారు. సోమవారం రోజున పెద్ద పల్లి మండలంలోని నిట్టూరు, పెద్దకల్వల, అప్పన్నపేట, బొంపల్లి, కనగర్తి, పాలితం, కాసులపల్లి, తురకల మద్దికుంట గ్రామాలలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ తోనే పల్లెల ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేయవచ్చని, దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వొడిదుడుకులనుఎదుర్కొంటూనే అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువెల్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఉచిత కరెంటు, రెండు లక్షల రుణ మాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10 లక్షలకు పెంపు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్నవడ్లపై బోనస్, కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు వంటి ప్రజా ఉపయోగ పనులను తాము అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి ఎన్నికల్లో తాము బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు చేయబోయే పనులను వివరించగా వాటన్నిటికీ ఎమ్మెల్యేగా నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెండేళ్ల పదవీ కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానని, గ్రామాల్లో తాను సూచించిన వారిని సర్పంచులుగా గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్థాయిని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రీల్



## నేడు 'ఛాంపియన్' ట్రైలర్

ఫ్రెష్, ఆకట్టుకునే కథలను అందించడంలో స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది.ఈ నేపథ్యంలో తెరకెక్కిన ఛాంపియన్ ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలింస్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అర్చన కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన గిరిగిర, సల్లంగుండాలే పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. తాజాగా మేకర్స్ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. నేడు ట్రైలర్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ట్రైలర్ అనౌన్స్‌మెంట్ వీడియోలో రోషన్ ఫెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ అద్భుతమైన ఆల్బమ్ కంపోజ్ చేశారు. తోట తరణి ప్రీ-ఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతమైన డీటెయిల్స్‌తో రిక్రియేట్ చేశారు. ఆర్.మధి కెమెరా వర్క్ ఆ ప్రపంచంలోకి మనల్ని లీనం చేస్తుంది. ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను కోటగిరి వెంకటేశ్వర రావు నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'ఇట్లు అర్జున'లో నాగార్జున వాయిస్



వాల్ నెక్స్ట్ ఎంటరైన్మెంట్స్ తన తొలి ప్రొడక్షన్ 'ఇట్లు అర్జున'తో ప్రారంభించింది. సక్సెస్‌ఫుల్ దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన వెంకీ కుడుముల, కంటెంట్ బేస్డ్ కథలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్మాతగా కొత్త జర్నీని ప్రారంభించారు. నూతన దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనీష్ ను హీరోగా పరిచయం చేస్తున్నారు. అనస్వర రాజన్ హీరోయిన్. తాజాగా విడుదలైన 'సోల్ ఆఫ్ అర్జున' ఈ మూవీ వరల్డ్‌ను అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఈ గ్లింప్స్ కింగ్ నాగార్జున అందించిన మ్యాజికల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమవుతుంది. ప్రేమ నృత్యత, లోతును ఆయన మాటలు గొప్ప ఆవిష్కరిస్తాయి. ఆ వర్గంలోనే అర్జున పరిచయమౌతాడు. అర్జున మాట్లాడలేడు, కానీ నిశ్శబ్దం అతనిని బలహీనపరచదు, అతని భావోద్వేగాలను తగ్గించదు. అతని ధైర్యం, బలం ఈ టీజర్లో ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంది. హీరోగా అనీష్ ఆకట్టుకునే నటన కనబరిచాడు. ఫిట్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. డైలాగ్స్ కు ఆస్కారం తక్కువగా ఉండే పాత్రలో భావ వ్యక్తీకరణ, బాడీ లాంగ్వేజ్‌తో కథను మోయడం ప్రశంసనీయం. కళ్లలో కనిపించే ఇంటెన్సిటీ అతన్ని పూర్తి హీరో మెటీరియల్‌గా నిలబెడతాయి. సాహసోపేతమైన జంప్స్, రా ఫిజికాలిటీతో కూడిన యాక్షన్ షాట్స్ గొప్ప యూఫోరియా చేశాడు.

## ఇలాంటి సినిమాలు మళ్లీ మళ్లీ రావు



### అఖండ-2 సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ

అఖండ లాంటి సినిమాలు ఒకే సారి వస్తాయని, ఇలాంటి సినిమాలు వచ్చినప్పుడే ప్రేక్షకులు ఆదరిస్తారని హీరో బాలకృష్ణ అన్నారు. అఖండ-2 సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ.. అఖండ లాంటి సినిమాలు మళ్లీ మళ్లీ రావు అని వ్యాఖ్యానించారు. విడుదల అయిన అన్ని ప్రాంతాల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. అందరం ఐక్యమత్యంతో ఉంటే ఇంకా బలంగా ముందుకు వెళ్తాం. ప్రతి సినిమా మన సినిమాలనే భావించాలని కోరుతున్నాను. ఈ సినిమా ఎప్పుడు వచ్చినా బాక్సులు బద్దలవుతాయని నమ్మకంతో మేమున్నాం. అదే రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. బాలయ్యతో ఐదు సినిమాలు ఐదు బ్లాక్‌బస్టర్ హిట్స్ కొట్టాము. చాలా ఆనందంగా ఉంది. గోపీచంద్‌తో మరో సినిమా స్టార్ట్ చేశాం. అది మరో బ్లాక్ బస్టర్ అవుతుందని అని బాలకృష్ణ ఆశా భావం వ్యక్తం చేశారు. గంగాధర శాస్త్రి మాట్లాడుతూ.. ఇన్ని సంవత్సరాల చిత్ర పరిశ్రమలో ఒక సినిమా చూసి తరించామనే గొప్ప అనుభూతితో ప్రేక్షకుడు బయటికి వచ్చిన అరుదైన సినిమా అఖండ 2. ఈ సినిమా ఆత్మ బాలకృష్ణ, ఆలోచన బోయపాటి, శబ్దం తమన్ ఈ ముగ్గురు కూడా తపస్సులు. భగవంతుడే వారిని ఈ సినిమా కోసం ఎంపిక చేసుకున్నారు. బాలకృష్ణ గారు కాకపోతే ఈ సినిమా మరొకరికి సాధ్యపడదు. ఇలాంటి సినిమా చేయాలంటే పూర్వజన్మ సుకృతం ఉండాలి. రామారావు గారి అంశ బాలకృష్ణ రూపంలో ఉంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగిన సినిమా. ఇలాంటి సినిమా బాల కృష్ణ ఒక్కరు మాత్రమే చేయగలరు అని అన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను, సంగీత దర్శకుడు తమన్, రచ్చ రవి, ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్, లిరిక్ రైటర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'పతంగ్' ట్రైలర్ ఆవిష్కరణ



సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'పతంగ్' పతంగుల పోటీతో రాబోతున్న ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇది. సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్యూన్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప ఫేమ్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. పాపులర్ దర్శకుడు నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. 25న ప్రపంచ వ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ భారీ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకుడు దేవకట్టా విడుదల చేశారు. ఈసందర్భంగా దేవకట్టా మాట్లాడుతూ.. ట్రైలర్ ఎంతో ఎనర్జిటిక్, ఎంటర్టైనింగ్‌గా అనిపించింది. రష్యు ఈ సినిమాకు వన్ ఆఫ్ ద ప్రొడ్యూసర్ అవ్వడం హ్యాపీగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు ఈ సినిమా హీరో ప్రణవ్ నరిగ మన అందరికీ తెలుసు. ఇదొక కొత్తరకమైన సినిమా. ఈ సినిమా చాలా కష్టపడి తీశారు. ట్రైలర్ చూడగానే సూపర్ థ్రిల్లింగ్ ఫీలయ్యాను. ఓ సూపర్‌హిట్ సినిమాకు ఉండాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి అని చెప్పారు. సహ నిర్మాత రష్యు మేములపాటి మాట్లాడుతూ.. పతంగ్ పోటీ అనేది అందరికి చిన్నప్పటి నుంచి మంచి అనుబంధం ఉంటుంది. ఈ సినిమా తప్పకుండా అందరికి కొత్త అనుభూతినిస్తుంది. రియల్ స్టిక్ సినిమాటిక్ ఫీల్‌ను కలిగిస్తున్నారు. వంశీ పూజిత్ మాట్లాడుతూ.. నేను ట్రైలర్ ఇప్పుడు చూశాను. మైండ్ బ్లోయింగ్ అనిపించింది. పతంగుల కాంపిటీషన్ షాట్లు వీఎఫ్ఎక్స్‌లో అద్భుతంగా చేశారు. చివరి 30 నిమిషాలు పతంగ్ కాంపిటీషన్ ఎపిసోడ్ సూపర్‌గా ఉంటుంది. ఈ సినిమా విడుదల రోజు నా పుట్టినరోజు కావడం విశేషమన్నారు.

ఈ కార్యక్రమంలో రాహుల్ మోపిదేవి, సీఈవో ఆదినారాయణ, నాని బండ్రెడ్డి, నిర్మాత సంపత్ మక తదితరులు పాల్గొన్నారు.

## దూసుకెళ్తున్న 'దేఖ్లేంగే సాలా'



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్లేంగే సాలా' విడుదలై శ్రోతలను ఉర్రుతలూగిస్తోంది. కేవలం 24 గంటల్లోనే 29.6 మిలియన్లకు పైగా వీక్షణలతో రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించి, హిట్ పాటగా నిలిచింది.దేవి శ్రీ ప్రసాద్ సమకూర్చిన సంగీతం ఎంతో ఆకర్షణీయంగా ఉండి, సంగీత ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలాగే, పవన్ కళ్యాణ్‌కి సరిగ్గా సరిపోయేలా దినేష్ మాస్టర్ సమకూర్చిన నృత్యరీతులు కూడా భారీ ప్రశంసలను అందుకుంటున్నాయి. ఇక ప్రేరణాత్మకమైన, వాణిజ్యపరమైన అంశాల కలయికలో భాస్కరభట్ల రాసిన సాహిత్యం పాట విజయంలో కీలక పాత్ర పోషించింది. 'దేఖ్లేంగే సాలా' పాటతో పవర్ స్టార్ అభిమానులకు హరీష్ శంకర్ విందు:'దేఖ్లేంగే సాలా' పాట ఇంతటి విజయం సాధించడానికి ప్రధాన కారణం దర్శకుడు హరీష్ శంకర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. సంగీతం విషయంలో ఆయనకు మంచి అభిరుచి ఉంది. హరీష్ శంకర్ గత చిత్రాలలోని పాటలు వింటే ఆ విషయం స్పష్టమవుతుంది.

## బాబి సింహా కొత్త సినిమా షురూ



యువ ఫిలింస్ బ్యానర్‌పై బాబీ సింహా హీరోగా తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నిర్మాత ఎస్‌కెఎన్ క్లాప్ కొట్టగా తనికెళ్ళ భరణి, వంశీ కెమెరా స్విచాన్ చేశారు. తమిళ, తెలుగు భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభం కానుంది.

## 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి' షూటింగ్ ప్రారంభం



తెలుగు చిత్రసీమలోకి మరో మహిళా నిర్మాత అరంగేట్రం చేస్తున్నారు. ఆమె పేరు జి.శైలజా రెడ్డి, సీనియర్ దర్శకుడు శివాల ప్రభాకర్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'. జి.ఎస్.ఆర్. మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంతో యువ కిశోరం పవన్ మహావీర్ హీరోగా పరిచయమవుతున్నాడు. సుహాన మేఘశ్రీ హీరోయిన్లు. సీనియర్ నటులు సుమన్, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మి శైలజ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని సారధి స్టూడియోలో అత్యంత ఘనంగా జరిగింది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రచనా బాహుబలి వి.విజయేంద్రప్రసాద్ క్లాప్ కొట్టగా... నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. సీనియర్ ఐ.పి.ఎస్. అధికారి ఘట్టమనేని శ్రీనివాస్ కెమెరా స్విచ్ఆన్ చేశారు. ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, శోభారాణి, ప్రముఖ రచయిత జె.కె.భారవి తదితరులు ఈ వేడుకలో పాల్గొని నిర్మాతలను అభినందించారు.

## సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'మిస్టీరియస్'



రోహిత్ హీరోగా అబిద్ భూషణ్ పోలీస్ పాత్రలో నటించిన సినిమా 'మిస్టీరియస్'. రియా కపూర్, మేఘనా రాజ్ పుత్ నటీనటులుగా మహి కోమటి రెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్‌పై జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 19న వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మూవీ హైలైట్స్‌ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో నిర్మాత జయ్ వల్లందాస్ తెలిపారు. ఈ మూవీ స్టోరీ మహి చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది. తొలి ప్రయత్నంలో ఒక కథా బలమున్న మంచి సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను నిర్మించడం సంతృప్తిగా ఉంది. మా మూవీ టైటిల్ బాగుందనే రెస్పాన్స్ వస్తోంది. మా సినిమాను ఈ నెల 12నే రిలీజ్ చేయాల్సిఉంది. అయితే అఖండ–2 రిలీజ్ కారణంగా ఒక వారం ఆలస్యంగా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. 150 థియేటర్స్ కు పైగా గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నాం. ఇన్నోవేటివ్ స్క్రీన్ ప్లే, సస్పెన్స్ ఎలిమెంట్స్ తో సినిమా సాగుతూ ప్రేక్షకుడిని ఆద్యంతం ఒక కొత్త అనుభూతికి లోను చేస్తుంది. సెన్సార్ నుంచి కూడా మా మూవీకి అభినందనలు దక్కాయి. ఒక డిఫరెంట్ సినిమా చేశారని వారు చెబుతూ.. మా సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు.అనేక మలుపులతో 'మిస్టీరియస్' సినిమా ఉంటుంది. యాక్షన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ హైలైట్ గా నిలుస్తాయి. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకునే చిత్రమిది. మా సినిమాలో మూడు పాటలు ఉన్నాయి. సంగీత దర్శకుడు ఎంఎల్ రాజా ఛాట్ బస్టర్ మ్యూజిక్ అందించారు. 'మిస్టీరియస్' సినిమా తర్వాత టాలీవుడ్‌లో వరుసగా చిత్రాలు నిర్మించాలనే ప్లాన్ చేస్తున్నాం.

## మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని

# నిర్వీర్యం చేసే కుట్ర

### కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును, ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే గాంధీజీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్ర నిర్ణయాలు ఉన్నాయని విమర్శించారు. పథకం పేరును వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) విబిరామ్‌జీగా మార్చే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో వంద శాతం నిధులు కేంద్రమే భరిస్తే, ఇప్పుడు 60శాతానికి తగ్గించి 40శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమన్నారు. చట్టం ప్రకారం 100 రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నా, బిజెపి ప్రభుత్వం ఏ ఏడాదీ 42 రోజులకు మించి పని కల్పించలేదని ఆరోపించారు. తెలంగాణలో గత ఏడాది 12.5 కోట్ల పని దినాలు కల్పిస్తే, ఈ ఏడాది కేవలం 7.5 కోట్ల పని దినాలకు పరిమితం చేశారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, పూర్తి నిధులతో కేంద్ర ప్రభుత్వమే పథకాన్ని అమలు చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

## విద్యార్థులలో పట్టుదలను పెంపొందించేందుకు

# క్రీడలు దోహదం



### జాతీయ బాస్కెట్ బాల్ కోచ్ కె.విశాల్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, పట్టుదల, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడుతాయని జాతీయ మాజీ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, జాతీయ కోచ్ కె.విశాల్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని డిఆర్‌ఎస్ ఐఎస్ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు జరిగే డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 23వ వార్షిక క్రీడా పోటీలను సోమవారం విశాల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన మార్చ్ ఫాస్ట్ విద్యార్థుల నుండి అయన గౌరవ వందనం స్వీకరించి, క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విశాల్ కుమార్ ప్రసంగిస్తూ క్రీడలు పిల్లలలోని మెదడు చురుకుగా మార్చి శాస్త్రీయంగా లోచింపజేస్తాయని, తద్వారా విద్యాపరంగా మెరుగ్గా రాణించగలరన్నారు. క్రీడలతో విద్యార్థులు మంచి సమన్వయాన్ని, సృజనాత్మకంగా ఉండటం నేర్చుకుంటారన్నారు. డిఆర్‌ఎస్‌ఐఎస్ డైరెక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితాల్లో బహుముఖ, సమగ్ర పాత్ర పోషిస్తాయని, శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా, జీవితంలో విజయానికి కీలకమైన జట్టు కృషి, సమయ నిర్వహణ, క్రీడా స్ఫూర్తి వంటి విలువలను కూడా పెంపొందిస్తుందన్నారు. డిఆర్‌ఎస్‌ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ.వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, సమయ నిర్వహణ, నైపుణ్యాలను ప్రోత్సహించడం ద్వారా విద్యా పనితీరును మెరుగుపరుస్తాయన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ హెడ్ డాక్టర్ మురమళ్ళ భరత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

## భారీ పేలుడు (మొదటి పేజీ తరువాయి)

ఉండడంతో గ్రామస్తులు సైతం భయాందోళనకు గురై పారిశ్రామ వద్దకు చేరుకుని అటు కార్మికులు ఇటు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మాగ్రామాల నుండి ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. గతంలో సైతం పరిశ్రమలో చాలామంది మృతి చెందినట్లు గ్రామస్తులు ఆరోపించారు. పరిశ్రమ వల్ల నీటి కలుషితమై గ్రామస్తులంతా రోగాల బారిన పడుతున్నారని సౌండ్ పొల్యూషన్‌తో వృద్ధులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని జీవిస్తున్నారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన గాయాల పాలైన వారికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

## వ్యాపారి పరార్ (మొదటి పేజీ తరువాయి)

చేయడంలో తంటాలు పడుతున్నారు. కోర్టు ఆదేశంతో పోలీసు కస్టడీకి తీసుకున్న నిందితుడిని సిసిఎస్ పోలీసులు సోమవారం విచారించారు. అయితే విచారణలో పొంతనలేని కథనాలు చెబుతున్నట్లు తెలిసింది. దీంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హుస్సేనీఆలంలో అద్దెకు నివాసముంటున్న సహదేవ్ దత్త, సరబాని దత్త దంపతులు. వీరు నగలు తయారు చేసి ఇచ్చే పనిచేస్తుంటారు. కొత్త నగలు తయారు చేసి ఇస్తానని స్థానికంగా పలువురు బాధితులను నమ్మించి వారి నుంచి సుమారు 4 కిలోలకుపైగా నగలను తీసుకున్నాడు. రెపోమాపో తమ బంగారు నగలు చేసి ఇస్తాడని నమ్మిన బాధితులకు సహదేవ్ మోసం చేసి ఇల్లు ఖాళీ చేసి పారిపోయాడు. దీంతో హుస్సేనీఆలంకు చెందిన ఒషిన్ హై స్కూల్ యజమాని ఎ.ప్రభాసోని ఈ మేరకు సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎట్టలకేలకు సహదేవ్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. కోర్టు ఆదేశంలో సోమవారం రిమాండ్‌లో ఉన్న సహదేవ్‌ను పోలీసు కస్టడీకి తీసుకున్నారు. అయితే బాధితుల దగ్గర తీసుకుపోయిన బంగారు నగలను ఎవరికిచ్చావనే విషయంపై పోలీసులు ఆరా తీయగా పొంతనలేని కథనాలు చెబుతున్నారు. పోలీసుల విచారణలో ప్రభాసోని వద్ద నుంచి 720 గ్రాములు, రవి నుంచి 480 గ్రాములు, శోభారాణి నుంచి 500 గ్రాములు, టి.ప్రమోద్ కుమార్ నుంచి 200 గ్రాములు, సుభోద్‌కుమార్ నుంచి 100 గ్రాములు, రిశికాంత్ నుంచి 230 గ్రాములు, పల్లవి నుంచి 200 గ్రాములు, పింటుమండల్ నుంచి 550 గ్రాములు, బాపిసమంత నుంచి 130 గ్రాములు, అరుణ 20 గ్రాములు, రాజమోహన్‌సింగ్ నుంచి 650 గ్రాముల బంగారాన్ని నిందితుడు తీసుకున్నట్లు విచారణలో అంగీకరించారు. అంతే కాక మిగతా బాధితుల నుంచి కూడా తీసుకున్నట్లు విచారనలో నిందితుడు తెలిపాడు. అయితే ఈ బంగారం ప్రస్తుతం ఎవరికి విక్రయించాడనే విషయంపై మాత్రం నిందితుడు నోరు మెదపడం లేదు. దీంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు.

## అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

మాదిరిగానే ఈ నెల 12న ఉదయం 9 గంటలకు ముగ్గురు కూలీ పనులకు వెళ్లగా ముగ్గురు పిల్లలు ఇంట్లో ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు దంపతులు కూలీపనులు ముగించుకుని ఇంటికి రాగ చిన్న కూతురు (14) కనిపించలేదు. వెంటనే అదే రోజు బాధితులు పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుల ఎలాంటి కేసు నమోదు చేయలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఎట్టకేలకు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు బాధిత బాలకను పోలీసులను కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను మాత్రం పోలీసు స్టేషన్‌లో బంధించారు. అత్యాచారం జరిగినట్లు ఎవరికి చెప్పవద్దని బాధితులను పోలీసుల భయపెట్టి పంపించారు. స్టేషన్‌లో ఉన్న యువకులతో రెండు రోజులుగా పోలీసులు బేరం కుదుర్చుకునే పనిలో పడ్డారు. మూడో రోజు సోమవారం బాధితుల ద్వారా ఉన్నతాధికారులకు అత్యాచార విషయం తెలిసింది. మహేశ్వరం డిసిపి కె.నారాయణరెడ్డి స్పందించడంతో పహాడీషరీఫ్ పోలీసులు బాధితులకు ఫోన్ చేసి స్టేషన్‌కు రప్పించుకున్నారు. బాలిక నుంచి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కిడ్నాప్‌కు గురైనే బాలిక ఆచూకీ లభించిన మూడు రోజుల తరువాత పోలీసులు వైద్య పరీక్షలకు పంపడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాలిక ఆచూకీ తెలిసిన రోజే ఆమెకు వైద్య పరీక్షలు చేయించి ఉంటే కేసు మరింత పటిష్టంగా ఉండేదని బాధితులు చెబుతున్నారు. కేసును తారుమారు చేసేందుకే పోలీసుల కావాలని బాలిక నుంచి వాంగ్మూలం తీసుకోలేదని, అలాగే వైద్య పరీక్షలు కూడా పంపలేదనే పలు అనుమానాలు కలుగుతున్నాయి.ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసిన తరువాతనే పహాడీషరీఫ్ పోలీసులు స్పందించారని లేని పక్షంలో ఘటన మరుగున పడిపోయేదని పలువురు అంటున్నారు.

**కఠినంగా శిక్షించాలి :** బాలల హక్కుల సంఘం బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడితో పాటు కిడ్నాప్‌కు పాల్పడిన యువకులకు కఠిన శిక్షలు పడే విధంగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టాలని బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు బి.అనురాధ అచ్యుతరావు డిమాండ్ చేశారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని కూడా వెంటనే అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఓటర్ల తొలగింపు!

(మొదటి పేజీ తరువాయి)

2002 నాటి ఓటర్ల జాబితాలలో లేని 30 లక్షలమంది పైగా పేర్లను 'నో మ్యాపింగ్' జాబితాలో చేర్చారు. మంగళవారం (డిసెంబరు 16)న ఎన్నికల సంఘం ముసాయిదా ఓటరు జాబితాలను ప్రకటిస్తుంది. వీటిల్లో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు తెలియజేయడానికి జనవరి 17వ తేదీ వరకూ ప్రజలకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత సుమారుగా 2026 ఫిబ్రవరి 14వ తేదీ నాటికి ఖరారైన ఓటరు జాబితాల తుది ప్రతులను విడుదల చేస్తారు. ఈ 30లక్షలు పైగా ఉన్న ఓటర్లకు సంబంధించిన సమస్యలను, వారు చెప్పే కారణాలను ఈ నెల 17వ తేదీ (బుధవారం) నుండి సంబంధిత సిబ్బంది ఆలకించి నమోదు చేసుకోవడం ప్రారంభిస్తారు. మొత్తానికి వివిధ కేటగిరీల కింద 1.70 కోట్లమంది ఓటర్ల వివరాలను పరిశీలించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ అధికారుల భుజస్కంధాలపై ఉంది. గడువుతేదీ దగ్గర పడుతూ ఉండటంతో చివరి విడత సన్నాహాలు పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు. జిల్లాస్థాయి వెబ్‌సైట్లను రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం క్రియాశీలంగా ఉంచి అందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లు ఈ వెబ్‌సైటు ద్వారా వచ్చే గురువారం (డిసెంబరు 18) నుండి తమ తమ వివరాలను తనిఖీ చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వర్గాల సమాచారం ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాలను ఇప్పటికే అంతర్గతంగా బూత్ స్థాయిలో ఉన్న అధికారుల యాప్‌లలో అప్‌లోడ్ చేశారు. ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేసే సిబ్బందికి బూత్‌ల వారీగా ఈ గణాంకాలను ప్రజలకు విడుదల చేసే అవకాశం ఉంటుంది.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి, బిజెపియేతర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న తరుణంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం భబానీపూర్ ముసాయిదా జాబితాల్లోనే అత్యధికంగా ఓటర్ల తొలగింపు నమోదైంది. అదేసమయంలో ప్రతిపక్ష బిజెపి నాయకుడు సువేందు అధికారి నియోజకవర్గం 'నందిగ్రామ్'లో మాత్రం చాలా తక్కువమంది ఓటర్లు ముసాయిదా జాబితాల నుండి తొలగించేందుకు రంగం సిద్ధం కావడం ప్రాముఖ్యత సంతరించుకుంది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలా తక్కువ మెజారిటీలు ఈ రెండు చోట్లా నమోదయ్యాయి. నువ్వా–నేనా అనే రీతిలో గట్టి పోటీ జరిగింది. కానీ ఎన్నికల అధికారులు మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా కొట్టిపారేశారు. మమతా బెనర్జీకి చెందిన భబానిపూర్‌లో ఎక్కువమంది ఓటర్లు తొలగింపు ప్రక్రియలో లేదని, అంతకంటే ఎక్కువగా కోల్‌కతా ఉత్తర నియోజకవర్గం ఛౌరింఘీలోనే ఎక్కువమంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల నుండి తొలగించే అవకాశం ఉందని చెబుతున్నారు. బీహార్‌లో 'సర్' సందర్భంగా 65 లక్షలమంది పేర్లు తొలగించడంతో దేశవ్యాప్తంగా పెద్ద గందరగోళం చెలరేగిన విషయం తెలిసిందే. ఇప్పుడు బెంగాల్‌లో కూడా అంతకు తక్కువ కాకుండా 59 లక్షలమంది పేర్లు తొలగించే పరిస్థితులు వచ్చాయి.

నవంబరు (గతనెల) నాలుగో తేదీన పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆ రాష్ట్రంలో మొత్తం 7,66,37,529 మంది ఓటర్లు ఉన్నారు. 'మా నిర్ధారణల ప్రకారం రాష్ట్రంలో ముసాయిదా ఓటరు జాబితాలలో ఉన్న మొత్తం 59 లక్షలమంది పేర్లు తొలగిస్తాం' అని బ్లాక్ లెవల్ అధికార్‌రక్షణ కమిటీ సభ్యుడు ఒకరు సోమవారం కోల్‌కతాలో పాత్రికేయులకు చెప్పారు. దీని ప్రకారం ఫిబ్రవరిలో ఖరారయ్యే ఓటర్ల తుది జాబితాలలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారుగా 7.07 కోట్లు పైగా ఉండే అవకాశాలున్నాయి. బెంగాల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయంలో అధికారి ఒకరు గత వారం మాట్లాడుతూ, ఓటరు జాబితాలను తనిఖీ చేసినప్పుడు దాదాపు 56 లక్షలమంది ఓటర్ల సమాచారం లభ్యం కాలేదని, వారందరినీ 'సేకరింప సాధ్యంకాని జాబితా'గా గుర్తులు పెట్టామని చెప్పారు. వివరంగా చెప్పాలంటే, మరణించినవారు, రాష్ట్రంలోనే అంతర్గతంగా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసలు వెళ్ళిపోయినవారు, రాష్ట్రం దాటి వెళ్ళి ఇతర ప్రాంతాలలో స్థిరపడినవారు, జాడ తెలియకుండా ఉన్న ఓటర్లు, ఒకేపేరు పదే పదే జాబితాలలో చోటు చేసుకున్నవారు తదితరులను 'సేకరింప సాధ్యంకాని జాబితా'గా గుర్తులు పెట్టామని ఆయన చెప్పారు. బిజెపి ఆధిక్యంగా ఉండే అసన్‌సోల్ సౌత్, సిలిగురిలలో కూడా గణనీయంగానే ఓటర్లను తొలగించే అవకాశం ఉంద. జిల్లాస్థాయిలో చూస్తే దక్షిణ 24 పరగణాలలో అధికంగా తొలగింపులు జరుగుతాయి. అదేసమయంతో బంకురాలోని కోతుల్‌పురాలో చాలా తక్కువగా తొలగింపులకు అవకాశం ఉంది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకోసం రాష్ట్రవ్యాప్తంగా 90,000 కంటే ఎక్కువమంది బిఎల్‌ఓలను మోహరించారు. 'ఓట్ వర్కర్స్' యునైటెడ్ ఫోరం ప్రధాన కార్యదర్శి స్వపన్ మండల్ మాట్లాడుతూ, వివాదాస్పదమైన పేర్లకు సంబంధించి సమస్యలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయని, వారికి నోటీసులు ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో బిఎల్‌ఓలు కావాలని అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com